


అక్టోబరు-2026

# దర్శనమ్ ®

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

₹ 51/- సంపుటి 23 సంచిక 1 ISSN 2582-2411










श्री श्री जगद्गुरु शङ्कराचार्य महासंस्थानम्,
दक्षिणाम्नाय श्रीशारदापीठम्, शृङ्गेरी
**Sri Sri Jagadguru Shankaracharya Mahasamsthanam**
Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri - 577 139.


Ref : Date :

శృంగేరి 02-09-2026

'దర్శనమ్' పత్రిక సంపాదకులు శ్రీ మరుమాముల వెంకటరమణశర్మ గారికి,

మీరు శ్రీచరణుల సన్నిధిన సమర్పించిన విజ్ఞప్తి పత్రమును శ్రీచరణులు అవలోకించారు.

'దర్శనమ్' పత్రికను ప్రారంభించి 22 సంవత్సరములైన సందర్భంలో ఒక విశేష పత్రికను ప్రచురించనున్నారని తెలిసికొని శ్రీ జగద్గురు మహాస్వామివారు సంతోషించారు.

శ్రీ శారదా చంద్రమౌళీశ్వరుల అనుగ్రహము వలన ఈ సంచిక ఉత్తమ లేఖనములతో కూడుకొని సుందరముగా వెలువడుగాకయనియూ , దర్శనమ్ పత్రిక ఇతోధికముగా ఆస్తిక జనుల ఆదరమును పొందుగాక యనియూ శ్రీచరణులు ఆశీర్వదించినారు.

ఇట్లు

SRI SHARADA PEETHAM SRINGERI-577 139

దర్శనమ్ 22వ వార్షికోత్సవం సందర్భంగా
ప్రచురిస్తున్న వార్షిక సంచికకు
శృంగేరీ జగద్గురువులు ప్రసాదించిన
ఆశీరనుగ్రహ శ్రీముఖం


Phone: 08265 - 250123 / 250192 • Fax: 08265 - 250792
E-mail: info@sringerisharadapeetham.org • www.sringerisharadapeetham.org










దర్శనమ్ ఆధ్వర్యంలో పుష్పగిరి జగద్గురు సంస్థానంలో జరిగిన శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ తొలి శతావధానం విజయోత్సవం-సన్మానం

# కాత్యాయనీస్తుతిః

**శ్రీరామ ఉవాచ -**

నమస్తే త్రిజగద్వంద్యే సంగ్రామే జయదాయిని
ప్రసీద విజయం దేహి కాత్యాయని నమోఽస్తు తే 1

సర్వశక్తిమయే దుష్టరిపునిగ్రహకారిణి
దుష్టజృంభిణి సంగ్రామే జయం దేహి నమోఽస్తు తే 2

త్వమేకా పరమాశక్తిః సర్వభూతేష్వవస్థితా
దుష్టాన్సంహర సంగ్రామే జయం దేహి నమోఽస్తు తే 3

రణప్రియే రక్తభక్షే మాంసభక్షణకారిణి
ప్రపన్నార్తిహరే యుద్ధే జయం దేహి నమోఽస్తు తే 4

ఖట్వాంగాసికరే ముండమాలాద్యోతితవిగ్రహే
యే త్వాం స్మరంతి దుర్గేషు తేషాం దుఃఖహరా భవ 5

త్వత్పాదపంకజధ్యానం కరోమి శరణప్రియే
వినాశాయ రణే శత్రూన్ జయం దేహి నమోఽస్తు తే 6

అచింత్యవిక్రమేఽచింత్యరూపసౌందర్యశాలిని
అచింత్యచరితేచింత్యే జయం దేహి నమోఽస్తు తే 7

యే త్వాం స్మరంతి దుర్గేషు దేవీం దుర్గతి నాశినీం
నావసీదంతి దుర్గేషు జయం దేహి నమోఽస్తు తే 8

మహిషాసృక్ప్రియే సంఖ్యే మహిషాసురమర్దిని
శరణ్యే గిరికన్యే మే జయం దేహి నమోఽస్తు తే 9

ప్రసన్నవదనే చండి చండాసురవిమర్దిని
సంగ్రామే విజయం దేహి శత్రూన్ జహి నమోఽస్తు తే10

రక్తాక్షి రక్తదశనే రక్తచర్చితగాత్రకే
రక్తబీజనిహంత్రీ త్వం జయం దేహి నమోఽస్తు తే 11

నిశుంభశుంభసంహంత్రి విశ్వకర్త్రి సురేశ్వరి
జహి శత్రూన్ రణే నిత్యం జయం దేహి నమోఽస్తు తే12

భవాన్యేతత్సర్వమేవ త్వం పాలయసి సర్వదా



రక్ష విశ్వమిదం మాతర్వత్వైతాన్ దుష్టరాక్షసాన్ 13

త్వం హి సర్వగతా శక్తిర్దుష్టమర్దనకారిణి
ప్రసీద జగతాం మాతర్జయం దేహి నమోఽస్తు తే 14

దుర్వృత్తవృందదమిని సద్వృత్తపరిపాలిని
నిపాతయ రణే శత్రూన్ జయం దేహి నమోఽస్తు తే 15

కాత్యాయని జగన్మాతః ప్రపన్నార్తిహరే శివే
సంగ్రామే విజయం దేహి భయేభ్యః పాహి సర్వదా 16

శ్రీరామకృతా కాత్యాయనీస్తుతిః

# దర్శనమ్

## ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక

**అక్టోబర్ - 2026**

సంపుటి-23 విడిప్రతి: రూ. 25/- సంచిక - 1

ISSN 2582-2411 పేజీలు 68

**ఎస్ఆర్ఎస్ పబ్లికేషన్స్ ప్రచురణ**

స్ఫూర్తిప్రదాత

**కీ.శే. మరుమాముల రాజమౌళిశర్మ**

గౌరవ సంపాదకులు

**యాయవరం చంద్రశేఖరశర్మ, ఆర్.వి.వి. కృష్ణారావు**

**మరుమాముల దత్తాత్రేయశర్మ**

ప్రధాన సంపాదకులు

**మరుమాముల వెంకటరమణశర్మ**

ప్రచురణకర్త, సంపాదకులు

**మరుమాముల రుక్మిణి**

సంపాదక మండలి

**డా. పూర్ణప్రజ్ఞా భారతి, అష్టకాల రామ్మోహన్**

**ఆకెళ్ల విభీషణ శర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి**

**మరుమాముల రామచంద్రమూర్తి**

**ఆదరాసుపల్లి శశిధర్, ప్రసాదవర్మ కామబుుషి**

ప్రత్యేక ప్రతినిధి

**పి.వి.ఎం. పవన్,** 81253 36958

ఉప సంపాదకులు

**రామలక్ష్మీ సుబ్రహ్మణ్యం**

ముఖచిత్రం : **పెమ్మరాజు రవికిషోర్**

**దర్శనమ్**

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

**- : ప్రధాన కార్యాలయం : -**

ఇం.నెం. 29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం

న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56

ఫోన్, ఫ్యాక్స్: 9441015469

e-mail: darshanameditordesk@gmail.com

మార్కెటింగ్: రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ, 9666680857

దర్శనం దర్శనారామ దర్శనం సమదర్శనం
దర్శనం లోక వృత్తాంతాదర్శ దర్శిన్యపేక్షితమ్ ॥
దర్శనాంతర్ముఖి స్పర్శి సద్విమర్శావమర్శనం
దర్శన ప్రతిభూస్థానం జీయాత్ సర్వ నిదర్శనమ్ ॥

**- అష్టకాల నరసింహరామశర్మ**

'దర్శనం దర్శితం యేన దర్శితం సర్వదర్శనమ్
దర్శనం శర్మసంధాతృ దర్శనం దైవదర్శనమ్'

**- అయాచితం నటేశ్వరశర్మ**

## ఈ సంచికలో ...

ధర్మ విజయానికి దివ్యప్రతీక..విజయదశమి ... 7
- చింతలపాటి శివశంకరశాస్త్రి

ద్వావింశతితమ వార్షిక ధర్మదీక్షా దర్శనమ్ ... 11
- బాల సుబ్రహ్మణ్యం

ధర్మజ్ఞాన సర్వస్వమ్ ... 21
- మరుమాముల వెంకటరమణ శర్మ

నల్లాన్ చక్రవర్తుల సాహిత్ శతావధానం ... 27
- ఉప్పలధడియం భరత్ శర్మ

కీలక నామ సంవత్సరంలో క్షయమాసం ... 34
- వనం జ్వాలా నరసింహారావు

తిరుమల చరితామృతం - కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్ ... 38

రామాయణం రసరమ్యం ... 40
- వనం జ్వాలా నరసింహారావు

అద్వితీయ అద్వయానందభారతీ స్వామి ... 42
- ప్రసాదవర్మ కామరుషి

మహాతపస్వి శ్రీ చంద్రశేఖర భారతిస్వామి ... 44
- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ

సనాతన ధర్మం... సాధికారిక గ్రంథం ... 46
- తాడేపల్లి పతంజలి

శ్రీ పాండురంగ శతకము ... 48
- ఆచార్య తాడేపల్లి పతంజలి

శృంగేరి శారదాపీఠ వైభవం ... 52

శ్రీమద్దేవీ భాగవతం - డా. వద్దిపర్తి పద్మాకర్ ... 54

అభినవ శంకర విజయం ... 58
- మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

ధృతరాష్ట్రుని ఆశ్రమవాసం ... 60
- ఎంవిఎస్ సత్యనారాయణ

మాధవీయ శంకరవిజయం ... 62
- ఆచార్య తాడేపల్లి పతంజలి

ఇందులోని వ్యాసాలు, అందులోని భావాలు రచయితలవే. దానికి, దర్శనమ్ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. - సంపాదకుడు

# ధర్మ రక్షకులకు రక్షణ ఏదీ?

అర్చకులు, పురోహితులు, వేదపండితుల భద్రతకు ప్రత్యేక చట్టబద్ధ రక్షణపై ఇకనైనా నిర్ణయం కావాలి. గర్భగుడిలో నిలబడి భక్తులకు అభయం ప్రసాదించే దేవుడిని అర్చించే పూజారే, ఆలయం బయట తన ప్రాణానికి అభయం వెతుక్కోవాల్సి వస్తే- అది ఒక్క అర్చకుడి దురదృష్టం కాదు; మన వ్యవస్థ వైఫల్యాన్ని ప్రశ్నించే పరిస్థితి. అందరి క్షేమం కోసం మంత్రం చదివే వేదపండితుడు తన భద్రత గురించే భయపడాల్సి వస్తే, 'ధర్మరక్షణ' అనే మాటకు అర్థం ఏమిటి?

మనిషి పుట్టినప్పటి జాతకర్మ నుంచి అంత్యక్రియల వరకు పురోహితుడు కావాలి. పండుగకు పూజారి కావాలి. యజ్ఞానికి వేదపండితుడు కావాలి. ఆలయానికి అర్చకుడు కావాలి. కానీ అదే అర్చకుడిపై దాడి జరిగితే? పురోహితుడిని అవమానిస్తే? వేదపండితుడిని బెదిరిస్తే? అతని వెనుక నిలిచే వ్యవస్థ ఎంత బలంగా ఉంది? ఈ ప్రశ్న ఇప్పుడు ఊహాజనితం కాదు.

గత నెలలో నల్లగొండ జిల్లా చింతలపాలెంలో గణేశ్ మండపాల వద్ద "ముందుగా మా మండపంలోనే పూజ చేయాలి" అన్న వివాదం తర్వాత పురోహితుడు ఉప్పల దత్తుప్రసాద్ మరో మండపంలో పూజ చేస్తూ కుప్పకూలి మృతి చెందారు. స్థానికుల ఒత్తిళ్ల వల్లే పురోహితుడు మృత్యువాత పడ్డాడనేది నిర్వివాదాంశం. 2025 ఫిబ్రవరిలో చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడి నివాసంలోకి పలువురు వెళ్లి ఆయనను బెదిరించి, దాడి చేశారనే కేసులో పోలీసులు ప్రధాన నిందితుడితో పాటు పలువురిని అరెస్టు చేశారు. ఇంకా వెనక్కి వెళితే- 2018 వరంగల్ ఘటన మరింత విషాదకరం. పోచమ్మ మైదాన్ సమీపంలోని ఆలయంలో సుప్రభాతం లౌడ్‌స్పీకర్‌పై తలెత్తిన వివాదంలో వృద్ధ పూజారి దేవునూరు సత్యనారాయణపై సమీపంలోని ఓ ముష్కరుడు దాడి చేశాడు. చికిత్స పొందుతూ అర్చకుడు మృతి చెందాడు. ఇది అందరికీ దిగ్భ్రాంతి కల్గించిన దుస్సంఘటన. ఇటీవలి కాలంలో ఎందరో అర్చకులు, పురోహితులు ఇలాంటి కారణాల వల్లే ప్రాణాలు వదలగా వారి కుటుంబాలు రోడ్డున పడ్డ సంఘటనలెన్నో!

ఈ ఘటనల నేపథ్యాలు ఒకటేమీ కావు. వాటిని ఒకే కారణంతో ముడిపెట్టడం కూడా సరికాదు. కానీ అవన్నీ కలిపి మన ముందుంచుతున్న ప్రశ్న మాత్రం ఒక్కటే- అర్చకుడి గౌరవం, భద్రత విషయంలో మన వ్యవస్థలో ప్రత్యేకమైన రక్షణ అవసరమా? లౌడ్‌స్పీకర్‌పై వివాదం ఉంటే చట్టం ఉంది. పూజ సమయంపై విభేదం ఉంటే మాట్లాడుకునే మార్గం ఉంది. ఏ అర్చకుడి అభిప్రాయంతో విభేదించినా పోలీసులకు ఫిర్యాదు చేసే హక్కు ఉంది. కానీ చేయి చేసుకునే హక్కు, బెదిరించే హక్కు, ఇంట్లోకి చొరబడే హక్కు లేవు. 'ముందుగా నా దగ్గరే పూజ చేయాలి' అంటూ ఒక పురోహితుడిపై ఆధిపత్యం ప్రదర్శించే హక్కూ లేదు. అర్చకుడు ఎవరి బానిస కాదు. పురోహితుడు ఎవరి వ్యక్తిగత సేవకుడు కాదు. వేదపండితుడు ఎవరి అహంకారానికి తలవంచాల్సిన వ్యక్తి కాదు. వాళ్లు ఈ దేశపు సజీవ సాంస్కృతిక వారసత్వానికి, ఆర్ష సంస్కృతికి ధర్మసేవకులు. అందుకే వారి భద్రతను కూడా సాధారణ పరామర్శల స్థాయిలో కాకుండా వ్యవస్థాత్మకంగా చూడాల్సిన సమయం వచ్చింది.

ప్రస్తుత భారతీయ న్యాయవ్యవస్థలో దాడి, బెదిరింపు, హత్య వంటి నేరాలకు శిక్షలు ఉన్నాయి. చిలుకూరు ఘటనలో కూడా భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే ప్రశ్న ఏమిటంటే- ధార్మిక సేవ నిర్వహిస్తున్న అర్చకులు, పురోహితులు, వేదపండితులను వారి విధుల కారణంగా లక్ష్యంగా చేసుకునే దాడులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ అవసరమా? వైద్యులపై దాడులు జరిగినప్పుడు ప్రత్యేక రక్షణ నిబంధనలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణను అడ్డుకుంటే ప్రత్యేక నేర నిబంధనలు ఉన్నాయి. అదే విధంగా ఆలయాల్లో, యజ్ఞాల్లో, ధార్మిక కార్యక్రమాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చక, పురోహితుల భద్రతపై కూడా శాసనసభలు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. దానిని ప్రత్యేక 'అర్చక-పురోహిత-వేదపండితుల రక్షణ చట్టం' రూపంలో చేయాలా? లేక ప్రస్తుత చట్టాల్లో ప్రత్యేక నిబంధనలు, వేగవంతమైన దర్యాప్తు, బాధితులకు పరిహారం, సాక్షుల రక్షణ, ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థను చేర్చాలా? ఏ రూపం సమర్థవంతమో న్యాయ నిపుణులు, అర్చక సంఘాలు, పీఠాధిపతులు, వేదపండితులు, పోలీసు అధికారులు, రాజ్యాంగ నిపుణులతో చర్చించి ప్రభుత్వం నిర్ణయించాలి. కానీ 'చట్టం ఇప్పటికే ఉంది కదా' అంటూ సమస్యను అక్కడితో వదిలేయడం మాత్రం సరిపోదు. ఎందుకంటే సమస్య కేవలం దాడి జరిగిన తర్వాత నిందితుడిని అరెస్టు చేయడం కాదు. దాడి చేయాలనే ధైర్యమే రాకుండా నిరోధించడం. అర్చకుడు ఒక్క ఫోన్ చేస్తే వెంటనే స్పందించే వ్యవస్థ ఉండటం. ధార్మిక విధి నిర్వహణలో బెదిరింపులు ఎదురైతే ప్రత్యేక ఫిర్యాదు మార్గం ఉండటం. వృద్ధ పూజారులు, ఒంటరిగా ఉన్న గ్రామీణ ఆలయ **(మిగతా 39వ పేజీలో)**




# పాఠక దర్శిని

మీ అభిప్రాయాలను darshanameditordesk@gmail.comకు పంపగలరు.

## గణపతి వ్యాసాలు అలరించాయి

సర్వశుభకార్యాలకు తొలుత పూజించే విఘ్ననాయకుడు వినాయకుని గురించి వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఇచ్చిన వ్యాసం చాలా బాగుంది. బుద్ధికి ప్రతి రూపమైన గణేశ తత్త్వాన్ని చాలా అద్భుతంగా వివరించారు. ఆయన రూపాలను ఆ రూపాలు ఇచ్చే సందేశాలను తెలియజేయడం బాగుంది. దేశంలోని ప్రధాన ఆలయాల్లో స్వామివారి ఆరాధ్య నామాన్ని ఆ ఆలయ విశేషాన్ని అందించడం అద్భుతం. అలాగే షోడశ గణపతుల విశిష్టతను తెలియజేస్తూ ఇచ్చిన వ్యాసం ఆకట్టుకుంది. జ్ఞానము, శక్తి, కళ, సంపద, రక్షణ విజయం, పరమానందాలను ప్రసాదించే సంపూర్ణ దైవస్వరూపుడైన గణపతి గురించి పరిపూర్ణంగా ఇచ్చిన వ్యాసంలో చాలా విషయాలు తెలిశాయి.

**- రామచంద్ర హండే, అమెరికా**

## ఆలోచింపజేసే సంపాదకీయం

తెలంగాణ విద్వత్సభ దశాబ్ది మహోత్సవాలపై ఇచ్చిన వ్యాసం ఆకట్టుకుంది. విద్వన్మూర్తులందరూ కలిసి సదస్సు నిర్వహించడం.. ఏకగ్రీవంగా పండుగలను ఆమోదించడం ముదావహం. సామాన్య జనానికి పండుగలపై సందేహాలు కలుగకుండా చేయడం మంచి పద్ధతి. 'ఆదాయం పైనే శ్రద్ధ... కానరాని ధర్మనిష్ఠ' శీర్షికన ఇచ్చిన సంపాదకీయం ఆలోచనాత్మకంగా ఉంది. ప్రభుత్వ యంత్రాంగానికి ఎంత సేపటికీ ఆలయ సంపద పైనే దృష్టి కానీ వేద-ఆగమ విద్య, గో సంరక్షణ, దేవాలయ కళలు, బాల-యువ ధార్మిక శిక్షణ వంటి వాటిని పట్టించుకోకపోవడాన్ని నిలదీయడం బాగుంది.

**- గుంటూరు లలిత, విజయవాడ**

## శ్రీహరిని ప్రసన్నం చేసుకునే మార్గం తెలిసింది

'భువన మోహనుడు... భవ మోచనుడు' శీర్షికన శ్రీకృష్ణ భగవానుని గురించి ఇచ్చిన కథనం అలరించింది. భక్తికి మాత్రమే చిక్కే శ్రీహరి. ఈ కలియుగంలో నామ సంకీర్తనతోనే భవబంధ విముక్తిని ప్రసాదిస్తాడని రచయిత చక్కగా తెలియజేశారు. పూర్వం ఎవరెవరు ఆ నామ సంకీర్తనతో తరించారో వివరించడం కూడా నచ్చింది. 'ఆర్ష సంస్కృతి దీప్తి.. ఋషి పంచమి' శీర్షికతో ఇచ్చిన వ్యాసం మాకు నచ్చింది. తపస్సుతో సత్యాన్ని అన్వేషించిన ఋషులు మనకు జ్ఞాన సంపదను ప్రసాదించారు. ఆ ఋషులకు నమస్కరించే సంస్కృతి మహోత్సవం ఈ ఋషిపంచమి వ్రతం అని తెలియజేయడం బాగుంది.

**- వి. హంసిక, హైదరాబాద్**

### 'దర్శనమ్' చందా వివరాలు

| | |
|---|---|
| 3 సంవత్సరాలకు | రూ. 2000 |
| 6 సంవత్సరాలకు | రూ. 4000 |
| 12 సంవత్సరాలకు | రూ. 8000 |
| రాజపోషకులు | రూ. 15000 |
| మహారాజ పోషకులు | రూ. 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. 100000 |

**A/C NAME : DARSHANAM**
**BANK: CANARA BANK**
**A/C NO. 120001974779**
**IFSC CODE: CNRB0013063**

## చందాదారులకు విజ్ఞప్తి

'దర్శనమ్' ధార్మికోద్యమ మాసపత్రిక సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా వెలువడుతున్న ఈ పత్రికకు చందాలు, విరాళాలు అందించవలసిందిగా ప్రార్థన. ఈ నెలతో ముగియనున్న తమ చందాలను వెంటనే పునరుద్ధరించుకోవలసిందిగా మనవి. ఎడిటర్, దర్శనమ్ పేరుతో చెక్కు/డిడి/మనియార్డరు/ఆన్‌లైన్‌లో చందాలను పంపాల్సిందిగా విజ్ఞప్తి. మీరు ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు చిరునామాలను స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా కోరుతున్నాం. చిరునామా మారితే తక్షణం తెలియజేయండి. **- ఎడిటర్**

# ధర్మవిజయానికి దివ్య ప్రతీక – విజయదశమి



**శరదృతువు శుభవేళలో జగజ్జనని ఆరాధనతో భక్తిభావాలు పులకించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవమే శరన్నవరాత్రి వైభవం. శక్తిస్వరూపిణి దుర్గాదేవి నవవిధ రూపాలుగా భక్తులకు దర్శనమిచ్చే ఈ తొమ్మిది రాత్రులు భక్తి, శక్తి, జ్ఞానాల దివ్యసంగమం. మంత్రఘోషలు, వేదపారాయణాలు, కుంకుమార్చనలు, చండీయాగాలతో ఆలయాలు ఆధ్యాత్మిక తేజస్సుతో ప్రకాశించే పుణ్యకాలమిది. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతీ తత్త్వాల సమన్వయంతో జీవనంలో ధైర్యం, ఐశ్వర్యం, జ్ఞానం ప్రసాదించే పవిత్ర సాధనా పర్వమిది. అధర్మంపై ధర్మం, అజ్ఞానంపై జ్ఞానం, దుర్గుణాలపై దైవగుణాల విజయాన్ని ఘనంగా ప్రకటించే మహిమాన్విత ఉత్సవమే దేవీ శరన్నవరాత్రులు. నవదినాల ఉపాసన విజయదశమి మహోత్సవంతో పరిపూర్ణమై, "శక్తి ఆరాధనే విజయానికి సోపానం" అనే శాశ్వత సందేశాన్ని జగతికి అందిస్తుంది.**



చింతలపాటి శివశంకరశాస్త్రి

సృష్టికి మూలమైన జగన్మాతను శరన్నవరాత్రులలో వివిధ అలంకారాలతో, వివిధ నామాలతో శక్తిని ప్రాణప్రతిష్ఠ గావించుకుని ఆరాధిస్తున్నాం. ఆశ్వయుజ పాడ్యమి మొదలు దశమి వరకూ జరిపే నవరాత్రోత్సవాలు శ్రీమాత- లలితా, కామాక్షీ, బాల, దుర్గ, మహాలక్ష్మి, పార్వతి, సరస్వతి, మహాకాళి- పేరేదైనా ఒక్కొక్క నామానికి ఒక్కొక్క విశిష్టత, ఒక్కొక్క వైచిత్రి, ఒక్కొక్క ఫలం ఈ దుర్గానామాలకు ఉన్నాయి. సత్వ, రజ స్తమోగుణాల ప్రకృతే ఆదిశక్తి. అఖిలాండ బ్రహ్మాండాన్ని నడిపించే మహిమాన్విత శక్తే దైవశక్తి. ఈ దేవీ నవరాత్రులలో తొమ్మిది రూపాలలో విరాజిల్లుతూ భక్తజన సందోహ మానసములకు ఆధ్యాత్మికతనూ, పావనమునూ కలిగిస్తున్నది.

శరన్నవరాత్రులలో సువాసినీ పూజకు, కుమారీ పూజకు విశిష్ట స్థానం ఉంది. నడివయసు స్త్రీకి చేసే పూజకు సువాసినీ అని పేరు. రెండు సంవత్సరాలు దాటి తొమ్మిది సంవత్సరాలలోపు పిల్లలను అమ్మవారి స్వరూపంగా భావించి కుమారీ పూజను గావిస్తున్నాం. కుమారి పేరుతో పూజిస్తే ఏం ఫలితం ఉంటుందో దేవీ భాగవతం సవివరంగా తెలియజేస్తున్నది. ఒక కన్యను పూజిస్తే ఐశ్వర్యం, ఇద్దరు కన్యలను పూజిస్తే సౌభాగ్యం, ముక్తి కలుగుతాయి. ముగ్గురిని పూజిస్తే ధర్మార్థ కామములు సిద్ధిస్తాయి. నలుగురిని పూజిస్తే శత్రునాశనం, ఐదుగురిని పూజిస్తే విద్యాలాభం, ఆరుగురిని పూజిస్తే షట్కర్మ, ఏడుగురిని పూజిస్తే రాజ్యలాభం, ఎనిమిది

మందిని పూజిస్తే సర్వగుణాలు, తొమ్మిది మందిని పూజిస్తే అధికార ప్రాప్తి కలుగుతుందని దేవీ భాగవతం తెలియజేస్తుంది.

జగదంబకు ఇష్టమైన కాలం శరత్కాలం. శరన్నవరాత్రులలో అమ్మవారి ఆరాధన లక్షరెట్ల ఫలితాన్ని ఇస్తుందని భక్తుల విశ్వాసం. జగన్మాతను ఒక్కొక్క రూపంగా భావించి వివిధాలంకారాలతో పూజిస్తున్నాం. పరమశివుని ఇచ్ఛాశక్తి రూపమ అయిన శ్రీ మహాత్రిపురసుందరి తత్వం గహనమైనది. సృష్టి చైతన్యాన్ని నిలిపివేసిన భండాసురుడనే రాక్షసుని, ఆతని పుత్రులను సంహరించి, మానవులలో మేధో చైతన్య ప్రకాశినిగా అవతరించింది. ఆ ప్రకాశమే బాలాత్రిపురసుందరీ అవతారంగా పూజలందుకుంటోంది. ఆ దేవీ ఉపాసనాశక్తిగా, కొలిచి నమస్కరించే వారి తమోగుణాన్ని నశింపజేసి, జ్ఞానచైతన్య ప్రసాదినిగా భాసిల్లుతున్నది.

అమ్మవారి రెండవ అవతారం- గాయత్రీదేవి. ఋషులు, యోగులు, మునులు, సామాన్యులు శాశ్వతమైన బ్రహ్మపదాన్ని పొందడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ బ్రహ్మపదమును అనుగ్రహించుదేవి గాయత్రి. గాయత్రీ ఉపాసన చేయకుండా ఏ మంత్రానుష్ఠానం చేసినా మానవుడు బ్రహ్మపదాన్ని పొందలేడు. అందువలనే "న గాయత్ర్యాః పరం మంత్రః న మాతుః పరదైవతమ్" అని అంటారు. బ్రహ్మవిద్యకు ప్రతిరూపమైన గాయత్రీ మాతను నవరాత్రులలో ప్రతిష్ఠింపజేసుకుని ఆరాధిస్తున్నాం, పూజిస్తున్నాం.



అమ్మవారి మూడవ అవతారం- అన్నపూర్ణాదేవి. సృష్టిలోని ప్రతి జీవికీ ఆధారభూతమైనది అన్నం. పవిత్రమైన అన్న పరబ్రహ్మమును సకల జీవరాశులకు అందిస్తూ చల్లగా కాపాడుతున్న తల్లి అన్నపూర్ణ. అటువంటి మాతను నవరాత్రులలో ప్రతిష్ఠ గావించుకుని పూజిస్తున్నాం.

జగన్మాత నాలుగవ అవతారం- లలితా త్రిపురసుందరి. ఈ దేవి తన దరహాస మాత్రముననే బ్రహ్మాండమును సృష్టించినది. ఈమె తేజస్సు నిరుపమానము. ఆమె అష్టభుజాశక్తిగా ప్రఖ్యాతిగాంచింది. "లోకానతీత్య లలితే లలితా తే న ఉచ్యతే" లోకాతీతమైన చక్కని తేజస్సు, లాలిత్యము, శోభ, మాధుర్యము, విలాసము, గాంభీర్యము, ఔదార్యము, స్థైర్యము మొదలగు గుణములుండుట చేత శ్రీమాతకు 'లలిత' యను పేరు కలిగినది. ఈ పంచభూతాత్మకమైన సృష్టి అంతా నామరూపాత్మకమే. అనగా సకలలోకములు, సమస్త దృశ్యముల ఉనికి కంటే అతీతంగా అనన్యంగా, అద్వితీయంగా ప్రకాశించు ప్రత్యభిగన్న పరబ్రహ్మ స్వరూపిణి.

దుర్గామాత అయిదవ స్వరూపమే- శ్రీమహాలక్ష్మి. భారతీయ సనాతన సంప్రదాయంలో పూజించే దేవతలందరిలోకి లక్ష్మీదేవిది విశిష్టమైన స్థానం. చతుర్భుజియైన లక్ష్మీదేవిని మనసారా ఆరాధిస్తే సకల శుభాలు చేకూరుతాయి. అందువల్లనే ఆమెను 'శుభంకరి' అని పిలుచుకొంటూ పూజిస్తున్నాం.

దుర్గామాత ఆరవ రూపం- సరస్వతీదేవి. పరమ సాత్విక రూపంతో భాసిస్తూ మానవులందరితో పూజింపబడుతున్నది. ప్రాణశక్తిగా జీవులలో, వారి శరీరాలలో ఉచ్ఛ్వాస, నిశ్వాసాలలో నిరంతరం ప్రసరించేది సరస్వతీ తత్త్వం. విద్యలను ప్రసాదించే ఆ తల్లిని నవరాత్రులలో ప్రాణప్రతిష్ఠ గావించుకొని ఆరాధిస్తున్నాం.

దుర్గామాత ఏడవ రూపం- కాళీమాత. మానవాళిని ఉద్ధరించడానికి నల్లని రంగులో, అభయహస్తంతో, లోకభీకర రూపంలో సాక్షాత్కరించినది కాళరాత్రిదేవి. దుర్గుణాలు, దుష్టశక్తులను పారద్రోలి సత్కర్మలని ప్రేరేపిస్తూ మంచి బుద్ధిని ప్రేరేపిస్తుంది కాళరాత్రీదేవి.

దుర్గామాత ఎనిమిదవ రూపం- మహాగౌరి. ధవళకాంతితో వెలిగిపోయే శుద్ధమైన, స్వచ్ఛమైన రూపంతో మంగళ

స్వరూపిణియైన ఈ దేవి భక్తుల అభీష్టాలు నెరవేర్చి, భోగభాగ్యాలు ప్రసాదించే చల్లని తల్లిగా సాక్షాత్కరించుచున్నది. ప్రీతిపుష్కరిణిగా నిత్యనిర్మల స్వరూపమై విరాజిల్లే గౌరి పరమ శాంతిస్వరూపంతో అలరారుతున్నది.

అమ్మవారి తొమ్మిదవ రూపం- రాజరాజేశ్వరి. సర్వ మానవ జీవితాలలో సర్వశక్తికీ కేంద్ర స్థానం జగన్మాత. ఈమె భక్త సంరక్షణోద్యోగ కారుణ్యమూర్తి. ఈమె తన భక్తులను సర్వసిద్ధులను ప్రసాదించుట చేత 'సిద్ధిధాత్రి' అనే పేరుతో ప్రఖ్యాతిగాంచింది. అణిమాది అష్ట సిద్ధులను, మోక్షసిద్ధిని



ప్రసాదించేది. లౌకిక అలౌకిక సరార్థ సిద్ధులకు, మోక్ష సిద్ధులకు అధిష్ఠిత్రి సిద్ధిధాత్రి.

జగన్మాతకు పర్యాయపదమైన దుర్గానామం ఉచ్ఛరించినా, స్మరించినా సమస్త పాపాలు నశిస్తాయని సాక్షాత్తు పరమశివుడు చెప్పిన మాట. "దుర్గాదేవేతి విఖ్యాతం తన్మే నామ భవిష్యతి" అని దేవిని గురించి సర్వలోక పితామహుడైన బ్రహ్మ మార్కండేయ మహామునికి ప్రబోధించాడు.

నగరాజపుత్రి, సుకుమార సౌందర్యలహరి, మల్లేశ్వర హృదయ సామ్రాజ్య పట్టమహిషి అయిన కనకదుర్గాదేవి కరుణాంతరంగ అయి జ్ఞానసిద్ధిని, సుఖశాంతులను ప్రసాదించాలని ఆ దేవిని ప్రార్థిద్దాం.

**తెలుగు రాష్ట్రాల్లో...**

భారతదేశంలో మహారాష్ట్ర, ఒడిసాలతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలలో విజయవాడ కనకదుర్గ ఆలయం, వరంగల్ భద్రకాళి, బాసర జ్ఞాన సరస్వతి, వర్గల్ విద్యాసరస్వతి, శ్రీశైలం

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక 'బతుకమ్మ'



సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన భారతదేశంలో పండుగలకు విశిష్ట స్థానం ఉంది. అయితే కొన్ని విశేష పండుగలు ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాల్లో వైభవంగా జరుపుకుంటారు. అందులో ప్రత్యేకమైంది తెలంగాణలో జరుపుకునే బతుకమ్మ పండగ. ఈ పండగ ఇక్కడి వారసత్వాన్ని ప్రపంచానికి చాటింది. భాద్రపద అమావాస్య నాడు ప్రారంభమయ్యే బతుకమ్మ దుర్గాష్టమి సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ప్రకృతిలో లభించే ప్రతీ పూవును ఏరికోరి బతుకమ్మలను తయారు చేయడం, వాటిని గృహాలు, వీధులు, ఆలయాల్లో నిల్పి దాని చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, ఆటలు ఆడడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది.

గుమ్మడి పూలలోని పసుపు వర్ణపు దుద్దును గౌరీ దేవిగా భావించి అందులో పసుపు గౌరమ్మను నిల్పి సుందరంగా ముస్తాబు చేసిన బతుకమ్మ చుట్టూ వయో బేధం లేకుండా మహిళలు, ఆడ పిల్లలు బతుకమ్మ ఆడుతారు. ఒక స్త్రీ పాట పాడగా మిగిలిన వాళ్ళు వంత పాడటం దీని ప్రత్యేకత. అయితే ఈ బతుకమ్మ పాటలలో పురాణ, ఇతిహాస కథలు మొదలు తెలంగాణ వీరుల కథల వరకు వర్తమాన అంశాలకు చెందిన విషయాలను పాటల రూపంలో పాడుతూ ఉంటారు. గోధుమలు, పెసళ్ళు, బియ్యం, మినుములు, తదితర ధాన్యాలతో తయారు చేసిన సత్తు (పిండి వంటలను) ప్రసాదంగా స్వీకరిస్తారు.

రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో (మేరుశ్రీచక్రం) పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లతో వలయంగా తిరుగుతూ పాడే బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు.. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ.. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉంది. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారు.

భ్రమ రాంబిక, అలంపురం జోగులాంబ ఆలయాలలో కూడా తొమ్మిది రోజుల పాటు విశేష అలంకారాలు, అర్చనలు, ధార్మిక, ఆధ్యా త్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరుగుతాయి.

## శృంగేరి సన్నిధి

చతురామ్నాయాలలో దక్షిణామ్నాయపీఠమైనశృంగేరిలో జరిగే అన్ని పండుగలలో నవరాత్రి ఉత్సవాలు ప్రధానమైనవి. నవరాత్రి అంటే తొమ్మిది రాత్రులు. క్రూరరాక్షసులైన మధు-కైటభ, శుంభ-నిశుంభ, మహిషాసుర మొదలైన వారిని వధించి, జనులబాధలను తొలగించిన జగన్మాతను పవిత్రమైన తొమ్మిది రాత్రులలో పూజిస్తారు.



శృంగేరిలో శారదాదేవి సన్నిధానంలో, జగద్గురువుల పర్యవేక్షణలో ఈ పండుగను విశేషంగా ఆచరిస్తారు. ఆ సమయంలో ఎన్నో కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తారు. శారదాంబను విలువైన, ఆకర్షణీయమైన ఆభరణాలు, ముత్యాలు, పచ్చలు, వజ్రాలు మొదలైన వాటితో చేసిన అందమైన ఆభరణాలతో అలంకరిస్తారు. ఈ సమయంలో ఆ జగన్మాతను దర్శించేందుకు రెండు కన్నులు సరిపోవు.

నవరాత్రి సందర్భంగా దర్బార్ అనే ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది. శ్రీ విద్యారణ్యుల కాలం నుంచి ఈ విశిష్టమైన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శ్రీ విద్యారణ్య మహాస్వామివారు విజయనగర సామ్రాజ్య స్థాపనలో ప్రధాన పాత్ర పోషించారు. ఆనాటి పాలకులైన హరిహర రాయలు, బుక్కరాయలను ప్రతి అంశంలో ఆశీర్వదించి, అనుగ్రహించారు. దానికి వారు కృతజ్ఞత పూర్వక భక్తికి చిహ్నంగా మొత్తం రాజ్యాన్ని జగద్గురువుల పాదాల చెంత సమర్పించారు. వీతరాగులైన విద్యారణ్యులవారు తిరిగి వారికే రాజ్యపాలనను అప్పగించారు.

హరిహర రాయలు, బుక్కరాయలు శ్రీవిద్యారణ్యులకు బంగారు సింహాసనాన్ని, కెంపుతో చేసిన కిరీటం, బంగారు పల్లకి, ఛత్ర-చామరాలు మరియు అన్ని రాజ చిహ్నాలను కూడా వీరి పాదాల వద్ద సమర్పించారు. వారు పరమ పూజ్యులైన శ్రీ విద్యారణ్య గురుదేవులను "కర్ణాటక సింహాసన ప్రతిష్ఠాపనా చార్య" "శ్రీమద్రాజాధిరాజగురువు" "భూమండలా చార్య" మొదలైన గొప్ప బిరుదులతో సత్కరించారు. ఈ శిష్యుల వినయపూర్వకమైన అభ్యర్థన, వారికి గురువులపట్ల గల అచంచల భక్తి కారణంగా శ్రీవిద్యారణ్యులు ఈ రాజచిహ్నాలను అంగీకరించవలసి వచ్చింది. ఆనాటినుంచి ఆ పరంపరలో ఉన్న జగద్గురువులు విజయదశమినాడు ఈ చిహ్నాలను ధరించే ఆనవాయితీ ఈనాటికీ కొనసాగుతోంది.



ప్రస్తుత శ్రీ జగద్గురువులు శ్రీమహాస్వామివారు శ్రీమఠం సంప్రదాయం ప్రకారం కిరీటం, ఆభరణాలు ధరించి ఊరేగింపుగా శారదా ఆలయంలోని దర్బార్‌లోకి ప్రవేశిస్తారు. అనంతరం వ్యాఖ్యాన సింహాసనం వద్ద ఉంచిన శారదాంబ విగ్రహాన్ని బంగారు రథంలోకి తీసుకువస్తారు. వేద ఘోష, వాద్య ఘోష మరియు ఛత్ర-చామరలతో పాటు మూడుసార్లు ఆలయ కారిడార్‌లో రథోత్సవం జరుగుతుంది. ఉభయ జగద్గురువులు శ్రీ శారదాదేవికి ఎదురుగా రథం ముందు నడుస్తారు. రథోత్సవం అనంతరం శారదాంబకు అభిముఖంగా ఉంచిన బంగారు సింహాసనంపై ఆచార్యులు ఆసీనులవుతారు. అప్పుడు సప్తశతిలోని ఒకటి, రెండు అధ్యాయాలు పఠించడం జరుగుతుంది. ■




ఒక పత్రిక పుట్టడం ఒక సంఘటన... ఒక సంకల్పంతో పుట్టిన పత్రిక ఇరవై రెండేళ్లు అదే నిబద్ధతతో సాగడం ఒక చరిత్ర! ఒక సంచికను వెలువరించడం సాధారణం... కానీ ప్రతి సంచికనూ గురుభక్తి, వేదవిద్య, శాస్త్రజ్ఞానం, ఆలయ సంస్కృతి, సాహిత్యం, అవధానం, ధార్మిక చైతన్యంతో తీర్చిదిద్దడం ఒక తపస్సు! జగద్గురువుల పాదాలకు గురువందనాలు సమర్పిస్తూ... మహామహోపాధ్యాయుల విద్వత్తుకు పట్టాభిషేకం చేస్తూ... వేదయాజుల తపస్సుకు స్వర్ణకంకణాలు తొడుగుతూ... అవధాన సరస్వతికి రవీంద్రభారతి నుంచి శృంగేరి, కాశీ వరకు వేదికలు నిర్మిస్తూ... యజ్ఞయాగాల అపూర్వ వైభవాన్ని అక్షరబద్ధం చేస్తూ... పంచాంగ--జ్యోతిష--శాస్త్ర చర్చలకు ప్రామాణిక వేదిక కల్పిస్తూ... మరుగునపడిన మహనీయులకు స్మృత్యంజలి ఘటిస్తూ... కొత్తతరం అవధానులను తీర్చిదిద్దుతూ... ముద్రిత పుటకు డిజిటల్ రెక్కలు తొడిగిన అపూర్వ ఆధ్యాత్మిక పాత్రికేయ మహాప్రస్థానమే 'దర్శనమ్'. శృంగేరి నుంచి కంచి వరకు... బదరీ నుంచి ద్వారకా వరకు... పూరీ నుంచి ఉడిపి వరకు... భాగ్యనగరం నుంచి వారణాసి వరకు... గురుపీఠం నుంచి యజ్ఞశాల వరకు... పండితసభ నుంచి అవధాన వేదిక వరకు... ఇరవై రెండేళ్లుగా ఒకే సంకల్పం---'ధర్మానికి దర్పణం... విద్వత్తుకు వందనం... సంస్కృతికి సంరక్షణ'. ఇది కేవలం ఒక పత్రిక 22 సంవత్సరాల ప్రస్థానం కాదు. ఇది 22 ఏళ్ల అక్షర తపస్సు. 22 ఏళ్ల గురుసేవ. 22 ఏళ్ల విద్వత్ వందనం. 22 ఏళ్ల సాహితీ సమారాధన. 22 ఏళ్ల ధార్మిక జాగరణ.

'దర్శనమ్' ఒక పత్రిక కంటే ఎక్కువ. ఆధ్యాత్మిక పత్రిక అంటే పండుగల తేదీలు, వ్రతాలు, పూజావిధానాలు, ఆలయాల వివరాలు మాత్రమే అన్న పరిమిత భావనను 'దర్శనమ్' తొలి రోజుల నుంచే అధిగమించింది. ధర్మం వెనుక తత్త్వం ఏమిటి? ఆచారం వెనుక శాస్త్రం ఏమిటి? దేవాలయం వెనుక ఆగమ-వాస్తు-శిల్ప విజ్ఞానం ఏమిటి?

పంచాంగ నిర్ణయాల వెనుక గణిత-సిద్ధాంత ప్రమాణమేమిటి? యజ్ఞం వెనుక వేదస్వరూపం ఏమిటి? అవధానం వెనుక భారతీయ మేధోసంపద ఎంత విశాలమైనది? గురు పరంపర సమాజానికి ఎందుకు అవసరం? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం వెదుకుతూ, వాటిని పండితుల ద్వారా ప్రజలకు చేరవేస్తూ 'దర్శనమ్' తనదైన ఆధ్యాత్మిక పాత్రికేయ పంథాను నిర్మించుకుంది. అందుకే దర్శనమ్ సంచికలు నెలవారీ ప్రచురణలు మాత్రమే కాదు. మన కాలపు ధార్మిక-సాంస్కృతిక చరిత్రకు అక్షర దస్తావేజులు.

### రెండో వార్షికోత్సవమే దిశానిర్దేశం

దర్శనమ్ ప్రారంభ ప్రస్థానంలోనే తన భవిష్యత్ స్వరూపాన్ని ప్రకటించిన ఘట్టం

రవీంద్రభారతిలో జరిగిన రెండో వార్షికోత్సవం. హైదరాబాద్ సాంస్కృతిక హృదయంగా నిలిచిన రవీంద్రభారతి వేదికపై ఘనంగా జరిగిన ఈ మహోత్సవంలో డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా దర్శనమ్ వార్షిక ప్రత్యేక సంచిక ఆవిష్కృతమైంది. సాయంత్రం జరిగిన వైభవోపేత ఉత్సవంలో సుమారు 200 మంది కవులు, పండితులు, విద్వాంసులను ఘనంగా సత్కరించడం అప్పట్లోనే దర్శనమ్ లక్ష్యానికి ఒక స్పష్టమైన ప్రకటనగా నిలిచింది.

పత్రిక పుట్టిన రోజు అంటే సంపాదకవర్గం సన్మానం పొందే రోజు కాదు... పండితుడు గౌరవింపబడే రోజు. కవి సత్కరింప బడే రోజు. విద్వత్తుకు వేదిక దక్కే రోజు. ధర్మసేవకుడికి సమాజం కృతజ్ఞత చెప్పే రోజు. ఆ రెండో వార్షికోత్సవమే తరువాతి రెండు దశాబ్దాల్లో దర్శనమ్ నిర్వహించిన వందలాది ధార్మిక-సాహిత్య కార్యక్రమాలకు బీజం వేసింది.



కంచి కామకోటి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారికి గురువందనం సమర్పించడం ద్వారా కంచి గురుపరంపరతో దర్శనమ్ అనుబంధం మరింత పటిష్ఠమైంది.

### 'గురువందనం' - దర్శనమ్ ఆత్మ

భారతీయ సంస్కృతిలో గురువు అంటే ఒక వ్యక్తి కాదు. ఒక పరంపర. ఒక జ్ఞానప్రవాహం. ఒక ధర్మదీపం. గురువును గౌరవించడం అంటే ఆ గురువు ద్వారా ప్రవహిస్తున్న వేల సంవత్సరాల భారతీయ జ్ఞానపరంపరను గౌరవించడం. ఈ భావననే తన ప్రధాన సేవా సూత్రంగా స్వీకరించింది దర్శనమ్. అందుకే దర్శనమ్ చరిత్రలో అత్యంత ప్రకాశవంతమైన అధ్యాయం---'గురువందనం'.







### శృంగేరీ జగద్గురువులకు భక్తి నీరాజనం

దక్షిణామ్నాయ శ్రీ శృంగేరీ శారదా పీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారికి దర్శనమ్ సమర్పించిన గురువందనం సంస్థ ప్రస్థానంలో పరమపావన ఘట్టం. ఆదిశంకర భగవత్పాదుల అవిచ్ఛిన్న గురుపరంపరలో వెలుగొందుతున్న జగద్గురువులకు నమస్కారం సమర్పించడం దర్శనమ్ ఆధ్యాత్మిక ప్రయాణానికి దిశానిర్దేశం చేసింది. తరువాత జగద్గురు భారతీతీర్థ మహాస్వామివారి దివ్య సప్తతి పూర్తి మహోత్సవం సందర్భంగా 'కవితా నీరాజనం' సమర్పించడం గురుభక్తి--సాహిత్యభక్తి సంగమంగా నిలిచింది.

### కంచి గురుపరంపరకు దర్శనమ్ వందనం

కంచి కామకోటి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ మహాస్వామివారి 60వ పీఠాధిరోహణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన గురువందనం మరో మహత్తర ఘట్టం. తరువాత

### శైవపీఠం నుంచి కుర్తాళం వరకు...

శ్రీ శైవపీఠాధీశ్వరులు సద్గురు శివానందమూర్తిగారికి గురువందనం. కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామివారి పీఠాధిరోహణ పుష్కరోత్సవం సందర్భంగా గురువందనం. శ్రీ గురుమదనానంద పీఠాధీ శ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామివారి పీఠాధిరోహణ పుష్కరోత్సవం సందర్భంగా గురువందనం... ఇలా ఒకే పీఠానికో, ఒకే సంప్రదాయానికో తన పరిధిని కుదించు కోకుండా సనాతన ధర్మంలోని వివిధ గురుపరంపరలకు సముచిత గౌరవాన్ని దర్శనమ్ సమర్పించింది.

### బదరీ-ద్వారకా-పూరీ పీఠాల వరకు గురుభక్తి

దర్శనమ్ గురువందన యాత్ర దేశవ్యాప్త రూపాన్ని సంతరించుకుంది. ఉత్తరామ్నాయ బదరీపీఠం, పశ్చిమామ్నాయ ద్వారకా పీఠాలకు అధిపతిగా వెలుగొందిన జగద్గురు శంకరాచార్య ధర్మసమ్రాట్ శ్రీశ్రీశ్రీ స్వరూపానంద సరస్వతీ మహరాజ్‌వారికి గురువందనం. పూర్వామ్నాయ పూరీ శ్రీ గోవర్ధన పీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ నిశ్చలానంద సరస్వతీ మహాస్వామివారికి గురువందనం. ఇవి దర్శనమ్ గురుసేవను తెలుగు ప్రాంతాలకే పరిమితం చేయకుండా చతుర్దిక్కులకు విస్తరించిన సందర్భాలు.

## 22 ఏళ్లు... 22 విశిష్ట మైలురాళ్లు

1. రవీంద్రభారతిలో రెండో వార్షికోత్సవం; సుమారు 200 మంది కవిపండితులకు సత్కారం.

2. శృంగేరీ జగద్గురు శ్రీ భారతీతీర్థ మహాస్వామివారికి గురువందనం.

3. కంచి శ్రీ జయేంద్ర సరస్వతీ మహాస్వామివారి 60వ పీఠాధిరోహణ మహోత్సవ గురువందనం.

4. సద్గురు శివానందమూర్తిగారికి గురువందనం.

5. సిద్ధేశ్వరానంద భారతీ, మాధవానంద సరస్వతీ స్వామివారి పీఠాధిరోహణ పుష్కరోత్సవ గురువందనాలు.

6. స్వరూపానంద సరస్వతీ, నిశ్చలానంద సరస్వతీ జగద్గురువులకు గురువందనాలు.

7. పెజావర శ్రీ విశ్వేశతీర్థ స్వామివారికి సైనిక్‌పురిలో గురువందనం.

8. అవధాన సప్తకం- అవధానాల హరివిల్లు- అవధాన సప్తాహం.

9. పది రోజుల అష్టాదశ మహాపురాణ సారాంశ ప్రవచనాలు

10. ప్రతి సంవత్సరం సంస్కృత భాషా దినోత్సవం- సంస్కృత అష్టావధానం- విద్వద్గోష్ఠి.

11. 'ధార్మిక వరేణ్య' బిరుదు-జీవన సాఫల్య పురస్కారాల పరంపర.

12. 2019 నవంబర్ 3న 15వ వార్షికోత్సవ మహోత్సవం.

13. లలిత్ ఆదిత్య ద్విగుణిత అష్టావధానం నుంచి శతావధానం వరకు ప్రోత్సాహం.

14. అతిరాత్రం, అగ్నిష్టోమం, పౌండరీకం, జ్యోతిరప్తోర్యామం, షోడశి, వాజపేయాది వైదిక క్రతువుల ప్రచారం.

15. మహనీయుల సంస్మరణలు- స్మృత్యంజలి కార్యక్రమాలు.

16. దోర్బల ప్రభాకరశర్మ గురుసత్కార సప్తాహం.

17. శృంగేరీలో 'సువర్ణ భారతి' సందర్భంగా సంస్కృతాంధ్ర శతావధానం.

18. శృంగేరీలో ఉభయ తెలుగు రాష్ట్రాల పంచాంగకర్తల సదస్సు- 'భువన విజయం'.

19. 2024లో గణపతి సచ్చిదానంద స్వామివారికి లలిత కళాతోరణంలో గురువందనం

20. 2025లో కాశీ తెలుగు సంగమం- వద్దిపర్తి పద్మాకర్ 25వ శతావధానం- అష్టావధాన సప్తకం.

21. జగద్గురు విధుశేఖరభారతీ స్వామివారి చేతుల మీదుగా 'భారతీతీర్థ గ్రంథాలయం' ప్రారంభం.

22. 'అవధాన దర్శనమ్-నెలనెలా అష్టావధానం' నుంచి 2026 యువ శతావధానాల వరకు నిరంతర సాహితీ యజ్ఞం.

### పెజావర శ్రీలకు సైనిక్‌పురిలో గురువందనం

ఉడిపి పెజావర పీఠాధీశ్వరులు శ్రీ విశ్వేశతీర్థ స్వామివారికి సైనిక్‌పురి రాఘవేంద్ర మఠంలో దర్శనమ్ నిర్వహించిన గురువందనం మరో విశిష్ట ఘట్టం. అద్వైత, ద్వైత, శైవ, దత్త, ఇతర సనాతన గురుపరంపరల పట్ల సమాన గౌరవం... దర్శనమ్ విశాల ధార్మిక దృష్టికి ఇది నిదర్శనం.

### పాలకుర్తి నృసింహరామ సిద్ధాంతికి వైభవోపేత సత్కారం

యజ్ఞేశానందనాథ, స్మార్త సరస్వతి బ్రహ్మశ్రీ పాలకుర్తి నృసింహరామ సిద్ధాంతిగారికి 'ధార్మిక వరేణ్య' బిరుదు, జీవన సాఫల్య పురస్కారం, స్వర్ణకంకణ ప్రదానంతో అపూర్వ గౌరవం లభించింది. ఈ సందర్భంగా శ్రీ కె. చంద్రశేఖరరావు పల్లకీ సేవలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక విశిష్టతను చేకూర్చింది. విద్వాంసుడిని సమాజ మధ్య పల్లకీలో ఊరేగించడం వ్యక్తిగత వైభవం కోసం కాదు. విద్వత్తుకు పట్టాభిషేకం చేయడమే దాని అంతరార్థం.

### మాడుగుల మాణిక్య సోమయాజుల వారికి వేదవందనం

విద్వదాహితాగ్ని, వేదవిద్యానిధి, జ్యోతిరప్తోర్యామయాజి బ్రహ్మశ్రీ మాడుగుల మాణిక్య సోమయాజులవారికి 'ధార్మిక వరేణ్య' బిరుదు, జీవన సాఫల్య పురస్కారం, స్వర్ణకంకణ ప్రదానం నిర్వహించడం వేదయజ్ఞ సంప్రదాయానికి దర్శనమ్ సమర్పించిన గౌరవనీరాజనం. ఈ సందర్భంగా ప్రముఖులు రామ్ మాధవ్ పల్లకీసేవలో పాల్గొనడం మరో విశేషం.



### 15వ వార్షికోత్సవ మహోత్సవం

దర్శనమ్ చరిత్రలో 2019 నవంబర్ 3 ఒక చిరస్మరణీయ తేదీ. 15వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుగారికి 'ధార్మిక వరేణ్య' బిరుదు ప్రదానం, జీవన సాఫల్య పురస్కారం, పల్లకీ సేవ, స్వర్ణకంకణ ప్రదానం నిర్వహించడం మహోత్సవంగా జరిగింది. అదే సత్కార పరంపరలో ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారిని కూడా ఘనంగా గౌరవించడం దర్శనమ్‌కు గర్వకారణం. ప్రవచనాన్ని వినోదంగా కాకుండా ధర్మప్రబోధంగా, ప్రవచనకర్తను వక్తగా కాకుండా సంస్కృతి వాహకుడిగా గౌరవించిన సందర్భమది.

### 18వ వార్షికోత్సవం... గరికిపాటికి గురుసత్కారం

దర్శనమ్ 18వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో, మహాసహస్రావధాని, పద్మశ్రీ పురస్కృతులు డా. గరికిపాటి నరసింహారావుగారికి గురుసత్కారం నిర్వహించడం సాహిత్య--ప్రవచన రంగాల కలయికగా నిలిచిన మహోత్సవం. అవధానం... పద్యకవిత్వం... ప్రవచనం... తెలుగు భాష... ఈ రంగాలకు చేసిన అపూర్వ సేవకు దర్శనమ్ సమర్పించిన కృతజ్ఞతా నీరాజనం అది.





### దోర్బల ప్రభాకరశర్మకు 'గురుసత్కార సప్తాహం'

దర్శనమ్ గురుసేవా చరిత్రలో అపూర్వమైన ప్రయోగం మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ దోర్బల ప్రభాకరశర్మగారికి నిర్వహించిన 'గురుసత్కార సప్తాహం'. ఒక్కరోజు సన్మానంతో సరిపెట్టకుండా... ఒక మహావిద్వాంసుని పాండిత్యం, రచన, శాస్త్రసేవ, గురుత్వాన్ని ఏడు రోజులపాటు సమాజానికి పరిచయం చేయడం ఈ సప్తాహ లక్ష్యం. తుల్జా భవన్‌లో సప్తాహ కార్యక్రమాలు... సైనిక్‌పురి శంకరమఠంలో సప్తాహ ప్రారంభోత్సవం... బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుగారి సాన్నిధ్యం... చివరగా 2023 డిసెంబర్ 31న రవీంద్రభారతిలో ఘన గురుసత్కారం... ఇది ఒక సన్మానం కాదు. ఒక విద్వన్మూర్తి జీవితసాధనకు నిర్వహించిన జ్ఞానోత్సవం.



### వద్దిపర్తి పద్మాకర్ శతావధానం... గురుసత్కారం

2024లో తెలంగాణ సారస్వత పరిషత్తులో మూడు రోజులపాటు త్రిభాషా సహస్రావధాని, ప్రణవ పీఠాధిపతి బ్రహ్మశ్రీ డా. వద్దిపర్తి పద్మాకర్‌గారి శతావధానం నిర్వహించి గురుసత్కారం సమర్పించడం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టం. అవధానం కేవలం ధారణాశక్తి కాదు... అది వ్యాకరణం, ఛందస్సు, పురాణం, సాహిత్యం, ఆశుకవిత్వం, సమయస్ఫూర్తి, శాస్త్రపాండిత్యాల సమ్మేళనం అని కొత్త తరానికి తెలియజేసిన కార్యక్రమాలు ఇవి.

### లలిత కళాతోరణంలో దత్తపీఠ గురువందనం

2024 నవంబర్ 16న హైదరాబాద్ లలిత కళాతోరణంలో, అవధూత దత్తపీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారికి దర్శనమ్ ఘనంగా గురువందనం సమర్పించింది. సంగీతం, ధర్మప్రచారం, ఆధ్యాత్మిక సేవ, దత్తసంప్రదాయం---అనేక రంగాల్లో స్వామివారి సేవలకు సమాజం తరఫున సమర్పించిన కృతజ్ఞతా మహోత్సవమది.

### కాశీలో 'తెలుగు సంగమం'

దర్శనమ్ 22 ఏళ్ల ప్రస్థానంలో అత్యంత వైభవోపేతమైన అధ్యాయాల్లో ఒకటి కాశీ తెలుగు సంగమం. 2025 జులై 25, 26, 27 తేదీల్లో కాశీలోని మెహమూర్‌గంజ్ శృంగేరీ శంకరమఠంలో 'వజ్రోత్సవ భారతి' సందర్భంగా ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాశీ... శృంగేరీ గురుపరంపర... తెలుగు సరస్వతి... అవధాన విద్య... ఈ నాలుగు మహాప్రవాహాలు ఒకే వేదికపై సంగమించాయి. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ డా. వద్దిపర్తి పద్మాకర్‌గారి 25వ శతావధానం నిర్వహించడం మహత్తర విశేషం. అలాగే 'అష్టావధాన సప్తకం' పేరిట ఏడు అష్టావధానాలు నిర్వహించడం ద్వారా కాశీలో తెలుగు అవధాన సరస్వతి విజయపతాక ఎగురవేసింది.

భాగ్యనగరంలో మొదలైన దర్శనమ్ సాహిత్య యజ్ఞం కాశీక్షేత్రంలో జ్ఞానగంగతో సంగమించిన అద్భుత సందర్భమది.

### మాడుగుల నాగఫణిశర్మకు మహాగురుసత్కారం

2025 డిసెంబర్ 21న బ్రహ్మశ్రీ మాడుగుల

## యజ్ఞాలు.. విద్వద్గోష్ఠులు.. జ్యోతిష మహాసభలు

అతిరాత్రం- శ్రౌతయాగ సంప్రదాయ మహోన్నత రూపం; అగ్నిష్టోమం- సోమయాగ పరంపర; జ్యోతిరప్తోర్యామం- అరుదైన వైదిక క్రతువు; పౌండరీకం- శ్రౌత సంప్రదాయ వైభవం; షోడశి- విశిష్ట సోమయాగ పరంపర; వాజపేయం- అత్యున్నత వైదిక మహాక్రతువులలో ఒకటి; జ్యోతిష మహాసభలు- శాస్త్రపండితుల సమాలోచనలు; పంచాంగ విద్వద్గోష్ఠులు- శాస్త్రసమ్మత నిర్ణయాలకు వేదిక.

ధార్మిక జాగరణ- అవసరమైన సమయంలో ధర్మానికి సముచిత స్వరం. ధర్మపత్రిక అంటే ఉత్సవాల వార్తలు రాసే వేదిక మాత్రమే కాదని దర్శనమ్ పలుమార్లు నిరూపించింది. ధర్మంపై అపోహలు... ఆచారాలపై అనుచిత వ్యాఖ్యలు... గురుపరంపరలపై పరుష దూషణలు... సమాజంలో కలిగే ధార్మిక సందిగ్ధతలు... ఇలాంటి సందర్భాల్లో ‘ధార్మిక జాగరణ’ పేరుతో సముచిత స్పందనకు వేదిక కల్పించింది.

కపటయతి గోవిందానంద సరస్వతి చేసిన పరుష దూషణల నేపథ్యంలో త్యాగరాయ గానసభలో ధార్మిక సత్సంగం నిర్వహించడం ఇందుకు ఒక ఉదాహరణ. వివాదానికి వివాదం కాదు... శాస్త్రానికి శాస్త్రమే సమాధానం కావాలి అన్న భావన ఈ కార్యక్రమాల వెనుక కనిపిస్తుంది.

నాగఫణిశర్మగారికి దర్శనమ్ నిర్వహించిన మహాసత్కారం మరో వైభవోపేత అధ్యాయం. పల్లకీ సేవ... పుష్పాభిషేకం... పాదపూజ... స్వర్ణకంకణ ప్రదానం... ‘ధార్మిక వరేణ్య’ బిరుదు... జీవన సాఫల్య పురస్కారం... ఇలా సమగ్ర గురుసత్కార రూపంలో మహావిద్వాంసుని సేవకు నీరాజనం సమర్పించింది.

### గండపేరుండ జీవన సాఫల్య పురస్కారాలు

2025 డిసెంబర్ 28న బ్రహ్మశ్రీ శంకరమంచి రామకృష్ణశాస్త్రి, బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాసశర్మగార్లకు ‘గండపేరుండ జీవన సాఫల్య పురస్కారం’ అందించి వారి దీర్ఘకాలిక విద్వత్ సేవలను దర్శనమ్ ఘనంగా గౌరవించింది. పండితుని జీవితకాల కృషి సమాజానికి కనిపించాలి... విద్వత్తు సముచితంగా సత్కరించబడాలి అన్న దర్శనమ్ మూలసూత్రానికి ఇవి మరో నిదర్శనం.

### అవధానం - దర్శనమ్ సాహిత్య హృదయం

దర్శనమ్ 22 ఏళ్ల ప్రస్థానాన్ని ఇతర ఆధ్యాత్మిక పత్రికల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టిన రంగం ఏదైనా ఉందంటే అది అవధాన విద్యకు చేసిన అపూర్వ సేవ.

అవధాన సప్తకం... అవధానాల హరివిల్లు... అవధాన సప్తాహం... వంటి వినూత్న శీర్షికలతో అవధానాలను ఉత్సవ రూపంలో ప్రజలకు అందించింది. ఒక అష్టావధానం నిర్వహించడం ఒక కార్యక్రమమైతే... ఏడు అవధానాలను వరుసగా నిర్వహించడం ఒక ఉద్యమం. అవధానిని సత్కరించడం ఒక గౌరవమైతే... కొత్త అవధానిని తయారు చేయడం ఒక సంస్కృతి పరిరక్షణ. ఈ రెండో మార్గాన్నే దర్శనమ్ ఎంచుకుంది.

### రవీంద్రభారతిలో లలిత్ ఆదిత్య ద్విగుణిత అష్టావధానం

అమెరికా వాసి, యువ అవధాన శిరోమణి బ్రహ్మశ్రీ గన్నవరం లలిత్ ఆదిత్య ప్రతిభకు దర్శనమ్ విశిష్ట వేదికలు కల్పించింది. రవీంద్రభారతిలో ఆయన ద్విగుణిత అష్టావధానం నిర్వహించడం యువ అవధాన చరిత్రలో ఒక సాహిత్య సంచలనం. తరువాత సైనిక్‌పురి శంకరమఠంలో అత్యంత వేగంగా నిర్వహించిన మరో అష్టావధానం... దీనికి మహాసహస్రావధాని డా. గరికిపాటి నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరుకావడం కార్యక్రమ విశిష్టతను పెంచింది.

### సంస్కృత అష్టావధానానికి డిజిటల్ వేదిక

ప్రతి సంవత్సరం శ్రావణ పౌర్ణమి సందర్భంగా సంస్కృత భాషా దినోత్సవాన్ని దర్శనమ్ ప్రత్యేకంగా నిర్వహిస్తూ వచ్చింది.

సంస్కృత అష్టావధానం... విద్వద్గోష్ఠి... పండిత సత్కారాలు... సంస్కృత భాషా విశిష్టతపై చర్చలు... కరోనా కాలంలోనూ కార్యక్రమం ఆగలేదు. ఆధునిక సాంకేతికతను ఆశ్రయించి జూమ్ ద్వారా లలిత్ ఆదిత్య సంస్కృత అష్టావధానం నిర్వహించడం సంప్రదాయానికి సాంకేతికతను జోడించిన వినూత్న ప్రయోగం. అష్టావధానాల నుంచి సాగిన లలిత్ ఆదిత్య సాహితీయాత్ర 2022 జూన్ 28, 29, 30 తేదీల్లో తెలంగాణ సారస్వత పరిషత్తులో జరిగిన శతావధానంతో మరో శిఖరాన్ని అధిరోహించింది. యువ ప్రతిభను అష్టావధాన వేదిక నుంచి శతావధాన శిఖరం దాకా ప్రోత్సహించడం దర్శనమ్ అవధాన సేవలో సార్థక ఘట్టం.



## శృంగేరీలో 'సువర్ణ భారతి'కి సంస్కృతాంధ్ర శతావధాన నీరాజనం

దర్శనమ్ అవధాన యాత్రలో అత్యున్నత శిఖరాల్లో ఒకటి 2024 జూన్ 10, 11, 12 తేదీల్లో శృంగేరి నరసింహవనంలోని సచ్చిదానంద విలాస్‌లో జరిగిన సంస్కృతాంధ్ర శతావధానం. దక్షిణామ్నాయ శ్రీ శృంగేరీ శారదా పీఠ జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారి సన్యాసాశ్రమ స్వీకార స్వర్ణోత్సవం---'సువర్ణ భారతి' మహోత్సవాల్లో భాగంగా, బ్రహ్మశ్రీ గన్నవరం లలిత్ ఆదిత్యతో ఈ సంస్కృతాంధ్ర శతావధానం నిర్వహించడం అపూర్వ భాగ్యం.

శృంగేరీ పుణ్యభూమి... నరసింహవనం... జగద్గురు సన్నిధి... సంస్కృతాంధ్ర సాహిత్య వైభవం... ఇవన్నీ ఒకే వేదికపై సంగమించిన ఈ ఘట్టం దర్శనమ్ చరిత్రలో నిజమైన సువర్ణాక్షర అధ్యాయం.







## అష్టాదశ మహాపురాణాలు... పది రోజుల జ్ఞానగంగ

సనాతన భారతీయ జ్ఞానవ్యవస్థలో అష్టాదశ మహాపురాణాలకు అపూర్వమైన స్థానం. ఈ మహాపురాణాల విశాల విషయసంపదను సామాన్య భక్తులకు అందించాలనే లక్ష్యంతో పది రోజులపాటు అష్టాదశ మహాపురాణ సారాంశ ప్రవచన కార్యక్రమం నిర్వహించడం దర్శనమ్ ధార్మిక కార్యకలాపాల్లో ఒక అపూర్వ ఘట్టం. పురాణాన్ని కథగా కాకుండా... ధర్మం, నీతి, తత్త్వం, భక్తి, వైరాగ్యం, జీవనవిలువల సమాహారంగా ప్రజలకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

## సుందరకాండ ప్రవచనామృతం

శ్రీమాన్ రామానుజదాస స్వామివారి సుందరకాండ ప్రవచనాలను రవీంద్రభారతిలో ఏప్రిల్ 22 నుంచి 24 మధ్య



నిర్వహించడం ద్వారా రామాయణ భక్తి ప్రవాహాన్ని ప్రజలకు అందించింది దర్శనమ్. హనుమద్భక్తి... శరణాగతి... రామనామ మహిమ... ధర్మనిష్ఠ... ఇవన్నీ ఒకే ప్రవచన పరంపరలో భక్తులకు అందిన జ్ఞానామృతం.

## పంచాంగం - ప్రజాజీవితాన్ని నడిపించే శాస్త్రం

పంచాంగం కేవలం పండుగ తేదీల పట్టిక కాదు. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం నుంచి గ్రహగతులు, మాస నిర్ణయాలు, పర్వదినాలు, ముహూర్తాల వరకు ధార్మిక జీవనానికి అది కాలదర్శిని. అందుకే 'పంచాంగాలు--విద్వద్గోష్ఠి', జ్యోతిష మహాసభలు, పంచాంగకర్తల సమావేశాలకు దర్శనమ్ ప్రత్యేక స్థానం కల్పించింది.

పంచాంగకర్తలు... సిద్ధాంతులు... జ్యోతిష పండితులు... ధర్మశాస్త్రవేత్తలు... ఒకే వేదికపై శాస్త్రప్రమాణాలతో చర్చించే వాతావరణాన్ని దర్శనమ్ నిర్మించింది.

శృంగేరీలో పంచాంగ సదస్సు... 'భువన విజయం'

'సువర్ణ భారతి' మహోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1, 2 తేదీల్లో శృంగేరిలో ఉభయ తెలుగు రాష్ట్రాల పంచాంగకర్తలతో పంచాంగ సదస్సు నిర్వహించడం దర్శనమ్ శాస్త్రసేవలో గొప్ప మైలురాయి.

అదే సందర్భంలో 'భువన విజయం' సాహిత్య రూపకం నిర్వహించడం ద్వారా శాస్త్రం - సాహిత్యం రెండింటినీ ఒకే ఉత్సవ ఛత్రం కిందకు తీసుకొచ్చింది.

## యజ్ఞసంస్కృతికి అక్షర సాక్షి

వేదం పుస్తకంలో మాత్రమే ఉండేది కాదు. అది ఘోషించాలి. అగ్నిలో ఆహుతిగా వెలగాలి. యజ్ఞవేదికపై ఆచరణలో కనిపించాలి. ఈ వైదిక క్రతు సంప్రదాయాన్ని ప్రజలకు పరిచయం చేయడంలో దర్శనమ్ విశేష కృషి చేసింది. అతిరాత్రం... అగ్నిష్టోమం... పౌండరీకం... జ్యోతిరప్తోర్యామం... షోడశి... వాజపేయం... వంటి అత్యంత అరుదైన వైదిక క్రతువులకు సంబంధించి వార్తలు, విశేషాలు, శాస్త్ర నేపథ్యాన్ని విస్తృతంగా ప్రచారం చేసింది. రెండు ప్రాంతాల్లో జరిగిన షోడశి వంటి అరుదైన సందర్భాలతో సహ అనేక మహాక్రతువులను నమోదు చేసి భవిష్యత్తుకు చారిత్రక ఆధారాలు సమకూర్చింది.

## దర్శనమ్ సేవా పంచధారలు

**గురుసేవ:** జగద్గురువులు, పీఠాధిపతులు, మహావిద్వాంసులకు గురువందనాలు.

**వేద-శాస్త్ర సేవ:** యజ్ఞాలు, పంచాంగ సదస్సులు, జ్యోతిష మహాసభలు, విద్వద్గోష్ఠులు

**సాహిత్య సేవ:** అవధానాలు, శతావధానాలు, కవిసమ్మేళనాలు, గ్రంథావిష్కరణలు.

**సంస్కృతి పరిరక్షణ:** దేవాలయాలు, పండుగలు, పురాణాలు, ధర్మప్రబోధ కార్యక్రమాలు.

**నూతన తరం నిర్మాణం:** యువ అవధానులు, బాలకవులు, కొత్త పండిత ప్రతిభలకు నిరంతర వేదిక.

### జూన్ 2... కవిసమ్మేళనం

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న కవిసమ్మేళనం నిర్వహిస్తూ భాష, రాష్ట్ర సంస్కృతి, సాహిత్య చైతన్యాలకు దర్శనమ్ వేదిక కల్పించింది. ధర్మం నుంచి సాహిత్యాన్ని వేరుచేయలేమని... తెలుగు భాషను సనాతన సంస్కృతికి జీవవాహినిగా చూడాలని... ఈ కార్యక్రమాల ద్వారా సందేశమిచ్చింది.

### మహనీయులకు 'స్మృత్యంజలి'

మన మధ్య ఉన్న మహనీయులను సత్కరించడం దర్శనమ్ ఒక విధానమైతే... మన మధ్య నుంచి తరలి వెళ్లిన మహనీయులను కొత్త తరానికి గుర్తుచేయడం మరో విధానం. దోర్బల విశ్వనాథ శాస్త్రి సంస్మరణ... బ్రహ్మభట్ల శ్రీరామశర్మ సంస్మరణ సభ... అవధాన పండితుల సంస్మరణ... అలాగే ప్రముఖ గాయకులు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, బ్రహ్మానంద తీర్థ, దోర్బల విశ్వనాథ శాస్త్రి, బ్రహ్మభట్ల శ్రీరామశర్మ తదితరులకు 'స్మృత్యంజలి' కార్యక్రమాలు నిర్వహించింది. సజీవంగా ఉన్నప్పుడు సత్కారం... అనంతరం స్మరణ... ఇది దర్శనమ్ కృతజ్ఞతా సంస్కృతి.

### గ్రంథాలకు జ్ఞానపీఠం

ఒక మంచి గ్రంథం ఆవిష్కృతం కావడం అంటే ఒక రచయిత కృషికి గుర్తింపే కాదు; కొత్త జ్ఞానం సమాజంలోకి ప్రవేశించడం. ఈ భావనతో దర్శనమ్ అనేక గ్రంథావిష్కరణ సభలను నిర్వహించింది. శంకరమఠంలో 'విభక్తి ప్రపత్తి', 'పుస్తకపాణి శతకం' గ్రంథాల ఆవిష్కరణ. లలితావాణి రచించిన 'మహాభారతంలో భీమసేనుడు' గ్రంథావిష్కరణ. దాశరథి పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ డా. అయాచితం నటేశ్వరశర్మగారి పరిశోధన గ్రంథం 'సౌందర్యలహరి సౌందర్యం' జూలై 26న ఆవిష్కరణ. ప్రొఫెసర్ ప్రఫుల్ల పరిశోధన గ్రంథం 'రామాయణ కల్పవృక్షం సాహిత్యం' నల్లకుంట శంకరమఠంలో సెప్టెంబర్ 10న ఆవిష్కరణ... ఇలా సాహిత్య-శాస్త్ర-పరిశోధనా గ్రంథాలకు దర్శనమ్ గౌరవ వేదికగా నిలిచింది.

### ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా పరిశోధన గ్రంథావిష్కరణ

భారత ఉపరాష్ట్రపతిగా సేవలందించిన శ్రీ ఎం. వెంకయ్య నాయుడు చేతుల మీదుగా, దత్తాత్రేయ శర్మ పరిశోధనలో రూపొందిన ముట్నూరు కృష్ణారావుగారి సంపాదకీయాలకు సంబంధించిన సిద్ధాంత గ్రంథం ఆవిష్కరణ జరగడం దర్శనమ్ ప్రస్థానంలో విశిష్ట మేధోపరమైన ఘట్టం. పాత్రికేయ చరిత్ర... పరిశోధన... సంపాదకీయ వైదుష్యం... ఈ మూడు రంగాల సంగమంగా ఆ కార్యక్రమం నిలిచింది.

### వారణాసిలో శలాక రఘునాథశర్మకు గురుసత్కారం

మహామహోపాధ్యాయులు, సంస్కృతాంధ్ర పండితులు, సాహితీవేత్త బ్రహ్మశ్రీ శలాక రఘునాథశర్మగారికి వారణాసిలో గురుసత్కారం నిర్వహించడం దర్శనమ్ సేవా పరిధి భాగ్యనగరాన్ని దాటి కాశీ వరకు విస్తరించిన ఘట్టం. ఇది కేవలం ఒక పండితుని సత్కారం కాదు. కాశీక్షేత్రంలో తెలుగు విద్వత్తుకు సమర్పించిన గౌరవపుష్పం.

### జగద్గురు పాదస్పర్శతో పునీతమైన దర్శనమ్ కార్యాలయం

దర్శనమ్ 22 ఏళ్ల చరిత్రలో అత్యంత పావనమైన, భావోద్వేగభరితమైన ఘట్టం. దక్షిణామ్నాయ శ్రీ శృంగేరీ శారదా పీఠ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ స్వామివారు, తమ ధర్మవిజయ యాత్రలో భాగంగా భాగ్యనగరానికి వేంచేసిన



సందర్భంగా దర్శనమ్ కార్యాలయానికి స్వయంగా విచ్చేయడం. జగద్గురువుల పాదస్పర్శతో దర్శనమ్ కార్యాలయం పునీత మైంది. అంతేకాదు---స్వామివారి దివ్యహస్తాలతో 'భారతీతీర్థ గ్రంథాలయం' ప్రారంభమైంది. ఒక ఆధ్యాత్మిక పత్రిక కార్యాలయానికి జగద్గురు వేంచేసి, అక్కడ గ్రంథాలయాన్ని ప్రారంభించడం అరుదైన అనుగ్రహం. దర్శనమ్ చరిత్రలో ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు. ఒక దివ్య ముద్ర. ఒక గురుకటాక్షం. ఒక కొత్త సాహిత్య యుగానికి నాంది.

**'అవధాన దర్శనమ్ - నెలనెలా అష్టావధానం'**

డిసెంబర్ 14న ప్రారంభమైన ఈ సాహితీ యజ్ఞం అప్రతి హతంగా కొనసాగుతోంది. ప్రతి నెలా ఒక అవధానం... కొత్త పృచ్ఛకులు, కొత్త అవధానులు, కొత్త ప్రయోగాలు, కొత్తతరానికి పద్యసాహిత్య పరిచయం... ఇలా భారతీతీర్థ గ్రంథాలయం కేవలం పుస్తకాల నిల యం కాకుండా జీవంత సాహిత్య ప్రయోగశాలగా పరిణామం చెందింది. ఈ పరంపర చి. నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అష్టావధానంతో ప్రారంభమై, ఆయన తొలి శతావధానం వరకు చేరడం విశేషం. అష్టావధానిగా వేదికపైకి వచ్చిన యువ ప్రతిభను శతావధానిగా ఎదిగే వరకు ప్రోత్స హించడం- దర్శనమ్ సాహిత్యసేవకు నిజమైన సార్థకత.





**శతావధానాల సంవత్సరంగా... 2026**

దర్శనమ్ 22వ సంవత్సరంలో సాహిత్యయాత్ర మరింత ఉత్సాహంగా కొనసాగింది. 2026 జనవరి 9, 10 తేదీల్లో ఉప్పల ధడియం భరతశర్మ శతావధానం నిర్వహించడం విశిష్ట ఘట్టం. దీనికి కొనసాగింపుగా ఉప్పల ధడియం భరతశర్మ ఏకదిన సంపూర్ణ శతావధానం నిర్వహించడం మరింత అరుదైన సాహిత్య ప్రయోగం.



ఇక నల్లాన్ చక్రవర్తుల సాహిత్ తొలి శతావధానం పుష్పగిరి పీఠ దివ్యాశీస్సులతో జరగడం/జరగనున్నది---దర్శనమ్ నెలనెలా అవధాన ఉద్యమం శతావధాన శిఖరాలకు ఎలా దారి తీస్తోందో చూపించే తాజా ఉదాహరణ. అంటే దర్శనమ్ అవధానాలను నిర్వహించడమే కాదు... అవధానుల భవిష్యత్తును నిర్మిస్తోంది.

**పెద్దలను సత్కరిస్తూ... కొత్త తరాన్ని తీర్చిదిద్దుతూ...**

దర్శనమ్ 22 ఏళ్ల సేవలో అత్యంత ప్రశంసనీయమైన అంశం ఈ సమతౌల్యం. ఒకవైపు--- జగద్గురువులు... పీఠాధిపతులు... మహామహోపాధ్యాయులు... వేద యాజులు... సహస్రావధానులు... ప్రవచన మహామహులు... మరోవైపు- యువ అవధానులు... బాలకవులు... వర్ధమాన పండి తులు... యువ పరిశోధకులు... అంటే దర్శనమ్ గత వైభవాన్ని కీర్తిస్తూ ఆగిపోలేదు. భవిష్యత్ వైభవాన్ని నిర్మించే ప్రయత్నం చేసింది. పెద్దల పాదాలకు నమస్క రిస్తూనే... చిన్నవారి చేతుల్లో జ్ఞానదీపాన్ని పెట్టింది. సంస్మరణ నుంచి సృష్టి వరకు... దోర్భల విశ్వనాథ శాస్త్రిని స్మరించింది... బ్రహ్మభట్ల శ్రీరామశర్మను స్మరించింది... అవధాన పండితులను స్మరించింది... అదే సమయంలో కొత్త అవధానులను వేదికపైకి తీసుకొచ్చింది. పాత గ్రంథ సంపదను గౌరవిం చింది... అదే సమయంలో కొత్త పరిశోధన గ్రంథా లను ఆవిష్కరించింది. వేద యాగాల ప్రాచీన సంప్ర దాయాన్ని ప్రచారం చేసింది. అదే సమయంలో జూమ్, యూట్యూబ్ వంటి ఆధునిక సాంకేతిక వేదికలను వినియోగించింది. ఈ సమన్వయమే దర్శనమ్ బలం.

**ముద్రిత పుట నుంచి 'దర్శనమ్ టీవీ' వరకు...**

22 ఏళ్లలో మీడియా ప్రపంచం విప్లవాత్మకంగా మారి పోయింది. ఒకప్పుడు ఆధ్యాత్మిక వార్త పాఠకుడి ఇంటికి మాస పత్రిక రూపంలో చేరేది. నేడు అదే వార్త మొబైల్ తెరపై ప్రత్యక్ష ప్రసారంగా చేరుతోంది. ఈ మార్పును దర్శనమ్ సకాలంలో స్వీకరించింది. దర్శనమ్ టీవీ... యూట్యూబ్... డిజిటల్ వీడి యోలు... ప్రత్యక్ష ప్రసారాలు... జగద్గురువుల ముఖా ముఖులు... పండితుల ఇంటర్వ్యూలు... అవధాన ప్రత్యక్ష ప్రసారాలు... ధర్మశాస్త్ర--జ్యోతిష చర్చలు... దేవాలయ వైభవ దృశ్యాలు... ఇలా ముద్రిత పత్రికకు డిజిటల్ రెక్కలు తొడిగింది.

## సంస్కృత భాషా దినోత్సవ సంస్కృత అష్టావధానం

2022 తెలంగాణ సారస్వత పరిషత్తులో లలిత్ ఆదిత్య శతావధానం. 2024 శృంగేరిలో సంస్కృతాంధ్ర శతావధానం. వద్దిపర్తి పద్మాకర్ శతావధానం. 2025 కాశీలో 25వ శతావధానం.

### కాశీ అష్టావధాన సప్తకం- ఏడు అష్టావధానాలు

2026 ఉప్పల ధడియం భరతశర్మ శతావధానం. ఉప్పల ధడియం భరతశర్మ ఏకదిన సంపూర్ణ శతావధానం. నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అష్టావధానం నుంచి తొలి శతావధానం వరకు. అవధానాన్ని కేవలం కాపాడలేదు దర్శనమ్... కొత్త అవధానులను సృష్టించే వేదికగా ఎదిగింది.





అందువల్ల నేడు దర్శనమ్ ఒక మాసపత్రిక మాత్రమే కాదు. ఒక సమగ్ర ప్రింట్--డిజిటల్ ఆధ్యాత్మిక సమాచార వేదిక.

### వార్తకు 'ధర్మదృష్టి'

దర్శనమ్ పాత్రికేయ తత్వాన్ని ఒక మాటలో చెప్పాలంటే--- "వార్త వెనుక విశేషం... విశేషం వెనుక శాస్త్రం... శాస్త్రం వెనుక ధర్మం." ఒక బ్రహ్మోత్సవం జరిగిందని చెప్పడం మాత్రమే కాదు... ఆ ఉత్సవానికి మూలం ఏమిటో చెప్పాలి. ఒక యాగం జరిగిందని చెప్పడం కాదు... ఆ యాగానికి వేదప్రమాణం ఏమిటో తెలియజేయాలి. ఒక పంచాంగ వివాదం వచ్చిందని సంచలనం చేయడం కాదు... సిద్ధాంతులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ప్రమాణం తెలుసుకోవాలి. ఒక మహనీయుడు వచ్చారని ఫొటో ప్రచురించడం కాదు... ఆయన బోధన సమాజానికి అందించాలి. ఈ దృక్పథమే దర్శనమ్‌ను సంస్కృతి కేంద్రిత పాత్రికేయతకు ప్రత్యేక నమూనాగా నిలబెట్టింది.

### "మహనీయులను వారు ఉన్నప్పుడే గౌరవించాలి"

దర్శనమ్ 22 ఏళ్ల కార్యక్రమాలన్నింటినీ ఒకే సూత్రంతో కట్టాలంటే అది ఇదే- "మన మధ్య ఉన్న మహనీయులను వారు ఉన్నప్పుడే గుర్తించాలి... గౌరవించాలి... వారి జ్ఞానాన్ని తరువాతి తరానికి అందించాలి." అందుకే పల్లకీ సేవ. అందుకే స్వర్ణకంకణం. అందుకే గురువందనం. అందుకే 'ధార్మిక వరేణ్య'. అందుకే జీవన సాఫల్య పురస్కారం. అందుకే గురుసత్కార సప్తాహం. ఇవి వ్యక్తి వైభవ ప్రదర్శనలు కాదు. జ్ఞానానికి గౌరవం. తపస్సుకు నమస్కారం. ధర్మసేవకు కృతజ్ఞత.

పండిత పరంపరకు పట్టాభిషేకం.

### దర్శనమ్ వెనుక పాత్రికేయ తపస్సు

ఈ సుదీర్ఘ ప్రస్థానానికి వెనుక సంపాదకులు మరుమాముల వేంకట రమణ శర్మ పాత్రికేయ అనుభవం, ఆధ్యాత్మిక నిబద్ధత, విద్వాంసుల పట్ల గౌరవం ప్రధాన శక్తులుగా నిలిచాయి. ప్రధాన స్రవంతి పాత్రికేయ రంగంలో, ముఖ్యంగా 'ఈనాడు'లో 27 ఏళ్ల సుదీర్ఘ అనుభవం సహా దాదాపు మూడున్నర దశాబ్దాల జర్నలిజం అనుభవం... వార్తను గుర్తించే జర్నలిస్టు దృష్టి... విషయాన్ని లోతుగా తెలుసుకోవాలనే తపన... పండితుని మాటలోని ప్రామాణ్యాన్ని గుర్తించే సంస్కారం... మరుగునపడిన విద్వత్తును వెలుగులోకి తేవాలన్న సంకల్పం... ఇవన్నీ కలిసి దర్శనమ్ సంపాదకీయ స్వరూపాన్ని తీర్చిదిద్దాయి. ఇక్కడ పాత్రికేయత కేవలం వృత్తి కాదు. ధర్మానికి అక్షరసేవ.

### 22 ఏళ్లు - సంఖ్య కాదు... సాధన

ఇరవై రెండేళ్ల ప్రయాణాన్ని కేవలం సంచికల సంఖ్యతో కొలవలేం. ఎన్ని పత్రికలు వచ్చాయి? ఎన్ని కార్యక్రమాలు జరిగాయి? ఎంతమంది వేదికపైకి వచ్చారు? ఇవి పరిమాణాల లెక్కలు. దర్శనమ్ విజయానికి అసలు ప్రమాణాలు వేరు. ఎన్ని హృదయాల్లో గురుభక్తి పెరిగింది? ఎంతమందికి వేదయజ్ఞం గురించి తెలిసింది? ఎన్ని కుటుంబాలకు శాస్త్రసమ్మత ధర్మవిషయం చేరింది? ఎంతమంది యువతకు అవధానం పరిచయమైంది? ఎంతమంది మరుగునపడిన పండితులు వెలుగులోకి వచ్చారు? ఎన్ని మహనీయుల సేవలు చరిత్రగా భద్రపడ్డాయి? ఎన్ని యువ ప్రతిభలకు మొదటి వేదిక లభించింది? ఈ ప్రశ్నలకు సమాధానమే దర్శనమ్ 22 ఏళ్ల నిజమైన విజయపత్రం.

'దర్శనమ్' అంటే... గురుపాదాలకు అక్షర పుష్పాంజలి... వేదవిద్యకు వినయపూర్వక వందనం... పండిత ప్రతిభకు





పట్టాభిషేకం... అవధాన సరస్వతికి ఆరాధన... యజ్ఞసంస్కృతికి అక్షర సాక్ష్యం... పంచాంగ శాస్త్రానికి ప్రమాణ వేదిక... సంస్కృత భాషకు సేవ... తెలుగు పద్యానికి ప్రోత్సాహం... గ్రంథాలకు జ్ఞానపీఠం... మహనీయులకు కృతజ్ఞత... యువ తరానికి స్ఫూర్తి... ఆస్తిక సమాజానికి మార్గదర్శనం.

**రెండో వార్షికోత్సవం నుంచి 22వ వసంతం వరకు...**

రవీంద్రభారతిలో రెండు వందల మంది కవిపండితుల సత్కారంతో మొదలైన మహోత్సవ పరంపర... శృంగేరీ నుంచి కంచి వరకు... బదరీ నుంచి ద్వారకా వరకు... పూరీ నుంచి ఉడిపి వరకు... రవీంద్రభారతి నుంచి తెలంగాణ సారస్వత పరిషత్తు వరకు... భాగ్యనగరం నుంచి శృంగేరి వరకు... శృంగేరి నుంచి వారణాసి వరకు... యజ్ఞశాల నుంచి అవధాన వేదిక వరకు... పండితసభ నుంచి డిజిటల్ తెర వరకు... 'దర్శనమ్' అడుగులు విస్తరించాయి.





కానీ ఆ అడుగుల వెనుక ఉన్న సంకల్పం మాత్రం ఒక్కటే- "సనాతన ధర్మం తరతరాలకు చేరాలి." 22 వసంతాల 'దర్శనమ్'... ప్రతి సంచిక ఒక అక్షరార్చన. ప్రతి గురువందనం ఒక పాదపూజ. ప్రతి అవధానం ఒక సరస్వతీ యజ్ఞం. ప్రతి విద్వద్గోష్ఠి ఒక జ్ఞాన మథనం. ప్రతి యాగవార్త ఒక వేదస్మరణ. ప్రతి గ్రంథావిష్కరణ ఒక జ్ఞానదీపం. ప్రతి సత్కారం ఒక సంస్కృతి సంరక్షణ. ప్రతి సంస్మరణ ఒక కృతజ్ఞతాంజలి. ప్రతి యువప్రతిభకు ఇచ్చిన వేదిక ఒక భవిష్యత్ నిర్మాణం. ఒక పత్రిక కాదు... ఒక ఉద్యమం. దర్శనమ్ ఒక పత్రిక కాదు... ఒక ధార్మిక చైతన్యం! దర్శనమ్ ఒక సంస్థ కాదు... ఒక గురు సేవా సంకల్పం! దర్శనమ్ ఒక కార్య క్రమం కాదు... ఒక నిరంతర సాంస్కృతిక ఉద్యమం! దర్శనమ్ 22 ఏళ్లు కాదు... 22 ఏళ్ల అక్షర తపస్సు!



**అక్షరయజ్ఞం అప్రతిహతంగా సాగాలి**

రెండు దశాబ్దాలకు పైబడిన ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎదురైన ప్రతి సవాలు దర్శనమ్ సంకల్పాన్ని మరింత పదును పెట్టింది. గురువుల దివ్యాశీస్సులు... వేదవిద్వాంసుల మార్గదర్శనం... పండితుల సహకారం... రచయితల కలాలు... భక్తుల ఆదరణ... పాఠకుల విశ్వాసం... కార్యకర్తల శ్రమ... ఇవన్నీ కలిసినప్పుడే 22 ఏళ్ల ఈ అద్భుత ప్రస్థానం సాధ్యమైంది. ఇది ఒక వ్యక్తి విజయం కాదు. ఒక సంపాదకుడి విజయం మాత్రమే కాదు. ఒక మాసపత్రిక విజయమే కాదు. ఇది ఒక సామూహిక ధర్మయజ్ఞం. ముద్రిత పుటలో మొదలైన అక్షరం... నేడు డిజిటల్ ప్రపంచంలో ధర్మధ్వనిగా మారింది. ఒకప్పుడు వార్తగా నమోదు చేసిన అవధానం... నేడు నెలనెలా ఉద్యమంగా మారింది. ఒకప్పుడు ఒక్క మహనీయుడికి చేసిన గురువందనం... నేడు ఒక మహత్తర గురుసత్కార పరంపరగా మారింది. ఒకప్పుడు చిన్న వేదికగా మొదలైన దర్శనమ్... నేడు రవీంద్రభారతి నుంచి శృంగేరి వరకు, భాగ్యనగరం నుంచి కాశీ వరకు తన సాంస్కృతిక అడుగుజాడలు ముద్రించింది. ఇప్పుడు 22వ వసంతంలో నిలబడి వెనుదిరిగి చూస్తే గర్వించడానికి ఎన్నో మైలురాళ్లు కనిపిస్తున్నాయి.

'దర్శనమ్' ఇంకా చేయాల్సిన ధర్మసేవ ఎంతో ఉంది. ఇంకా వెలుగులోకి తేవాల్సిన విద్వత్తు ఎంతో ఉంది. ఇంకా ప్రోత్సహించాల్సిన యువప్రతిభ ఎంతో ఉంది. ఇంకా భద్రపరచాల్సిన సనాతన జ్ఞానసంపద అపారం. అందుకే ఈ 22వ వార్షికోత్సవం ముగింపు కాదు. మరో మహాప్రస్థానానికి నాంది. 'దర్శనమ్' --- ధర్మానికి దర్పణం... గురుపరంపరకు వందనం... వేదవిద్యకు వేదిక... విద్వత్తుకు పట్టాభిషేకం... అవధాన సరస్వతికి ఆలయం... సంస్కృతికి సంరక్షణ... తరతరాలకు జ్ఞానదర్శనం!

**- బాల సుబ్రహ్మణ్యం**




**ఆదిశంకర భగవత్పాదులు ఎందుకు అవతరించారు? వారి అవతార సందేశం ఏమిటి? అద్వైతం అంటే ఏమిటి? భక్తి, కర్మ, జ్ఞానం మధ్య సంబంధం ఏమిటి? నాలుగు ఆమ్నాయ పీఠాలను ఆదిశంకరులే స్థాపించారా? శృంగేరీ శ్రీశారదాపీఠానికి ఉన్న ప్రత్యేకత ఏమిటి? యువతకు చదువుతో పాటు సంస్కారం ఎందుకు అవసరం? దేశభక్తి-ధర్మభక్తి రెండింటినీ ఎందుకు సమానంగా చూడాలి? మాతృభాషలను ఎందుకు కాపాడుకోవాలి? దేవాలయాలు ఎలా నడవాలి? ఆలయ ఆదాయం దేనికి ఉపయోగ పడాలి?... ఇలా సనాతన ధర్మానికి, సమాజానికి సంబంధించిన అనేక కీలక ప్రశ్నలకు దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ మహాస్వామివారు అత్యంత సరళంగా, సోదాహరణంగా సమాధానమిచ్చారు. 'దర్శనమ్' కోసం సాగిన ఈ సుదీర్ఘ ముఖాముఖి ఒక సాధారణ ఇంటర్వ్యూ కాదు... ఆదిశంకరుల నుంచి ఆధునిక యువత వరకు, అద్వైత తత్త్వం నుంచి దేవాలయ పరిరక్షణ వరకు, విద్య నుంచి సంస్కారం వరకు, భాషాభిమానం నుంచి దేశభక్తి వరకు సాగిన ఒక అపూర్వ జ్ఞానయజ్ఞం. జగద్గురువుల అమృతవాక్కుల్లోని సారాంశాన్ని సరళంగా అందిస్తున్నాం.**

యుగయుగాల్లో ధర్మాన్ని నిలబెట్టేందుకు భగవంతుడు అనేక రూపాల్లో అవతరించాడు. ఒక్కో కాలంలో ఒక్కో అవసరం ఏర్పడింది. కొన్ని అవతారాల్లో దుష్టులను శిక్షించి ధర్మాన్ని కాపాడాల్సిన అవసరం వచ్చింది. కానీ ఆదిశంకరుల అవతారంలో ప్రధానంగా కావలసింది రాక్షస సంహారం కాదు- అజ్ఞాన నిర్మూలన. అందుకే పరమేశ్వరుడు గురు స్వరూపంలో ఆదిశంకర భగవత్పాదులుగా అవత రించారని జగద్గురువులు వివరించారు. గురువు చేసే ప్రధాన కార్యం జ్ఞానాన్ని ఇవ్వడం. ఆ జ్ఞానం ద్వారా మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి, జీవిత పరమార్థాన్ని తెలియజేయడమే శంకరావతార విశిష్టత.

ఆదిశంకరులు ఉపనిషత్తుల సారమైన అద్వైత తత్త్వాన్ని తమ భాష్యాల ద్వారా ప్రపంచానికి అందించారు. అయితే వారి బోధన కేవలం వేదాంతానికో, సన్యాసులకో పరిమితం కాలేదు. సామాన్యుడి జీవితం నుంచి మోక్షమార్గం వరకు అన్నింటికీ వారు దిశ చూపించారు.

### ఆదిశంకరుల వైశిష్ట్యం సమన్వయం

ఆదిశంకరులు జ్ఞానమార్గాన్ని బోధించారు. అదే సమయంలో భక్తికి గొప్ప స్థానం ఇచ్చారు. కర్మా చరణకు అవసరమైన ప్రాధాన్యాన్ని చెప్పారు. ఉపాసనను నిరాకరించలేదు. చివరకు ఈ మార్గాలన్నీ

మనిషిని పరమతత్త్వ జ్ఞానం వైపు తీసుకువెళ్లాలని వివరించారు.

సౌందర్యలహరి, శివానందలహరి, గణేశ పంచరత్నం వంటి స్తోత్రాల ద్వారా భక్తిమార్గాన్ని సులభం చేశారు. భాష్యగ్రంథాల ద్వారా తత్త్వాన్ని వివరించారు. ప్రశ్నోత్తర రత్నమాలిక, భజగోవిందం వంటి రచనల ద్వారా జీవితానికి అవసరమైన నీతి, కర్తవ్యం, వైరాగ్యం, సమాజ ధర్మాన్ని బోధించారు.

అందుకే శంకరుల బోధనను కేవలం 'అద్వైతం' అనే ఒక్క మాటలో పరిమితం చేయలేం. అందులో భక్తి ఉంది... కర్మ ఉంది... జ్ఞానం ఉంది... ఉపాసన ఉంది... సమాజ హితం ఉంది... చివరకు మోక్షమార్గం ఉంది.

**సమాజానికి శంకరులు చెప్పిన మూడు ప్రధాన సూత్రాలు**

ఆదిశంకరుల బోధనలో సామాజిక దృష్టి కూడా ఎంతో గొప్పదని జగద్గురువులు వివరించారు. ప్రశ్నోత్తర రత్నమాలికలో "విద్యాభ్యాసే, సదౌషధే, దానే" అనే భావాన్ని ప్రస్తావిస్తూ సమాజం ఏ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలో వివరించారు.

మొదట విద్య- సమాజంలో మంచి విద్యావ్యవస్థ ఉండాలి. విద్య అందరికీ అందాలి. చదవడం ఎంత ముఖ్యమో చదువు చెప్పడం, విద్యాసంస్థలను బలపరచడం కూడా అంతే ముఖ్యం.



**"కాలం మారవచ్చు. జీవన విధానం మారవచ్చు. సాంకేతికత మారవచ్చు. కానీ మనిషికి కావలసిన సత్యం, నీతి, విద్య, ఆరోగ్యం, సంస్కారం, భక్తి, జ్ఞానం వంటి మౌలిక విలువలు మారవు. అందుకే శంకరుల బోధన నిన్నటిదీ కాదు... కేవలం ఆనాటిదీ కాదు... అది నిత్యనూతనం.**

రెండవది ఆరోగ్యం- ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి వైద్యసదుపాయాలు అందుబాటులో ఉండాలి.




మూడవది దానం- విద్య, వైద్యం వంటి వ్యవస్థలు ఎవరో ఒక్కరి వల్ల నడవవు. ప్రతి ఒక్కరూ తమ శక్తి మేరకు సహకరించాలి. ధనం ఉన్నవారు ధనంతో, జ్ఞానం ఉన్నవారు జ్ఞానంతో, శక్తి ఉన్నవారు శ్రమతో సమాజానికి తోడ్పడాలి.

దానం అంటే కేవలం ధనం ఇవ్వడం కాదు. మనకు ఉన్న శక్తిని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించడం కూడా దానమే అన్న గొప్ప భావాన్ని జగద్గురువులు వివరించారు.

ఈ బోధన శతాబ్దాల క్రితం చెప్పబడినా నేటికీ ఎంత అవసరమో మన కళ్లముందే కనిపిస్తోంది. మంచి విద్య, మంచి వైద్యం, సమాజ సహకారం- ఏ దేశానికైనా ఇవే ప్రాథమిక అవసరాలు.

**శంకరుల బోధనలకు కాలదోషం లేదు**

"ఆదిశంకరులు ఎంతో కాలం క్రితం చెప్పారు. వారి మాటలు ఈ కాలానికి ఎలా ఉపయోగపడతాయి?" అనే సందేహానికి కూడా జగద్గురువుల వివరణ స్పష్టమైన సమాధానం ఇస్తుంది.

కాలం మారవచ్చు. జీవన విధానం మారవచ్చు. సాంకేతికత మారవచ్చు. కానీ మనిషికి కావలసిన సత్యం, నీతి, విద్య, ఆరోగ్యం, సంస్కారం, భక్తి, జ్ఞానం వంటి మౌలిక విలువలు మారవు. అందుకే శంకరుల బోధన నిన్నటిదీ కాదు... కేవలం ఆనాటిదీ కాదు... అది నిత్యనూతనం.

**'నా దేవుడు - నీ దేవుడు' అనే భేదం వద్దు**

హిందూ సమాజంలో ఒకప్పుడు 'మా దేవుడే గొప్ప', 'మీ దేవుడు తక్కువ' అనే భావాలతో విభేదాలు ఏర్పడ్డాయని జగద్గురువులు వివరించారు. ఆదిశంకరులు ఈ భేదాలను తొలగించే సమన్వయ దృష్టిని ఇచ్చారు. పరమాత్మ ఒక్కడే. రూపాలు అనేకం. ఎవరి అభిరుచిని బట్టి వారు శాస్త్రం చెప్పిన పద్ధతిలో తమ ఇష్టదైవాన్ని ఆరాధించవచ్చు. శివుడిని ఆరాధించినవాడు విష్ణువును తక్కువగా చూడాల్సిన అవసరం లేదు. విష్ణుభక్తుడు దేవీ స్వరూపాన్ని నిరాకరించాల్సిన అవసరం లేదు. ఏ రూపంలో ఆరాధించినా చేరేది ఒకే పరమాత్మను. ఈ విశాల దృష్టితో హిందూ సమాజంలో ఐక్యతను పెంచడంలో ఆదిశంకరుల పాత్ర ఎంతో గొప్పదని జగద్గురువులు వివరించారు.

## కాలడిలో అవతారం... భారతమంతా ధర్మయాత్ర

కేరళలోని కాలడి అగ్రహారంలో ఆర్యాంబ, శివగురు పుణ్య దంపతులకు శివారాధన ఫలంగా ఆదిశంకరులు అవతరించారని సంప్రదాయం చెబుతోంది. అక్కడి నుంచి ప్రారంభమైన వారి జీవనయాత్ర యావద్భారతాన్ని స్పృశించింది. దేశమంతా సంచరించారు. ధర్మాన్ని బోధించారు. పండితులతో శాస్త్రచర్చలు జరిపారు. అనేక గ్రంథాలను రచించారు. నాలుగు దిక్కుల్లో ఆమ్నాయ పీఠాలను స్థాపించారు. చివరకు కేదార క్షేత్రంలో తమ అవతార కార్యాన్ని సమాప్తం చేశారని జగద్గురువులు వివరించారు. సంప్రదాయ చరిత్ర ప్రకారం శంకరులు 32 సంవత్సరాలు జీవించినట్లు పేర్కొన్నారు. అయితే శంకరులు ఏ సంవత్సరంలో జన్మించారు? ఏ కాలానికి చెందినవారు? అనే చర్చకంటే వారు ఏమి చెప్పారు? వారు చూపిన మార్గంలో మనం ఎంతవరకు నడుస్తున్నాం? అన్నది సాధకుడికి ముఖ్యమని జగద్గురువులు చెప్పారు. చరిత్ర పరిశోధనకు కాలనిర్ణయం అవసరం. కానీ ఆధ్యాత్మిక జీవనానికి శంకరుల తత్త్వాన్ని అర్థం చేసుకోవడం, ఆచరించడం మరింత అవసరం.

> “ **నాలుగు ఆమ్నాయ పీఠాల్లో దక్షిణ దిక్కున ఆదిశంకరులు స్థాపించిన పీఠమే దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠం. సమస్త విద్యలకు అధిదేవత అయిన సరస్వతీదేవిని శారదా పరమేశ్వరిగా ఇక్కడ ఆరాధిస్తారు. ఆదిశంకరులు శారదాంబను ప్రతిష్ఠించడంతో ఈ పీఠం శ్రీశారదాపీఠంగా ప్రసిద్ధి పొందింది.**

## ఆమ్నాయ పీఠాలను స్థాపించింది ఆదిశంకరులే

ఆదిశంకర భగవత్పాదులు ఆమ్నాయ పీఠాలను స్థాపించలేదనే కొన్ని వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో జగద్గురువులు స్పష్టత ఇచ్చారు. మఠామ్నాయ మహానుశాసనం ఇందుకు ప్రధాన ప్రమాణమని వివరించారు. వివిధ ఆమ్నాయ పీఠ సంప్రదాయాల్లో కొన్ని వివరాల్లో భేదాలు ఉండవచ్చు. మొదటి ఆచార్యుల పరంపర, కొన్ని అనుబంధ విషయాల్లో వేర్వేరు అభిప్రాయాలు కనిపించవచ్చు. కానీ నాలుగు దిక్కుల్లో ఆమ్నాయ పీఠాలను ఆదిశంకర భగవత్పాదులే స్థాపించారనే విషయంపై సందేహం లేదని స్పష్టం చేశారు. ఆ నాలుగు పీఠాలకు మూలాచార్యులు ఆదిశంకరులే. అనంతరం తమ శిష్యులను ఆయా పీఠాల్లో అధిష్ఠింపజేసి గురుపరంపర కొనసాగించారు.

## శృంగేరీ... జ్ఞానానికి, ధర్మానికి పవిత్ర క్షేత్రం

నాలుగు ఆమ్నాయ పీఠాల్లో దక్షిణ దిక్కున ఆదిశంకరులు స్థాపించిన పీఠమే దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠం. సమస్త విద్యలకు అధిదేవత అయిన సరస్వతీదేవిని శారదా పరమేశ్వరిగా ఇక్కడ ఆరాధిస్తారు. ఆదిశంకరులు శారదాంబను ప్రతిష్ఠించడంతో ఈ పీఠం శ్రీశారదాపీఠంగా ప్రసిద్ధి పొందిందని జగద్గురువులు వివరించారు. సురేశ్వరాచార్యుల నుంచి కొనసాగుతున్న గురుపరంపర నేటికీ వేదం, వేదాంగాలు, శాస్త్రాలు, సనాతన ధర్మం, ఆర్ష సంస్కృతి పరిరక్షణలో అపూర్వమైన సేవ చేస్తోంది. శృంగేరీ కేవలం ఒక మఠం కాదు. ఎన్నో తరాలకు జ్ఞానం అందించిన విద్యాక్షేత్రం. పండితులను పోషించిన కేంద్రం. ధర్మసందేహాలకు సమాధానం ఇచ్చిన మార్గదర్శక పీఠం.



## గురుపరంపర అంటే అధికార పరంపర కాదు

పీఠాధిపత్యం అనేది సాధారణ పదవి కాదు. అది ధర్మబాధ్యత. శృంగేరీ పీఠంలో గురువులు తమ ఉత్తరాధికారిని నియమించే విశిష్టమైన సంప్రదాయం కొనసాగుతోంది. గురువు నిర్ణయించిన శిష్యుడే తరువాత పీఠాన్ని అధిష్ఠిస్తారు. జగద్గురువులకు జరిగే రాజోపచారాలు, సింహాసనారోహణ, కిరీటధారణ, హారాలు వంటి వాటిని వ్యక్తిగత భోగాలుగా చూడకూడదని కూడా ముఖాముఖిలో వివరించారు. అవి వ్యక్తికి ఇచ్చే భోగాలు కాకుండా పీఠానికి, గురుపరంపరకు, ధర్మపీఠ గౌరవానికి సంబంధించిన సంప్రదాయ చిహ్నాలు. గురుపీఠం వ్యక్తికంటే గొప్పది. ఆ వ్యక్తి తనను గురుపరంపర సేవకుడిగానే భావిస్తాడు.

## ధర్మవిజయ యాత్రల లక్ష్యం ఏమిటి?

ఆదిశంకర భగవత్పాదులు భారతదేశమంతా సంచరించి ధర్మాన్ని పునరుజ్జీవింపజేశారు. అదే ఆదర్శంతో శృంగేరీ జగద్గురువుల ధర్మవిజయ యాత్రలు కూడా కొనసాగుతున్నాయి. జగద్గురువులు వివిధ ప్రాంతాలకు వెళ్లినప్పుడు భక్తులకు దర్శనం ఇవ్వడం మాత్రమే కాదు; ధర్మసందేశం అందించడం, వేదపండితులను ప్రోత్సహించడం, దేవాలయాలను దర్శించడం, సంప్రదాయాలను బలపరచడం, భక్తుల్లో ధార్మిక చైతన్యం కలిగించడం ప్రధాన ఉద్దేశ్యాలు. భారతదేశంతో పాటు నేపాల్ వంటి ప్రాంతాలతో కూడా శృంగేరీ పీఠానికి ఉన్న ధార్మిక అనుబంధాన్ని ముఖాముఖిలో ప్రస్తావించారు. ఆదిశంకరుల ధర్మవిజయ స్ఫూర్తి నేటికీ గురుపరంపర ద్వారా కొనసాగుతోందనే భావం ఇందులో స్పష్టమవుతుంది.

> "సంస్కారం ఉన్న వ్యక్తికి పెద్ద పదవి లేకపోయినా గౌరవం లభిస్తుంది. అందుకే పిల్లలకు చదువు చెప్పడంతో పాటు మంచి నడవడి, పెద్దల పట్ల గౌరవం, బాధ్యత, దయ, ధర్మచింతన, దేశభక్తి వంటి విలువలను నేర్పాల్సిన బాధ్యత కుటుంబం, సమాజంపై ఉంది.

## విద్యతో పాటు సంస్కారం తప్పనిసరి

నేటి యువతకు జగద్గురువులు ఇచ్చిన అత్యంత విలువైన సందేశాల్లో ఒకటి- సంస్కారం. చదువు చాలా ముఖ్యం. జ్ఞానం అవసరం. కానీ చదువు ఒక్కటే మనిషిని గొప్పవాడిని చేయదు. ఒక పండితుడు తన జ్ఞానాన్ని తప్పుగా ఉపయోగించవచ్చు. ధనవంతుడు తన సంపదను దుర్వినియోగం చేయవచ్చు. అధికారి తన అధికారాన్ని దుర్వినియోగం చేయవచ్చు. బలవంతుడు తన బలాన్ని చెడు పనికి ఉపయోగించవచ్చు. కానీ నిజమైన సంస్కారం ఉన్న మనిషి చెడు మార్గాన్ని ఎంచుకోడు. అందుకే విద్య ఎంత ముఖ్యమో, సంస్కారం అంతకంటే ముఖ్యమని జగద్గురువులు చెప్పారు. సంస్కారం ఉన్న వ్యక్తికి పెద్ద పదవి లేకపోయినా గౌరవం లభిస్తుంది. ధనం లేకపోయినా ప్రేమ లభిస్తుంది. పాండిత్యం తక్కువగా ఉన్నా మంచి మనిషిగా సమాజం గుర్తిస్తుంది. అందుకే పిల్లలకు చదువు చెప్పడంతో పాటు మంచి నడవడి, పెద్దల పట్ల గౌరవం, బాధ్యత, దయ, ధర్మచింతన, దేశభక్తి వంటి విలువలను నేర్పాల్సిన బాధ్యత కుటుంబం, సమాజంపై ఉంది.

## యువత ధర్మాన్ని తెలుసుకోవాలి

యువతలో ధర్మంపై అపోహలు తొలగాలని జగద్గురువులు కోరారు. ఎవరో చెప్పిన మాట విన్న వెంటనే నమ్మకూడదు. సామాజిక మాధ్యమంలో వచ్చిన ప్రతి వ్యాఖ్యను సత్యంగా భావించకూడదు. ధర్మాన్ని విమర్శించే ముందు దాని అసలు రూపాన్ని తెలుసుకోవాలి. మూలగ్రంథాలను చదవాలి. పెద్దల నుంచి తెలుసుకోవాలి. పండితులను అడగాలి. శాస్త్రంలో ఏ మాట ఏ సందర్భంలో చెప్పబడిందో అర్థం చేసుకోవాలి. అప్పుడు అపోహలు తొలగుతాయి. ధర్మంలోని విశాలత తెలుస్తుంది. యువత విద్యనభ్యసించి వ్యక్తిగతంగా ఎదగడం మాత్రమే కాకుండా దేశం నడిచే వ్యవస్థల్లోనూ బాధ్యతగా భాగస్వాములు కావాలని జగద్గురువుల సందేశంలో కనిపిస్తుంది. దేశాన్ని, ధర్మాన్ని కాపాడటంలో యువత



ముందుండాలని సూచించారు.

### భాష అంటే మాటలకే పరిమితం కాదు

మనసులోని భావాన్ని మరొకరికి చెప్పడానికి భాష అవసరం. కానీ భాష ప్రయోజనం అంతటితో ముగిసిపోదని జగద్గురువులు చెప్పారు. ప్రతి భాష వెనుక ఒక చరిత్ర ఉంది. ఒక సంస్కృతి ఉంది. ఒక సాహిత్య సంపద ఉంది. తరతరాల జ్ఞానం ఉంది. సంస్కృత భాషలో వేదాలు, శాస్త్రాలు, వైదిక వాంఙ్మయం అపారంగా ఉన్నాయి. భారతీయ భాషల్లో మహాకవుల కావ్యాలు, శతకాలు, ఇతిహాసాలు, ఆధ్యాత్మిక రచనలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. అందుకే భాషను కేవలం సంభాషణ సాధనంగా చూడకూడదని జగద్గురువులు చెప్పారు. తెలుగు వారికి తెలుగు పట్ల ప్రేమ ఉండాలి. ఇతర మాతృభాషల వారికి వారి భాషపై మమకారం ఉండాలి. అదే సమయంలో సంస్కృత భాషతో అనుబంధాన్ని పెంచుకోవాలి. తెలుగు వారికి ప్రత్యేకమైన అవధాన విద్య వంటి సాహిత్య సంప్రదాయాలను కూడా ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ముఖాముఖిలో ప్రస్తావించారు.

> “ 'దేశం ఒక కన్ను... ధర్మం మరో కన్ను.' మనిషికి రెండు కళ్లూ అవసరం. దేశాన్ని ప్రేమిస్తూ ధర్మాన్ని మరచి పోకూడదు. ధర్మం పేరుతో దేశ బాధ్యతను విస్మరించకూడదు. దేశం సురక్షితంగా, సుస్థిరంగా ఉంటేనే ధర్మాచరణకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది.

### దేశం ఒక కన్ను... ధర్మం మరో కన్ను

యువతకు జగద్గురువులు ఇచ్చిన అత్యంత హృద్యమైన సందేశం- 'దేశం ఒక కన్ను... ధర్మం మరో కన్ను.' మనిషికి రెండు కళ్లూ అవసరం. రెండు కళ్లతో చూసినప్పుడే దృశ్యం స్పష్టంగా కనిపిస్తుంది. అదే విధంగా మన జీవితంలో దేశం, ధర్మం రెండూ ముఖ్యమని జగద్గురువులు చెప్పారు. దేశాన్ని ప్రేమిస్తూ ధర్మాన్ని మరచిపోకూడదు. ధర్మం పేరుతో దేశ బాధ్యతను విస్మరించకూడదు. దేశం సురక్షితంగా, సుస్థిరంగా ఉంటేనే ధర్మాచరణకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ధర్మం, విలువలు ఉన్నప్పుడే దేశ జీవనం మంచి మార్గంలో సాగుతుంది. అందుకే రెండింటినీ రెండు కళ్లలా



కాపాడుకోవాలని జగద్గురువులు సూచించారు. యువత తమ దేశ చరిత్రను తెలుసుకోవాలి. భారతదేశ గొప్పతనాన్ని తెలుసుకోవాలి. సనాతన ధర్మంలోని విలువలను అర్థం చేసుకోవాలి. అప్పుడు దేశం పట్ల, సంస్కృతి పట్ల సహజమైన గౌరవం పెరుగుతుంది.

### 'సేవ' అంటే పరస్పర సహకారం

ధర్మశాస్త్రాల్లో కనిపించే కొన్ని పదాలకు తప్పు అర్థాలు చెప్పడం వల్ల అపోహలు ఏర్పడుతున్నాయని జగద్గురువులు వివరించారు. ముఖ్యంగా 'సేవ', 'పరిచర్య' వంటి పదాలను బానిసత్వం లేదా దాస్యంగా చూడటం సరికాదని చెప్పారు. సేవ అంటే మరొకరి మేలు కోసం చేయాల్సిన పనిని చేయడం. సమాజంలోని ఒక్కొక్కరు తమ తమ బాధ్యతలు నిర్వర్తిస్తూ పరస్పరం సహకరించుకోవడమే సేవ అసలు భావమని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఒక బాధ్యత ఉంటుంది. కర్తవ్యాలు వేరు కావచ్చు. కానీ దాని వల్ల ఒకరు గొప్ప, మరొకరు తక్కువ అని భావించడం సరికాదు.

### స్త్రీల స్థానం గురించి అపోహలు వద్దు

హిందూ ధర్మంలో స్త్రీలకు స్థానం లేదనే విమర్శల గురించి కూడా జగద్గురువులు స్పందించారు. స్త్రీలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను శాస్త్రం కుటుంబం, సమాజంపై ఉంచిందని, దానిని స్వేచ్ఛ లేకపోవడంగా అర్థం చేసుకోవడం సరికాదని వివరించారు. సంప్రదాయాన్ని సక్రమంగా పాటించే కుటుంబాల్లో స్త్రీకి ఉన్నత గౌరవం ఉంటుందని, అనేక ధార్మిక సందర్భాల్లో స్త్రీని అమ్మవారి స్వరూపంగా భావించే సంప్రదాయం ఉందని పేర్కొన్నారు. ఏ ధర్మసూత్రాన్నైనా దాని సందర్భం, ఉద్దేశం తెలుసుకున్న తర్వాతే అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

### దేవాలయాలు సంప్రదాయం ప్రకారమే నడవాలి

దేవాలయాల నిర్వహణపై జగద్గురువులు అత్యంత స్పష్టమైన సందేశం ఇచ్చారు. ప్రతి పురాతన క్షేత్రానికీ ఒక చరిత్ర ఉంటుంది. ఒక స్థలపురాణం ఉంటుంది. ఒక ఆగమ సంప్రదాయం ఉంటుంది. తరతరాలుగా వస్తున్న పూజా విధానం ఉంటుంది. అవి ఎవరి ఇష్టానుసారం వారు మార్చకూడదు. ఒక ఆలయంలో ఏ ఆగమం ప్రకారం పూజలు

జరుగుతున్నాయో అదే సంప్రదాయం కొనసాగాలి. ఏ ఉత్సవం ఎలా జరగాలో పూర్వం నుంచి వస్తున్న విధానాన్నే పాటించాలి. కొత్తగా ఎవరైనా నిర్వహణలోకి వచ్చారని క్షేత్ర సంప్రదాయాన్ని మార్చడం సరికాదని జగద్గురువులు స్పష్టం చేశారు. ఈ విషయంలో శాస్త్రాలు, ఆగమాలు, సంప్రదాయాలు తెలిసిన ధర్మాచార్యుల మార్గదర్శనం అవసరమని చెప్పారు.

### ఆలయ ఆదాయం ధర్మానికే...

దేవాలయాలకు భక్తుల ద్వారా వచ్చే ఆదాయం గురించి కూడా జగద్గురువులు ముఖ్యమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భక్తుడు దేవుడికి సమర్పించిన ధనం ఆలయ నిర్వహణకు, పూజలకు, ఉత్సవాలకు, ధార్మిక కార్యక్రమాలకు, ధర్మ పరిరక్షణకు వినియోగించబడాలి. ఆలయానికి వచ్చిన ప్రతి రూపాయి ఆలయానికి, ధర్మానికి ఉపయోగపడేలా వ్యవస్థ ఉండాలి అని వివరించారు. దేవాలయాలు ధార్మిక విషయాల్లో శాస్త్రజ్ఞులైన ధర్మాచార్యుల మార్గదర్శనంలో నడవాలని, ఆలయాల ఆదాయం దేవస్థానం, ధార్మిక కార్యక్రమాల కోసం ఉపయోగపడాలని జగద్గురువులు స్పష్టం చేశారు. అదే సమయంలో ఎవరు నిర్వహణ చేపట్టినా ఇష్టానుసారంగా వ్యవహరించకుండా, పటిష్ఠమైన పారదర్శక వ్యవస్థ ఉండటం అవసరమని సూచించారు.

"ఆదిశంకరుల గురించి తెలుసుకోవడం గొప్ప విషయం. వారి చరిత్ర చదవడం అవసరం. వారి గ్రంథాలను అధ్యయనం చేయడం మరింత అవసరం. కానీ వాటన్నింటికంటే ముఖ్యమైనది? వారు చెప్పిన మార్గాన్ని ఆచరించడం.

### ఆచరణే అసలైన శంకర సందేశం

ఆదిశంకరుల గురించి తెలుసుకోవడం గొప్ప విషయం. వారి చరిత్ర చదవడం అవసరం. వారి గ్రంథాలను అధ్యయనం చేయడం మరింత అవసరం. కానీ వాటన్నింటికంటే ముఖ్యమైనది? వారు చెప్పిన మార్గాన్ని ఆచరించడం. భక్తి మన ప్రవర్తనలో కనిపించాలి. విద్యతో వినయం రావాలి. జ్ఞానంతో అహంకారం తగ్గాలి. సంపదతో సేవాభావం పెరగాలి. సంస్కారంతో వ్యక్తిత్వం వికసించాలి. దేశభక్తితో బాధ్యత పెరగాలి. ధర్మజ్ఞానంతో జీవితం సార్థకం కావాలి. శంకరుల జన్మకాలంపై ఎంత చర్చించినా, వారి బోధనను జీవితంలోకి తీసుకురాకపోతే ప్రయోజనం తక్కువ. వారు చూపిన తత్త్వాన్ని అర్థం చేసుకుని సాధన చేయడమే నిజమైన గురువందనం.



### నేటి తరానికి ధర్మదిక్సూచి

సుదీర్ఘమైన ఈ ముఖాముఖిలో ఆదిశంకర భగవత్పాదుల అవతార విశిష్టత నుంచి ఆమ్నాయ పీఠాల వరకు... శృంగేరీ గురుపరంపర నుంచి ధర్మవిజయ యాత్రల వరకు... భక్తి నుంచి అద్వైత జ్ఞానం వరకు... విద్య నుంచి సంస్కారం వరకు... మాతృభాష నుంచి దేశభక్తి వరకు... సామాజిక అపోహల నుంచి దేవాలయ పరిరక్షణ వరకు అనేక విషయాలను జగద్గురువులు ఎంతో ఓపికగా వివరించారు.

వారి మాటల్లో ఒక శాస్త్రదృష్టి ఉంది. ఒక ఆధ్యాత్మిక లోతు ఉంది. ఒక సామాజిక బాధ్యత ఉంది. ఒక జాతీయ చైతన్యం ఉంది. ఒక సంస్కార సందేశం ఉంది. ముఖ్యంగా నేటి తరానికి ఒక స్పష్టమైన పిలుపు ఉంది. ధర్మాన్ని తెలుసుకోవాలి. అపోహలను తొలగించుకోవాలి. విద్యతో పాటు సంస్కారాన్ని పెంచుకోవాలి. మాతృభాషను ప్రేమించాలి. దేశాన్ని, ధర్మాన్ని రెండు కళ్లలా కాపాడుకోవాలి. దేవాలయ సంప్రదాయాలను పరిరక్షించాలి. శంకరుల బోధనను చదవడమే కాదు- జీవితంలో ఆచరించాలి. ఆదిశంకర భగవత్పాదులు కేవలం ఒక తత్త్వవేత్త కాదు. వారు భక్తికి మార్గదర్శి. జ్ఞానానికి గురువు. కర్మకు దిశానిర్దేశకుడు. సమాజానికి సంస్కారదాత. హిందూ సమాజానికి సమన్వయకర్త. సనాతన ధర్మానికి జ్ఞానజ్యోతి. అందుకే ఆయన జగద్గురువు.

అదే గురుపరంపరలో నేటి సమాజానికి ధర్మదిశ చూపుతున్న శృంగేరీ జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ మహాస్వామివారి ఈ అమృతవాక్కులు ప్రతి హిందువూ తెలుసుకోవాల్సినవి... ముఖ్యంగా యువత హృదయంలో నిలుపుకోవాల్సినవి.

ఇది కేవలం ముఖాముఖి కాదు... ఒక జ్ఞానయజ్ఞం! ఇది కేవలం సంభాషణ కాదు... సనాతన ధర్మ సర్వస్వాన్ని సరళంగా తెలిపిన అమృతధార! ■




**అవధానమన్న పదానికి చిరునామా తెలుగు వాడు. అవధాన ప్రక్రియ అన్ని భాషలలోకంటే తెలుగు భాషలోనే ఎంతో రంజకంగా, విశ్వవిజేతగా మారి, సమాజాన్ని రంజింపజేస్తూ, సంస్కృతివైపు మార్గనిర్దేశం చేస్తోందని భాషావేత్తల అభిప్రాయం. అటువంటి అవధానకళను వ్యాకరణం, ఛందస్సు, శాస్త్రాలు చిన్నప్పటి నుండి గురుకులంలో చదువుకున్న వారే చేయగలరు అనుకుంటే పొరపాటే! కేవలం 22 సంవత్సరాల యువకుడు, అదీ, ఐఐటీలో సాంకేతిక విద్యలో అత్యుత్తమఫలితాన్ని సాధిస్తూనే, ఇటు ఎందరో ఉద్దండపండితులు సైతం ముక్కు మీద వేలువేసుకొనేలా అవధానకళలో ఆరితేరిన 'నల్లాన్ చక్రవర్తుల సాహిత్'ప్రతిభ అనిర్వచనీయం. 'దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక' నిర్వహణలో, శ్రీ పుష్పగిరి పీఠ మహాసంస్థానం జగద్గురువుల చాతుర్మాస్యం సందర్భంగా, భాగ్యనగరంలోని బేగంపేట పుష్పగిరి మఠం వేదికగా, సెప్టెంబర్ 18, 19, 20 తేదీలలో ఐఐటి నిపుణుడు 'శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్'చేసిన ప్రథమ శతావధానంపై ప్రత్యేక నివేదిక.**


ఉప్పలధడియం భరత్ శర్మ

గత అనేక సంవత్సరాలుగా ఆధ్యాత్మికం, జ్యోతిషం సంగీతం, సాహిత్యం, అవధానం - ఇలా అనేక ప్రక్రియలకు ప్రోత్సాహాన్ని అందిస్తూ, 'దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక'పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తుండడం విదితమే. ఈ నేపథ్యంలో, 2026 సంవత్సరం సెప్టెంబర్ నెల 18, 19, 20 తేదీలలో, శ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థానం పీఠాధీశ్వరులు శ్రీమదభినవోద్దండ విద్యాశంకరభారతీస్వామి వారి చాతుర్మాస్యం సందర్భంగా, స్వామి వారి సమక్షంలో, అలాగే వినాయకనవరాత్రోత్సవాల సందర్భంగా, భాగ్యనగరం బేగంపేటలో ఉన్న పుష్పగిరి మఠం వేదికగా, 'శతావధాన విద్వన్మరాళ'శ్రీ ఆముదాల మురళి సంచాలకత్వంలో, యువ అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్ శతావధానం ఎందరో ఉద్దండ పండితులూ, సహస్రావధానులూ, శతావధానులూ, పద్యకవుల మధ్య, మూడురోజుల పాటూ అంగరంగ వైభవంగా, సాహిత్య -సాంస్కృతిక - ఆధ్యాత్మిక సమ్మేళనంగా నిర్వహించబడింది.

## పూర్వరంగం

అవధాన విద్యా వ్యాప్తి కోసం, నూతన అవధానులను తయారు చేసి వారికి వేదిక కల్పించడం కోసం గడిచిన 5



సంవత్సరాల నుండి 'అవధాన విద్యావికాస పరిషత్' మరియు 'దర్శనమ్'సంస్థ సంయుక్తంగా ఏడురోజుల ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా, 2022లో మొట్టమొదటి శిబిరంలో అవధానంపై ఆసక్తితో విద్యార్థిగా విచ్చేసిన ఐఐటీ విద్యార్థి, ప్రతిభాశాలి శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్, అప్పటికే శ్రీ అన్నమరాజు ప్రభాకర్ రావు వద్ద పద్యరచనలో శిక్షణ పొంది ఉన్నారు. శ్రీ సాహిత్ శిబిరానికి వచ్చిన మూడవరోజే, పెద్దలు, గురువుల ప్రోత్సాహంతో తన ప్రతిభను చాటుతూ, శిబిరంలో అష్టావధానం చేసి పండితులచే శభాషనిపించుకొన్నారు.తదుపరి శతావధానులు శ్రీ ఆముదాల మురళి, శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ వంటి పండితుల వద్ద శిష్యరికం చేసి, అప్పటి నుండి ఇప్పటి వరకు 27 అష్టావధానాలు, 2 అర్ధశతావధానాలు పూర్తిచేసారు శ్రీ సాహిత్. ఇదే క్రమంలో, ఒక మెట్టు పైకెక్కుతూ, 2026 సెప్టెంబర్ 18, 19, 20 తేదీలలో 'అవధాన కళాకౌముది'శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ దర్శనమ్ సంస్థ నిర్వహణలో దిగ్విజయంగా శతావధానంచేసారు.

**మొదటి రోజు - ప్రారంభసభా సంరంభం**

శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ప్రథమ శతావధానం సభావేదిక 'కోలాచల మల్లినాథ వేదిక'పేరుతో ఉద్ఘాటించబడి, శ్రీ కొణకళ్ళ రాధాకృష్ణ శర్మ బృందం నామసంకీర్తన కార్యక్రమంతో మంగళప్రదంగా ఆరంభమైంది. ఆ తరువాత, శతావధానం ప్రారంభ సభకు అధ్యక్షులుగా 'మహామహోపాధ్యాయ' శతావధాని శ్రీ దోర్బల ప్రభాకర శర్మ



వ్యవహరించగా, ముఖ్య అతిథిగా భారతదేశ ప్రభుత్వ పూర్వ కేంద్రమంత్రి శ్రీ అశ్వినీకుమార్ చౌబే విచ్చేసి, ఈ రకమైన అవధాన కార్యక్రమాలు వికసిత భారతాన్ని, సనాతనధర్మాన్ని స్థాపించడానికి ఎంతో ఉపయోగపడతాయని, శతావధానం సాధారణపరీక్ష కాదని, అందుకు స్మరణశక్తి, కావ్యప్రతిభ, ఛందోజ్ఞానం, సద్యఃస్ఫూర్తి కలగలిసి ఉంటాయని తెలియజేస్తూ, నిర్వాహకులైన శ్రీ మరుమాముల వేంకటరమణ శర్మ, శ్రీ దత్తాత్రేశర్మలను అభినందించి, శతావధానం చేయబోతున్న అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ కు శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే, వేదికపై పుష్పగిరి జగద్గురు శ్రీశ్రీ శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి వారు ఆసీనులై, వేదమంత్రాలతో అవధానకళను అనుసంధానిస్తూ, కార్యక్రమానికి మంగళాశాసనాలను అందించారు. ఇక, ప్రారంభ సభకు విశిష్ట అతిథులుగా ప్రముఖ చలనచిత్రనటులు, దర్శకులు శ్రీ తనికెళ్ళ భరణి విచ్చేసి, తనకు అవధానం, పద్యం పట్ల ఉన్న ప్రేమాభిమానాలను తెలియజస్తూ శతావధానం దిగ్విజయంగా జరగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా 'అవధానవిద్యా వికాసపరిషత్తు' వ్యవస్థాపకులు శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ప్రస్థానాన్ని వివరించారు. అలాగే, తెలంగాణా పూర్వ ముఖ్యమంత్రికి ప్రజాసంబధాల అధికారి శ్రీ వనం జ్వాలా నరసింహారావు, పుష్పగిరి ఆస్థానపండితులు శ్రీ మేడూరి సూర్యనారాయణ, పుష్పగిరి ఆస్థానకవులు అవధానులు డా. ముత్యంపేట గౌరీశంకర శర్మ- శ్రీ ముదగొండ అమరనాథ శర్మ తదితరులు విచ్చేయగా, జ్యోతిఃప్రజ్వలన, గురువందనం ప్రార్థనతో, శ్రీ గంటి నగేష్ శర్మ చేసిన శంఖనాదంతో శతావధానం ఘనంగా ప్రారంభమైంది.

ప్రారంభసభలో భాగంగా శ్రీ వనం జ్వాలా నరసింహారావు రచించిన 'Simplified and Faithful Rendering of the Adikavya' అనే పుస్తకం, అలాగే ప్రముఖదర్శకులు, నటులు, శ్రీ నిట్టల గోపాలకృష్ణ రచించిన 'గోమాత'పుస్తకం మరియు శతావధాని డా. దోర్బల ప్రభాకర శర్మ రచించిన 'శ్రీపాద శ్రీవల్లభ లీలామృతం'పుస్తకం అతిథుల మధ్య అవిష్కరించబడ్డాయి.

ఆ తరువాత, అసలు శతావధానంలో మొదటి ఘట్టం ప్రారంభమైంది. 'కుదురాటగండ'శతావధాని డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అధ్యక్షులుగా వ్యవహరించగా, ఈ మూడురోజుల శతావాధనానికి శతావధాని శ్రీ ఆముదాల

మురళి సభాసంచాలకపీఠాన్ని చేపట్టి, శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ కృషిని, శ్రీ మరుమాముల సోదరుల పరిశ్రమను ప్రశంసిస్తూ, సమస్యాపూరణల ప్రశ్నలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మొట్టమొదటి సమస్యను సాక్షాత్తు జగద్గురువులు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి వారే అవధాని సాహిత్ కు సంధించారు. 'హంసను నెక్కి శంకరుడు హాయిగ నిల్చెను శారదాంబతో'అనే సమస్యను జగద్గురువులు ప్రసాదించగా, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ఏమాత్రం తడుముకోకుండా, 'సంసృతిఁ బాపఁగా ధరను శంకరుడే జనియించె మౌనియై' అని సందర్భోచితంగా ఆదిశంకరాచార్యుల ప్రస్తావనతో మొదటి పాదాన్ని పూరించారు. అలాగే, శ్రీ మాచవోలు శ్రీధరరావు 'రణము విస్మరించునెడ కల్గవు కీర్తియు గౌరవమ్ములున్'అని ఛందోగోపనంతో సమస్యను చిక్కుముడిగా ఇవ్వగా, అవధాని శ్రీ సాహిత్ 'అరదము డిగ్గి, గాండివము హా! యని వీడిన పాండుపుత్రునిన్'అని నాటీకయశైలిలో సమాధానం చెప్పడం అందరికీ ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది.

ఈ విధంగా మొదటిరోజు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు 25 సమస్యలను ప్రాశ్నికలు ఇవ్వగా, వాటన్నిటికీ మొదటి పాదాలను వేగంగా సమాధానంగా చెప్తూ, మరొకవైపు అవధానంలో అప్రస్తుత ప్రసంగాన్ని చేస్తున్న శ్రీ మావుడూరు సూర్యనారాయణ మూర్తి సంధించిన చమత్కార ప్రశ్నలకు దీటుగా జవాబులు చెప్తూ, సభను రంజింపజేస్తూ శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అందరి మెప్పులను పొందారు. అలాగే, ప్రత్యేకించి మాజీ కేంద్రమంత్రి శ్రీ అశ్వినీకుమార్ చౌబే అద్వైత వేదాంతం గురించి ఆశువుగా పద్యం చెప్పమని అడగగా, అవధాని శ్రీ సాహిత్ హిందీలో పద్యం చెప్పి తమ హిందీ పాండిత్యాన్ని కూడా చాటారు. అలాగే, శ్రీ తనికెళ్ల భరణి, ప్రధానమంత్రి గురించి పద్యం చెప్పమనగా, 'రాముని చూడకున్న రసరమ్యుని కృష్ణుని చూడకున్న ప్రధానమంత్రిని చూస్తే చాలని' చెప్పి మెప్పించారు. ఈ శతావధానానికి లేఖకురాలిగా శ్రీమతి ఆరవల్లి శ్రీదేవి వ్యవహరించారు. అలాగే, ప్రతిపద్యానికి సరసమైన వ్యాఖ్యానం చేస్తూ సంచాలకులుగా శతావధాని శ్రీఆముదాల మురళి సభను విజయవంతంగా ముందుకు నడిపించారు.

మరల మొదటిరోజు మధ్యాహ్నం 4:00 గం.కు తిరిగి మొదలైన శతావధానంలో, ప్రాచార్య శ్రీ శలాక రఘునాథ శర్మ అధ్యక్షులుగా విచ్చేసి, అవధాని శ్రీ సాహిత్ ను ఆశీర్వదిస్తూ, ప్రసంగం చేసారు. తదుపరి వెంటనే 25 దత్తపదులకు మొదటి పాదాలను అందిస్తూ, మధ్యమధ్యలో ఆశువు ప్రశ్నలకూ పద్యాలను చెప్తూ, వేగంగా ముందుకు సాగారు. ఈ సభలో శ్రీ ధనికొండ రవిప్రసాద్ అప్రస్తుత ప్రసంగం చేస్తూ, అవధానితో సరసల్లాపాన్ని చేసారు. తదుపరి గురుసహస్రావధాని డా. కడిమిళ్ళ వరప్రసాద్ అధ్యక్షతలో 25 వర్ణన ప్రశ్నలకు ఒక్కొక్క పాదాన్ని, కొన్నిటికి రెండు పాదాలను కూడా చెప్తూ, మత్తకోకిల, తరువోజ వంటి అరుదైన ఛందస్సులలో కూడా పద్యాలను, అంశాలను సరసంగా, సద్యఃస్ఫూర్తిగా అవధాని శ్రీ సాహిత్ వర్ణించగా, మొదటిరోజు శతావధనం దిగ్విజయంగా 75 ప్రశ్నలనూ తీసుకోవడంతో పూర్తయ్యింది.

తదుపరి, శ్రీ చింతలపాటి శూలపాణి బృందంచే పోతన భాగవతం ముఖ్యఘట్టాల నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది

## రెండవ రోజు - పద్యపూరణ రసప్రేరణ

ఇక, ఉత్సాహభరితంగా రెండవ రోజు, రాధాష్టమి పండుగకాగా, శతావధాన కార్యక్రమం శ్రీ మరుమాముల శశిధర శర్మ బృందంచే సంగీత నీరాజనంతో ఆధ్యాత్మికంగా మొదలైంది. తదుపరి, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్, సంచాలకులు శ్రీ ఆముదాల మురళి వేదికకు చేరుకోగా, ఈ రెండవ రోజు ఉదయం సభకు అధ్యక్షులుగా న్యాయవాది శ్రీ నారుమంచి అనంతకృష్ణ, విశిష్ట అతిథిగా గురుసహస్రావధాని డా. శ్రీ కడిమిళ్ళ వరప్రసాద్, శతావధాని డా. శ్రీ తాతా సందీప్



శర్మ పాల్గొన్నారు. ముందు రోజు సమస్యలను ఇచ్చిన ప్రాశ్నికులను శ్రీమతి ఆరవల్లి శ్రీదేవి వేదికపైకి ఆహ్వానించగా, అవధాని సాహిత్ మొట్టమొదటిగా మొదటిరోజు పుష్పగిరి జగద్గురువులు ఇచ్చిన సమస్యను పూరిస్తూ,

**'ఉ. సంస్కృతి బాపఁగా ధరను శంకరుడే జనియించె మౌనియై**
**హంసగ జ్ఞానకర్మముల యందున భక్తినిఁ జూపి, అద్వితా**
**శంసన చేసి, సోహమను స్థైర్యమునన్ కలి యంకమొందఁగా**
**హంసను నెక్కి శంకరుడు హాయిగ నిల్చెను శారదాంబతో'**

అని సమస్యలో ఉన్న శంకరుణ్ణి ఆదిశంకరాచార్యులుగా చెప్పి, పరమహంస పదవిని ఎక్కి, ఆ శారదాంబ ఒడిలో కూర్చున్నారు... అని అద్భుతంగా పూరించి, జగద్గురువుల అనుగ్రహానికి పాత్రులయ్యారు.

అలాగే, మరొక ప్రాశ్నికులు శ్రీ ముత్యంపేట గౌరీశంకర శర్మ మొదటిరోజు 'సారము లేనివాడు సరసంబుగ జేసె శతావధానమున్' అని ఇచ్చిన సమస్యకు, అవధాని సాహిత్ తాను 50 మందితో ముందు అవధానం చేయడంవలన అందరూ తనను 'స్వర్ణావధాని' అనే పేరుతో పిలుస్తారు కానీ, తన పేరులో అయఃసారము (ఉక్కు) లేదు అనే చమత్కార పూరితమైన భావంతో, సారము అనే పదాన్ని అయస్సారముగా మార్చి పూరించిన తీరుకు ప్రేక్షకులలో నవ్వుల జల్లులు కురిసాయి. అలాగే, కు. అయ్యల సోమయాజుల అహల ఇచ్చిన 'పరులను గని పాండుసుతుడు భయపడె ననిలో'అనే సమస్యకు 'ఎక్కడ ఎప్పుడు పరులను గని పాండుసుతుడు భయపడె?'అని సమాధానాన్ని ప్రశ్నాత్మకంగా మార్చి, అర్జునుడి వ్యక్తిత్వాన్ని రంగరించారు. అలాగే, మధ్యలో మరికొన్ని ఆశు వులనూ పూరిస్తూ, ఈ శతావధాన నిర్వాహకులూ, తమ సోదరులూ అయిన శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ - వేంకటరమణ శర్మల పరిశ్రమను గురించి ప్రాశ్నికులుగా వచ్చిన శ్రీ మరుమాముల శశిధర్ శర్మ పద్యం చెప్పమని అవధానిని అడగగా

**'కం. స్థిరధర్మరక్షణము నూపిరిగా, సాహిత్యరక్ష వెన్నెముక వలెన్**



**నిరతము కలిగి చెలంగెడిమరుమాముల**
**సోదరులను మరిమరి కొలుతున్'**

అంటూ, మరుమాముల సోదరులు ధర్మరక్షణే ఊపిరిగా, సాహిత్యరక్షణే వెన్నెముకగా కలిగి ఉన్నారని కొనియాడారు అవధాని. ఈ విధంగా, 25 సమస్యలలో ప్రతీదీ దేనికదే విలక్షణంగా, రసవంతంగా, చిక్కుముళ్లను విప్పుతూ, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ పండితుల ప్రశంసలనందుకున్నారు. అలాగే, ఈ ఉదయం సభకు అప్రస్తుతప్రసంగం చేస్తూ శ్రీ దండిభొట్ల దత్తాత్రేయ శర్మ సభలో హాస్యం పండించారు. తదుపరి, శ్రీమతి డా. అనంతలక్ష్మి రచించిన 'రాసేశ్వరి', 'శ్రీమద్రామాయణ ఉపాఖ్యానాలు - సార్వకాలికత' పుస్తకాలు శ్రీ పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి వారి చేతుల మీదుగా ఆవిష్కరింపబడ్డాయి.

ఆ తరువాత, రెండవరోజు సాయంత్రం సభకు అధ్యక్షులుగా 'శతావధానపంచానన' శ్రీ డా. జి.ఎమ్. రామశర్మ విచ్చేయగా, అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ముందురోజు ఒక్కొక్క పాదం మాత్రమే చెప్పిన 25 దత్తపదులకు పూర్తి పూరణలను అందించి విద్వాంసులను అలరించారు. ప్రాశ్నికలు ఇచ్చిన పదాలకు - అడిగిన అంశానికి ఏ మాత్రం పొంతన లేకపోయినా, ఆ చిక్కుముళ్ళను అవధాని తన ప్రతిభతో, భాషాపాండిత్యంతో పరిష్కరిస్తూ, రసరమ్యంగా, భావస్ఫోరకంగా పద్యం చెప్పడం పట్ల సభాసదులు హర్షం వ్యక్తం చేసారు. ఉదాహరణకు ?'కౌను, బనేగా, కరోడు, పతి'అనే నాలుగు పదాలతో 'దమయంతి సౌందర్యం'గురించి పద్యం చెప్పమని ప్రాశ్నికులైన శ్రీ మామిళ్ళ లోకనాథం అడుగగా,

**"ఉ. ఉన్నదె యంచు సందియము లొప్పఁగఁ జేసెడి 'కౌను'కల్గి, ఆ**
**వెన్నెల యు'బ్బ నేఁ గ'రము వేడ్కకు నాకరనంచు దాని భ్రాం**
**తిన్నిరసించు నా సుగుణదీధితి కల్గి నిశా'కరోడు'సం**
**పన్నిధి చూపులన్ వెలిగి వర్ధిలు నా దమయంతి భూ'పతీ'!"**

అని అవధాని వర్ణించిన తీరు అనన్యసామాన్యమని పండితులందరూ వేనోళ్ల కొనియాడారు. ఈవిధంగా 25 దత్తపదులకు కూడా అందరి ఆమోదంతంతో, సరససుందరంగా అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్ పద్యాలను పూరించి, మెప్పించారు. ఈ సాయంత్రం సభకు అప్రస్తుత ప్రసంగం చేస్తూ విఖ్యాత సంస్కృతాంధ్ర విద్వాంసులు శ్రీ రంగి సత్యనారాయణ సభలో నవ్వులు పూయించారు. ఈ విధంగా, మొదటి రోజు 25 సమస్యలను, 25 దత్తపదులను, 20 ఆశువులను కూడా పూర్తిగా అవధాని పూరించి, సభను దిగ్విజయం చేసారు. ఆ తరువాత,



ప్రసిద్ధ సంగీతవిదుషీమణి శ్రీమతి డా. ఎర్రమిల్లి రమాప్రభ బృందంచే భక్తిసంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది.

**మూడవ రోజు - అఖండధారణ, విజయోత్సవ విజృంభణ**

ఇక, అంగరంగ వైభవంగా సాగుతున్న శతావధానం చివరి రోజుకు చేరుకుంది. ఉదయం శ్రీ మరుమాముల శశిధర శర్మ బృందం భక్తి సంగీత సంగోష్ఠితో మంగళకరంగా ప్రారంభమైన శతావధానంలో అవధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ మొదటిరోజు కేవలం ఒకటి-రెండు పాదలు మాత్రమే చెప్పిన వర్ణనలను పూర్తిగా పూరించడం మొదలుపెట్టారు. ఈ సభకు అధ్యక్షులుగా విఖ్యాత సంస్కృత విద్వాంసులు ప్రాచార్య పిటిజివి రంగాచార్యులు విచ్చేసి, అవధానిని ఆశీర్వదించగా, విశిష్ట అతిథులుగా గురుసహస్రావధాని డా. కడిమిళ్ళ వరప్రసాద్, శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ విచ్చేసారు. ప్రాశ్నికులు అడిగిన అంశాలను వినూత్న కల్పనలతో సర్జనాత్మకంగా అవధాని పూరించిన తీరు ప్రశంసనీయమని వేదికపై అతిథులు కొనియాడారు. అవధానిని 'తెలుగు భాషా మాధుర్యాన్ని' గురించి ప్రాశ్నికురాలు శ్రీమతి మండపాక అరుణకుమారి చెప్పమంటే, “ఏ పలుకులలోని తీపిని రుచి చూడడానికి చెవులే నాలుకలుగా మారిపోతాయో, అలాంటి పలుకులు గల భాషే తెలుగుభాష.అటువంటి తెలుగుభాషలో తన గురించి కావ్యం రాయమని శ్రీకృష్ణదేవరాయలు కలలోకి సాక్షాత్తు విష్ణు-అవతారమైన శ్రీకాకుళ 'ఆంధ్ర మహావిష్ణువు'వచ్చి చెప్పాడు కాబట్టి, దేవుడే ఒక భాష పేరుతో వెలసిన పవిత్రభాషగా తెలుగు భాష విఖ్యాతి గాంచింది” అనే భావంతో నల్లాన్ చక్రవర్తుల సాహిత్ పద్యం చెప్పడం వర్ణనలలో మకుటాయమానంగా నిలిచింది.



అలాగే, తరువోజ అనే అరుదైన ఛందస్సులో నేటి కాలం గురుశిష్యుల సంబంధాన్ని చమత్కారంగా చెప్పి అవధాని మెప్పులు పొందారు. అలాగే, మిగిలిన ఆశువులను కూడా పూర్తి చూస్తూ, చివరి ఆశువులో ప్రాశ్నికురాలు శ్రీమతి వల్లీ సుబ్బలక్ష్మి అవధానికి ఇష్టదైవమైన హయగ్రీవ స్వామిపై పద్యం చెప్పమని ప్రాశ్నికులు అడగగా, 'ఏ స్వామి ఏలి ఈ ఏడేడు లోకాలు, అలసి నా మదిలోన ఆదమిరిచె'అని అవధాని చెప్పిన సీసపద్యం విని, ప్రేక్షకులు ఉప్పొంగి చప్పట్ల వర్షం కురిపించారు. అలాగే, తిరుపతి నుంచి విచ్చేసిన ప్రాశ్నికులు శ్రీ ఉప్పలధడియం రాజీవలోచన శర్మ “పుష్పగిరి జగద్గురుస్వామిపై” పద్యం చెప్పమని అడగగా, 'గురు-అనుగ్రహం ఒక రూపాన్ని పొందితే అదే పుష్పగిరి జగద్గురువుల రూపం' అని అద్భుతంగా వర్ణించారు. అలాగే, ఈ సభలో శ్రీ బంకుపల్లె రమేశ శర్మ అప్రస్తుత ప్రసంగం చేసి రంజింపజేసారు. ఈ విధంగా 100 పద్యాలను అద్భుతంగా పూరించి, అంతేకాక, మరొక మూడు ఆశువులను అదనంగా చెప్పి మొత్తం 103 అంశాలకు పూరణను విజయవంతంగా పూర్తి చేసారు అవధాని శ్రీ సాహిత్. ఈ సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు అధ్యక్షులు శ్రీ బసవరాజు శ్రీనివాస్ విచ్చేసి, అవధానిని సత్కరించారు.

ఆ తరువాత, మధ్యాహ్నం సభలో ప్రాశ్నికుల స్పందన కార్యక్రమం నిర్వహించబడింది. అష్టావధాని శ్రీ యర్రంశెట్టి ఉమామహేశ్వర రావు, అష్టావధాని శ్రీ బొర్రెల్లి హర్షల ఆధ్వర్యవంలో, వారు ప్రాశ్నికులను క్రమానుసారంగా ఆహ్వానిస్తూ ఉండగా, ప్రాశ్నికులు శతావధానం పట్ల తమ స్పందనను, ఆనందాన్ని పద్యాల రూపంలో వెలిబుచ్చారు.

ఇక, సాయంత్రం సరిగ్గా నాలుగు గంటలకు, ఈ శతావధానంలోని ప్రధానమైన చివరి ఘట్టం మొదలైంది. మూడు రోజులుగా అవధాని శ్రీ సాహిత్ తాను పూరించిన 25 సమస్యలను,25 దత్తపదులను,25 వర్ణనలను - మొత్తం కలిపి 75 పద్యాలను అప్పజెప్పాలి. ఈ ధారణా సభకు అధ్యక్షులుగా 'మధురభారతి' మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి పాల్గొనగా, విశిష్ట అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ పూర్వపు సలహాదారు డా. కె.వి. రమణాచార్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగ పూర్వ అధిపతి కె. అరవింద రావు, విఖ్యాత చలనచిత్ర నటులు, దర్శకులు తనికెళ్ళ భరణి విచ్చేయగా, శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ సభానిర్వహణ చేసారు.

ధారణసభలో అధ్యక్షులు శ్రీ మల్లాప్రగడ

శ్రీమన్నారాయణ మూర్తి, సంచాలకులు శతావధాని శ్రీ ఆముదాల మురళి, మూడు రోజులపాటు శతావధానం చేసిన అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్ వేదికను అధిష్ఠించారు. అవధాని సాహిత్ యోగస్థితిలో, ఏకాగ్రమైన మనస్సుతో వేదికపై కనిపించారు. ధారణసభ మొదలైంది. అతిరథమహారథు లందరూ వేదిక ముందు కూర్చొని చూస్తుండగా, శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి ఒక్కొక్క ప్రాశ్నికుని పేరు చదువుతూ ఉంటే, ఏ మాత్రం తడబడకుండా తాను మూడురోజులుగా చెప్పిన పద్యాలొక్కొక్కటీ రాగ యుక్తంగా, పొల్లుపోకుండా ధారణ చేస్తూ ఉన్నారు అవధాని శ్రీ సాహిత్. ధారణ మొదలైన పదినిమిషాలకే, సభకు ముఖ్య అతిథి అయిన పద్మశ్రీ పురస్కృతులు, మహాసహస్రావధాని బ్రహ్మశ్రీ డా. గరికిపాటి నరసింహారావు సభలోకి ప్రవేశించారు.వేదిక ముందే కూర్చొని, అవధాని శ్రీ సాహిత్ అద్భు తంగా ధారణ చేస్తున్న ప్రతిపద్యాన్ని విని పులకించి, కరతాళధ్వనులు చేసారు డా. గరికిపాటి. ప్రేక్షకులందరి మనస్సుల లోని ఆనందం, కళ్ళనుండి బాష్పాలుగా బయటికి వస్తూ ఉంటే, ఆ అవధానిని కన్న తల్లిదండ్రులూ సభలోనే కూర్చొని పుత్రోత్సాహాన్ని పొందారు. ఈ విధంగా, పరమాద్భుతంగా 75 పద్యాలను కేవలం 49 నిమిషాలలో అప్పజెప్పి, అవధానచరిత్రలో ఒక కొత్త శతావధానిగా పేరు గడించారు శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్. అలా ధారణ పూర్తయ్యిందో లేదో, సభలో కూర్చొని ఉన్న డా. గరికిపాటి, వేదిక ఎక్కి, తన కన్నకొడుకులాగా సాహిత్ ను ముద్దుపెట్టుకొని, కౌగిలించుకొని, ఆనందబాష్పాలతో అవధానిని అభినందించారు.



వెంటనే, విజయోత్సవ సభ ప్రారంభమైంది. శ్రీ పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యా శంకర భారతీ స్వామి వేదికపై ఆసీనులుకాగా, ముఖ్య అతిథి డా. గరికిపాటి నరసింహారావు, అలాగే విచ్చేసిన ఇతర అతిథులందరూ శతావధాని శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌కు ఘనసత్కారాన్ని కన్నుల పండుగగా గావించారు. సాక్షాత్తు జగద్గురువులు అవధాని తలపై కిరీటం పెట్టగా, అతిథులు, నిర్వాహకులు కలిసి శాలువా, పట్టు వస్త్రాలు, గజమాలలతో సత్కరించగా, శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ తాను రాసిన సన్మానపత్రాన్ని చదువగా, దాన్ని నిర్వాహకులు అవధానికి సమర్పిస్తూ 'శతావధాన కళాధర'అనే బిరుదుతో శతావధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌ను సన్మా నించారు. ఆ తరువాత, పద్మశ్రీ డా. గరికిపాటి నరసింహారావు మాట్లాడుతూ, శ్రీ సాహిత్ తనకు పుత్రసమానుడూ, శిష్యుడూ అని చెప్తూ, పంచను కట్టడంలో, వేషధారణలో గరికిపాటినే అనుసరిస్తున్నా డని చమత్కరించారు. అలాగే, శతావధాని శ్రీ సాహిత్ చెప్పిన పద్యాలలో భావుకత ఉందని, 22 ఏళ్ళకే ఇంత కవిత్వం చెప్పడం అసాధారణమని ప్రశంసిస్తూ, సభలోని వారంతా ఒక్కసారిగా ఆశ్చర్యంలో, ఆనందంలో మునిగి పోయేలా, డా. గరికిపాటి నరసింహారావు తన చేతి ఉంగరాన్ని తీసి శతావధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌కు తొడిగి, తనను మించిన అవధానిగా ఎదగాలని అభినందించారు. దాంతో, సభలో కరతాళధ్వనుల వర్షం కురిసింది. అదేవిధంగా, పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామివారు 'శతావధానకళాధర'అనే బిరుదును శ్రీ సాహిత్ కు ఇస్తున్నట్లు





మరొకమారు సభలో ప్రకటించి, తమ అనుగ్రహభాషణాన్ని అందించారు.

అలాగే, విశిష్ట అతిథులుగా వచ్చిన డా. కె.వి. రమణాచార్యులు మాట్లాడుతూ శతావధాని శ్రీ సాహిత్ చేయబోయే పదవ శతావధానాన్ని కూడా తాను చూసే శక్తి భగవంతుడివ్వాలని ఆకాంక్షించారు. అలాగే, మాజీ డీజీపి శ్రీ కె. అరవింద రావు మాట్లాడుతూ, అవధాని శ్రీ సాహిత్ సంస్కృతాంధ్రాలలో చాలా మాధుర్యంతో పద్యాలను చెప్పారని ప్రశంసించారు. అలాగే, శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ, అవధానికి సమయస్ఫూర్తి, వినమ్రత, పాండిత్యం అన్నీ ఉన్నాయని అభినందించారు. ప్రముఖ చలనచిత్ర నటులు శ్రీ తనికెళ్ళ భరణి మాట్లాడుతూ, నేటి తరంలో శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్, శ్రీ ఉప్పలధడియం భరత్ శర్మ వంటి యువకులు అవధానాన్ని ముందుకు తీసుకువెళుతున్నారని, మూడు రోజులూ శతావధాని శ్రీ ఆముదాల మురళి సంచాలకత్వం రమణీయంగా ఉందని,శ్రీ మావుడూరు సూర్యనారాయణ మూర్తి చేసిన అప్రస్తుతప్రసంగం చాలా బాగుందని తెలియజేసారు.



అలాగే, గురుసహస్రావధాని డా. శ్రీ కడిమిళ్ళ వరప్రసాద్ ప్రసంగిస్తూ, ఎన్ని భాషలలో అవధానప్రక్రియను చేసినా, తెలుగులోనే అవధానం స్థిరపడి రాణించిందని, అందుకు కారణం తెలుగుభాషలోని ఒదుగుదలే అని తెలియజేసారు. అలాగే, శతావధాని డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ప్రసంగిస్తూ, శతావధాని శ్రీ సాహిత్ తనకు ప్రియశిష్యుడు, పౌత్రసమానుడూ అని తెలియజేసారు. అలాగే, 'మధురభారతి' శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి, శతావధాని శ్రీ అయితగోని వెంకటేశ్వర్లు తమ పద్యాలతో శ్రీ సాహిత్ ను అభినందించారు. శ్రీ వనం జ్వాలా నరసింహారావు మాట్లాడుతూ, ఈ సంవత్సరమైనా నోబెల్ సాహిత్య పురస్కారం అవధాన రంగానికి రావాలని ఆకాంక్షించారు. అలాగే, శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ, అవధాన విద్యా వికాస పరిషత్తులో మొట్టమొదటి అవధానిగా ఎదిగిన విద్యార్థి నల్లాన్ చక్రవర్తుల సాహిత్తే అని, అందుకు తమకు ఎంతో గర్వ కారణంగా ఉందని తెలియజేసారు. ఈ సందర్భంగా, అవధాన విద్యా వికాస పరిషత్తు ప్రతి మాసం ప్రచురిస్తున్న 'అవధాన పుష్కరిణి' మాసపత్రికను వేదికపై అవిష్కరించారు. అలాగే, ఎఐటిఇకె సంస్థ వారు నిర్మించిన బ్రోచర్ ను ఉద్ఘాటన చేసారు.

ఇదే సందర్భంగా, శ్రీ పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి వారు అనుగ్రహభాషణం చేస్తూ, అవధానం కోసం ఇంతటి బృహత్తరమైన కృషిని చేస్తున్న శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మకు పుష్పగిరి పీఠం తరపున 'అవధాన కులపతి'అనే బిరుదును ఇచ్చి సన్మాన పత్రంతో సత్కరించారు, అలాగే, దర్శనమ్ సంస్థానిర్వాహకులు శ్రీ మరుమాముల వేంకటరమణ శర్మను ఆశీర్వదించారు.అదే విధంగా, శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ ధారణ సమయంలో కేవలం ప్రాశ్నికుని ముఖం చూడగానే, పద్యాన్ని గుర్తుకు తెచ్చుకోవడం చాలా గొప్ప విషయమని తెలియజేస్తూ, శతావధాన విజయోత్సవ సందర్భంగా జగద్గురువులు తమ మంగళాశాసనాలను అందించారు. ఆ తరువాత, జగద్గురువుల, అతిథుల సమక్షంలో, శతావధానంలో పాల్గొన్న ప్రాశ్నికులను నిర్వాహకులు ఘనంగా సత్కరించడంతో కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యింది.



ఈ విధంగా, దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక నిర్వహణలో, గణపతి నవరాత్రోత్సవాల వేళ, శ్రీ పుష్పగిరి జగద్గురు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి వారి చాతుర్మాస్య సందర్భంగా, భాగ్యనగరంలో, ఐటి నిపుణుడు శ్రీ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ శతావధానిగా విజృంభించి విజయం పొందిన ఈ ప్రథమశతావధానం అవధాన సాహిత్యచరిత్రలో ఒక గొప్ప అధ్యాయంగా చిరకాలం నిలుస్తుందని ప్రేక్షకులు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ■




దశాబ్దాల అనంతరం రాబోయే కీలక నామ (2028-29) సంవత్సరంలో అరుదుగా సంభవించనున్న క్షయమాసంపై ఉభయ తెలుగు రాష్ట్రాల ఆత్మీయుడు, ప్రముఖ ఆధ్యాత్మిక తత్త్వవేత్త, 'దర్శనమ్' మరుమాముల వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో ఆగస్ట్ 30న హైదరాబాద్ నగరంలో, తెలంగాణ విద్వత్సభ అపురూపమైన ప్రత్యేక విద్వద్గోష్ఠిని నిర్వహించింది. స్థానిక గాంధీనగర్‌లో, సీమాక్ సంస్థ యజమాని చెరువు రాంబాబు కార్యాలయంలో సుమారు నాలుగు గంటలపాటు జరిగిన ఈ గోష్ఠిలో ప్రముఖ పంచాంగకర్తలు, సిద్ధాంతులు, ధర్మశాస్త్ర పండితులు పాల్గొన్నారు. వారు చర్చలో సమర్పించిన ప్రసంగ వ్యాసాలు, ఈ అంశానికి సంబంధించి పరిశోధనకు అందనంత లోతైన విషయ పరిజ్ఞానమంటే అతిశయోక్తి కాదు.

క్షయమాసం ఏ విధంగా సంభవిస్తుంది, పంచాంగ గణితంలో దానిని ఎలా నిర్ధారించాలి, క్షయమాసంతో సంబంధం ఉన్న అధికమాసాలను ఎలా గణించాలి, ధర్మశాస్త్రపరంగా అనుసరించాల్సిన విధానాలు ఏమిటి అనే అంశాలపై వివిధ శాస్త్రగ్రంథాల ప్రమాణాలతో సుదీర్ఘంగా సిద్ధాంతులు చర్చించారు. గణితపరమైన పరిశీలనలు, సంక్రాంతుల స్థితి, చాంద్ర-సౌర మాస సమన్వయం తదితర అంశాలను విశ్లేషించిన అనంతరం రాబోయే కీలక నామ సంవత్సరంలో సంసర్ప కార్తిక మాసం అధికమాసంగా, మార్గశిర-పుష్య యుగళీభూత అంహస్పతి మాసం క్షయమాసంగా సంభవిస్తుందని సిద్ధాంతులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఈ విద్వద్గోష్ఠి విశ్లేషించి చూస్తే, యువ సిద్ధాంతులకు పంచాంగ గణితం, ధర్మశాస్త్ర ప్రమాణాలు, క్షయమాస నిర్ధారణపై లోతైన అవగాహన కలిగించిందని భావించాలి. అరుదైన క్షయమాస అంశంపై ప్రత్యేకంగా విద్వద్గోష్ఠి నిర్వహించి ఏకగ్రీవ నిర్ణయానికి రావడం విశేషం. భారతీయ కాలగణన కేవలం ఒక లౌకిక కాలనిర్ణయ పట్టిక కాదు. అది సూర్యచంద్రుల గమన చక్రాన్ని, ప్రకృతి ఋతువులను, మానవ ధర్మ జీవనాన్ని పరస్పరం అనుసంధానించే అత్యంత సూక్ష్మమైన శాస్త్రీయ వ్యవస్థ. విశ్వంలో నిరంతరం సంభవించే ఖగోళ మార్పులను క్రమబద్ధీకరించి, నిత్య నైమిత్తిక కర్మలకు అనుగుణంగా మార్చడంలో భారతీయ పంచాంగ గణితం అద్వితీయమైన పాత్రను పోషిస్తోంది.

సాధారణంగా చాంద్ర సౌర మానాల మధ్య ఏర్పడే వ్యత్యాసాన్ని సవరించడానికి 'అధికమాసం' పరిచయమైనప్పటికీ, అంతకంటే అత్యంత అరుదుగా, సూక్ష్మంగా సంభవించే కాలగణన ప్రక్రియే 'క్షయమాసం'.

ఇటీవల లభించిన పరిశోధనా పత్రాలు, శాస్త్ర గ్రంథాల

ఆధారంగా రానున్న 2028-2029 కీలక నామ సంవత్సరంలో అత్యంత అరుదైన పుష్య క్షయమాస పరిస్థితి ఏర్పడుతోందని సిద్ధాంతకర్తలు స్పష్టం చేస్తున్నారు. భారతీయ కాలగణన చంద్రసౌర పద్ధతిపై ఆధారపడి ఉంటుంది. సూర్యసిద్ధాంత యుగప్రమాణాల ప్రకారం ఒక సగటు సౌర సంవత్సరం 365.258756 రోజులు కాగా, పన్నెండు చాంద్రమాసాల మొత్తం 354.367055 రోజులు మాత్రమే ఉంటుంది. దీనివల్ల ప్రతి సంవత్సరం సౌర, చాంద్ర మానాల మధ్య సుమారు 10.891701 రోజుల వ్యత్యాసం పేరుకుపోతుంది. ఈ తేడా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకమారు సుమారు ఒక నెల కాలానికి చేరుకున్నప్పుడు, దానిని సవరించడానికి సంక్రాంతి లేని ‘అధికమాసం’ ఏర్పడుతుంది.

మరోవైపు, ఒకే చాంద్రమాసంలో (అనగా ఒక అమావాస్య నుండి తదుపరి అమావాస్య లోపల) సూర్యుడు రెండు రాశి సరిహద్దులను దాటితే, అంటే రెండు సంక్రాంతులు సంభవిస్తే దానిని ‘క్షయమాసం’ లేదా ‘ద్వి సంక్రాంతిమాసం’ అని పిలుస్తారు. సిద్ధాంత శిరోమణిలో భాస్కరాచార్యులు దీనిని స్పష్టంగా నిర్వచించారు. ఇక్కడ క్షయమంటే ముప్పై రోజులు కాలం నశించిపోవడం కాదు. ఒక చాంద్రమాస సంజ్ఞకు స్వతంత్ర అమావాస్య-అమావాస్య విభాగం లభించకపోవడమే మాసక్షయం. క్షయమాస భావన కేవలం తరువాతి కాలపు జ్యోతిష్య కల్పన కాదు, దీనికి బలమైన వైదిక పునాది ఉంది. తైత్తిరీయ సంహితలోని మంత్రం పదమూడవ మాస వ్యవస్థను, యజ్ఞవేదికపై దాని ప్రాధాన్యతను ప్రతిష్ఠించింది.

శాస్త్రవ్యాఖ్యాన సంప్రదాయం ప్రకారం, ఒకే సంవత్సరంలో రెండు అసంక్రాంత మాసాలు (సంక్రాంతి లేని నెలలు), మధ్యలో ఒక ద్విసంక్రాంత మాసం (రెండు సంక్రాంతులు ఉన్న నెల) వచ్చినప్పుడు వాటిని శాస్త్రీయంగా విభజిస్తారు. క్షయమాసానికి ముందు వచ్చే సంక్రాంతిరహిత మాసం




కాలక్రమంలో సక్రమంగా ముందుకు సాగుతుంది కనుక దీనిని ‘సంసర్పమని’ అంటారు. ఒకే చాంద్రమాసంలో రెండు సూర్య సంక్రమణలు జరిగిన ద్విసంక్రాంత క్షయమాసానికి ‘అంహస్పతి’ అని వేదసంజ్ఞ. క్షయమాసానికి తరువాత వచ్చే సంక్రాంతిరహిత మాసాన్ని ‘అధికమాసం’ అంటారు. మహాభారత విరాటపర్వంలో భీష్ముడు పాండవుల అజ్ఞాతవాస కాలనిర్ణయాన్ని లెక్కించే సందర్భంలో దీని ప్రస్తావన వున్నది. శ్రీమద్భాగవతం కూడా సూర్యుని మంద, శీఘ్ర, సమగతుల గురించి వివరిస్తూ ఈ ఖగోళ యాంత్రికతకు పునాది వేసింది

ఆధునిక ఖగోళశాస్త్రం, అలాగే, కెప్లర్ కక్ష్యాగతి నియమాల ప్రకారం భూమి సూర్యుని చుట్టూ దీర్ఘవృత్త కక్ష్యలో పరిభ్రమిస్తుంది. భూమి సూర్యుడికి అత్యంత సమీపంగా వచ్చే పెరిహీలియన్ స్థితిలో (సాధారణంగా జనవరి ప్రారంభంలో) కక్ష్యా వేగం పెరుగుతుంది. దీనివల్ల భూకేంద్ర దృష్టిలో సూర్యుడి దృశ్యగతి వేగవంతమై, శీతాకాలంలో (ధనుస్సు, మకర రాశులలో) సౌరమాసాల కాలవ్యవధి తగ్గుతుంది. క్షయమాసం సంభవించడానికి ప్రధానంగా మూడు భౌతిక పరిస్థితులు కలవాలని సిద్ధాంతులు చెప్తారు.

పెరిహీలియన్ వద్ద సూర్యుని గతి వేగంగా ఉండటం (చిన్న సౌరమాస కాలం). చంద్రుడు అపోజీ వద్ద ఉన్నప్పుడు గతి వేగం తగ్గి, అమావాస్యల మధ్య కాలం పెరగడం (పొడవైన చాంద్ర సంయోగమాసం). మొదటి అమావాస్య మొదటి సంక్రాంతికి కొద్దిగా ముందే, రెండవ అమావాస్య తదుపరి సంక్రాంతికి కొద్దిగా తర్వాతే సంభవించడం (సరిహద్దు సామీప్యం). ఈ మూడు పరిస్థితులు కలిసినప్పుడు, సూర్యుడు 60 డిగ్రీలు ప్రయాణించకపోయినా, కేవలం 30 డిగ్రీల కంటే కొద్దిగా ఎక్కువ ప్రయాణంలోనే రెండు రాశి సరిహద్దులను దాటడం వల్ల ఒకే చాంద్రమాసంలో రెండు సంక్రాంతులు నమోదవుతాయి.

ప్రముఖ సిద్ధాంతుల పరిశోధనల ప్రకారం, వివరణల ప్రకారం, రానున్న కీలక నామ సంవత్సరంలో సూర్యసిద్ధాంత గణిత రీత్యా అరుదైన క్షయమాసం ఏర్పడుతోంది. ఈ గణితాన్ని స్పష్టమైన విలువల ద్వారా నిరూపించారు. డిసెంబర్ 16, 2028 తేదీన ప్రథమ అమావాస్య సంయోగం జరిగినప్పుడు సూర్యుని స్ఫుట దీర్ఘాంశంగా వుంటుంది. అమావాస్య ముగిసిన వెంటనే సూర్యుడు దానిని దాటి ధనుస్సంక్రాంతి లోకి ప్రవేశిస్తాడు. తదుపరి అమావాస్య పూర్తికావడానికి ముందే సూర్యుడు

మరింత అధిగమించి మకరసంక్రాంతి పూర్తి చేస్తాడు. మరుసటి అమావాస్య సంయోగం జనవరి 14, 2029 తేదీన జరుగనున్నది.

ఈ విధంగా రెండు అమావాస్యల మధ్య సూర్యుడి మొత్తం ప్రయాణం కేవలం $30^{0}17'42.01''$ అయినప్పటికీ, ఆయన $240^{0}$, $270^{0}$ అనే రెండు రాశి సరిహద్దులను విజయవంతంగా దాటుతారు. ఒకే చాంద్రమాసంలో ధనుస్సు, మకర అనే రెండు సంక్రాంతులు సంభవించడం వల్ల మార్గశిర-పుష్య యుగళీభూత క్షయమాస పరిస్థితి ఏర్పడి, పుష్యమాసం క్షయమవుతోంది. ఆ వెంటనే సూర్యసిద్ధాంత నియమం ప్రకారం మార్చ్ 15, 2029 నుండి ఏప్రిల్ 14, 2029 మధ్య 'అధిక చైత్రమాసం' కూడా ఏర్పడుతోంది. సిద్ధాంత శిరోమణిలో క్షయమాసాల పునరావృత్తిని తెలపడానికి ప్రాచీన భూతసంఖ్యా పద్ధతిని ఉపయోగించారని సిద్ధాంతులు తెలియచేస్తున్నారు.

శాస్త్రం ఆధారంగా, సిద్ధాంతుల వివరణల ప్రకారం, 'కువేదేందు' అనగా 141 సంవత్సరాలు, 'గోకు' అనగా 19 సంవత్సరాల అంతరాలలో క్షయమాసాలు సంభవిస్తాయి. గతంలో 1963 (శోభకృత్), 1983 (దుందుభి) సంవత్సరాలలో 19 ఏళ్ల అంతరంలో పుష్య క్షయమాసం వచ్చిన విషయాన్ని వీరు విద్వత్సభలో గుర్తుచేశారు. సూర్యసిద్ధాంత దీర్ఘకాలిక పట్టికల ప్రకారం శక సంవత్సరాలు 1963, 1982, 2028, 2047 క్షయమాసాలుగా నమోదయ్యాయి. గ్రహగతుల అస్థిరత వల్ల దీనికి నిర్దిష్టమైన చక్రం లేదు, ప్రతిసారీ స్పష్టమైన పంచాంగ గణన ద్వారానే దీనిని నిర్ధారించాలి.

క్షయమాసం సంభవించినప్పుడు సమాజంలో కొన్ని తప్పుడు అపోహలు, భయాలు వ్యక్తమవడం సహజం. అయితే శాస్త్ర దృష్టిలో ఇది దోష సూచకం కానేకాదు అనేది సిద్ధాంతుల అభిప్రాయం. కాలగణనను సవరించే ఒక శాస్త్రీయ యంత్రాంగం మాత్రమే. ధర్మశాస్త్ర నిబంధనల ప్రకారం కొన్ని నియమాలను పాటించడం బహుశా మంచిదని మాత్రమే శాస్త్రం




చెప్తున్నది. ఈ విషయంలో ఎవరి ఇష్టాయిష్టాలు వారివే. జాతక బలం వుంటే అన్నీ సక్రమమే. వివాహాలు, ఉపనయనాలు, నూతన గృహప్రవేశాలు, యజ్ఞాలు, కొత్త వ్రతాల ప్రారంభం వంటి శుభకార్యాలను ఈ కాలంలో వర్జించడం, వీలైనంత మేరకు మంచిది. నిత్య సంధ్యావందనం, దేవతా పూజలు, జపాలు, పురాణ పారాయణాలు, దానాలు, నిత్య శ్రాద్ధ కర్మలు యథావిధిగా చేయడం ధర్మం.

క్షయమాసంలో జన్మించిన లేదా మరణించిన వారి జాతక, వర్ధంతి, ప్రత్యాబ్దిక శ్రాద్ధ కర్మల విషయంలో తిథిని రెండు భాగాలుగా విభజించి (పూర్వార్థం ఒక మాసం, ఉత్తరార్థం మరో మాసం) నిర్ణయించాలని శాస్త్ర ప్రమాణాలను ఉటంకిస్తూ సిద్ధాంతులు పేర్కొన్నారు. క్షయమాస ప్రక్రియ భారతీయ ఋషుల, ఖగోళ శాస్త్రవేత్తల మేధోసంపత్తికి నిలువెత్తు నిదర్శనం. వేల సంవత్సరాల క్రితమే సూర్యచంద్రుల సూక్ష్మగతులను లెక్కగట్టి, కాలాన్ని ధర్మంతో ముడిపెట్టిన మహోన్నత భారతీయ గణిత విధానం అత్యద్భుతమైనది. భారతీయుల అపారమైన మేధో సంపత్తికి ఇది నిలువెత్తు నిదర్శనం. క్షయమాసం కాలక్షయం కాదు. అది భారతీయ చంద్రసౌర కాలమాన ఖచ్చితత్వానికి ఒక మహత్తర చిహ్నం.

పంచాంగాలను లెక్కించడానికి వేర్వేరు ప్రాచీన పద్ధతులు ఉన్నాయి. వాటిలో సూర్యసిద్ధాంతం, భాస్కరాచార్యుల సిద్ధాంత శిరోమణి అత్యంత ముఖ్యమైనవి. ఈ రెండు గ్రంథాలు ఒకే నెలలో రెండు సంక్రాంతులు వస్తే 'క్షయమాసం' అనాలని ఒప్పుకున్నప్పటికీ, వాటిని లెక్కించే సూక్ష్మ పద్ధతుల్లో (గణితంలో) సూక్ష్మమైన తేడాలు చూపుతున్నాయి. సూర్యసిద్ధాంత నమూనా ప్రకారం గ్రహాల గమనాన్ని చాలా దీర్ఘకాలిక యుగ ప్రమాణాల ఆధారంగా లెక్కిస్తారు. సూర్యుడు, చంద్రుడు తమ కక్ష్యలలో తిరిగేటప్పుడు వాటి వేగంలో వచ్చే మార్పులను ఈ పద్ధతి చాలా స్థిరంగా లెక్కిస్తుంది. దీని ప్రకారం, వచ్చే క్షయమాసం పూర్తిగా సూర్యసిద్ధాంత గణితం ప్రకారం లెక్కించబడింది.

ఇక్కడ ఒకే నెలలో ధనుస్సు, మకర సంక్రాంతులు రావడం వల్ల పుష్యమాసం లెక్కలో లేకుండా పోయి, అది క్షయమాసంగా మారింది. ఇకపోతే, సిద్ధాంత శిరోమణి నమూనా ప్రకారం, భాస్కరాచార్యుల వారు కాలక్రమేణా ఆకాశంలో గ్రహాల స్థితిలో వచ్చే మార్పులను మరింత సూక్ష్మంగా గమనించి కొన్ని సవరణలు చేశారు. దీని ప్రకారం క్షయమాసాలు

సాధారణంగా 141 సంవత్సరాలకు ఒకసారి లేదా కొన్నిసార్లు 19 సంవత్సరాల అంతరంలో వస్తాయని చెప్పారు. 1963, 1983 లలో వచ్చిన క్షయమాసాలు దీనికి ఉదాహరణలు. సులభంగా చెప్పాలంటే, సంక్రాంతి లేదా అమావాస్య ఘడియలు ముగిసే సమయాల్లో కొన్ని నిమిషాలు లేదా సెకన్ల తేడా వస్తుంది. ఈ తేడా వల్ల ఒక పద్ధతిలో క్షయమాసంగా మారిన నెల, మరొక పద్ధతిలో సాధారణ నెలగా కనిపించే అవకాశం ఉంటుంది. అందుకే, ఆయా ప్రాంతాల సిద్ధాంతులు నిర్ణయించిన పంచాంగాన్నే ప్రజలు ప్రామాణికంగా తీసుకోవాలి.

డిసెంబర్ 16, 2028 నుండి జనవరి 14, 2029 మధ్య కాలం క్షయమాసం (పుష్య క్షయమై మార్గశిరంతో కలిసిపోయింది). దీనివల్ల ఈ రెండు నెలల్లో (మార్గశిర, పుష్య మాసాలు) పండుగలను ఎలా చేయాలో పంచాంగకర్తలు స్పష్టంగా నిర్ణయిస్తారు. సాధారణంగా మార్గశిర లేదా పుష్య మాసాల్లో వచ్చే ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) అద్భుతమైన పర్వదినాన్ని క్షయమాసంలో వచ్చే తిథి వ్యాప్తిని బట్టి జరుపుకోవాలి. రెండు మాసాలు కలిసిపోయినందున, వైకుంఠద్వార దర్శనం ఏ రోజున చేయాలో సిద్ధాంతులు నిర్ణయించిన తేదీనే భక్తులు అనుసరించాలి. డిసెంబర్ 16, 2028న ధనుస్సంక్రాంతి, జనవరి 14, 2029న మకరసంక్రాంతి ఒకే చాంద్రమాసంలో వచ్చేస్తాయి. కాబట్టి భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు యథావిధిగా జనవరి 14 పరిసరాల్లోనే వస్తాయి, కానీ ఆ నెలలో పుష్యమాసానికి విడిగా ప్రాధాన్యత ఉండదనేది సిద్ధాంతుల నిర్ణయం.

క్షయమాసం ముగిసిన కొద్ది రోజులకే అంటే మార్చి 15, 2029 నుండి ఏప్రిల్ 14 వరకు 'అధిక చైత్రమాసం' వస్తుంది. దీనివల్ల ఆ సంవత్సరం ఉగాది, శ్రీరామనవమి పండుగలు సాధారణ రోజుల కంటే ఒక నెల ఆలస్యంగా (నిజ చైత్రమాసంలో) వస్తాయి. అధిక చైత్రమాసంలో ఉగాది పచ్చడి తినడం కానీ, శ్రీరామ కల్యాణాలు చేయడం కానీ జరపకూడదని సిద్ధాంతులు అంటున్నారు. సామాన్యులు గందరగోళానికి గురికావాల్సిన, భయపడాల్సిన అవసరం లేదని, వీలుంటే, కొన్ని నియమాలు పాటిస్తే మంచిదని సిద్ధాంతుల సూచన.

క్షయమాసం అంటే నెల 'నాశనం' అయిపోవడం కాదు. ఇది కేవలం సూర్యుడు, చంద్రుల వేగాల వల్ల క్యాలెండర్‌లో జరిగే ఒక అరుదైన సర్దుబాటు మాత్రమే. కాబట్టి ఇళ్లలో ఎలాంటి అరిష్టాలు జరుగుతాయని భయపడాల్సిన పనిలేదు. ఇంట్లో చేసుకునే రోజువారీ పూజలు, దీపారాధనలు, ప్రతి శనివారం లేదా కార్తీక మాసాల్లో చేసుకునే నోములు, నిత్య ఉపవాసాలు యథావిధిగా చేసుకోవచ్చు. పెద్ద శుభకార్యాలు మాత్రం ఈ క్షయమాసం, అధికమాసం ఉన్న రోజుల్లో (అంటే డిసెంబర్ 2028 నుండి ఏప్రిల్ 2029) ఆపాలని సిద్ధాంతుల సలహా.

అలాగే, కుటుంబంలో ఎవరైనా గతంలో పుష్య మాసంలో కానీ లేదా మాఘ మాసంలో కానీ చనిపోయి ఉంటే, ఈ క్షయమాసంలో వారి తద్దినాలు (శ్రాద్ధ కర్మలు) ఏ రోజున పెట్టాలనేది సంబంధిత పురోహితులను అడిగి తెలుసుకోవాలి. తిథి యొక్క సగ భాగాన్ని బట్టి దీనిని నిర్ణయిస్తారు., ఏదేమైనా, మంచీ చెడులు ఎప్పటికప్పుడు తెలియచేసే సిద్ధాంతులు ఎప్పుడూ అందుబాటులో వుండే పవిత్ర కర్మభూమి మన భారతదేశం. అంతా మంచే జరుగుతుంది. సామాన్య ప్రజలకు కాలానుగుణంగా ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి మన పంచాంగకర్తలు ఇచ్చే సూచనలే మనందరికీ శ్రీసీతారామరక్ష.

ఈ విద్వద్గోష్ఠిలో బ్రహ్మశ్రీ ఆకెళ్ల జయకృష్ణశర్మ సిద్ధాంతి, యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, గాడిచర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి, చికిలి వెంకటేశ్వరశర్మ సిద్ధాంతి, శాస్త్రుల కృష్ణమూర్తిశర్మ సిద్ధాంతి, శంకరమంచి రామకృష్ణశర్మ సిద్ధాంతి, బోర్పట్ల భాస్కరాచార్యులు సిద్ధాంతి, ముక్రాల లక్ష్మణమూర్తి సిద్ధాంతి, బోర్పట్ల రాఘవేంద్రాచార్యులు సిద్ధాంతి, పెండ్యాల హనుమంతరావు సిద్ధాంతి, గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి, శంకరమంచి శివశర్మ సిద్ధాంతి, వడిగేచర్ల వెంకటరమణ సిద్ధాంతి, ఉప్పల ప్రసాదశర్మ సిద్ధాంతి, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ విద్వత్సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, కోశాధికారి, దర్శనమ్ సంపాదకులు మరుమాముల వెంకటరమణశర్మ పాల్గొన్నారు.






# తిరుమల చరితామృతం

152

(గత సంచిక తరువాయి)

ఆ సమయంలో ఘనపాఠులు, క్రమపాఠులు వేద పనసలు వల్లించడం, చివరగా వారిని సంభావనలతో సత్కరించడం జరుగుతుంది. అసలు వేదాలు ఏమిటి, వాటి సంరక్షణ అవసరం ఏమిటి, అవి సమాజానికి అవసరమా అన్న విషయాలలో చాలామందికి అవగాహన లేకపోవడమూ, రాను రాను వేద పండితులకు సమాజం నుంచి ఆదరణ తక్కువై సంభావనలకై ఎదురుచూసే దౌర్భాగ్యం కలగటమూ, ఈ వేదాలు - వల్లె వేసిన పండితుల బ్రతుకుతెరువుకు మాత్రమే అన్న భావన జనంలో నాటుకుపోవడానికి కారణమయ్యాయి.

◆◆◆

గతంలో విషయాల అవగాహన గల రాజులు, చక్రవర్తులు, సమాజంలోని ధనికులు, ఈ పండితులకు గ్రామాలు, భూములు, మడులు, మాన్యాలు ఇచ్చి, ఆర్థికంగా ఇంకే ఇతర వ్యాపకంలోకి వెళ్లే అవసరం లేకుండా వీరికి సమాజం తరపున ఏర్పాటు చేశారు. ఉదాహరణకు కాకతీయుల పాలనలో చూడండి. వేద పండితులను, శాస్త్ర పండితులను ఎంతో ఆదరించే ఈ రాజులు, దేశానికి మహమ్మదీయుల దాడితో ప్రమాదం వచ్చినప్పుడు ఈ పండితులందరినీ గోదావరిలో పడవలలో సప్తగోదావరీ ప్రాంతాలకు తరలించి, వారికి ఎన్నో అగ్రహారాలు ఇచ్చి, సంప్రదాయ రక్షణ చేసినందు వల్లనే, మన రాష్ట్రంలో వేదం నిలవడానికి ఆస్కారమయింది. తూర్పు గోదావరిలో అమలాపురం, రాజోలు ప్రాంతాలు ఆ రోజుల్లో తేలికగా చేరడానికి అనువైన ప్రదేశాలు కావు. దాడుల నుంచి సురక్షితం. అందుకే వేద రక్షణ, వేద పురుషుల రక్షణ ముఖ్య బాధ్యతగా గుర్తించిన రాజులు, ఈ పండితుల నందరినీ, గోదావరి డెల్టా ప్రాంతాలకు తరలించి రక్షించారు.



కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్

రాజులు పోయారు, జమీందార్లు పోయారు. వేయి సంవత్స రాల కాలంలో ఇతర మతస్తులు, పాలకులు చేయ లేనిది, స్వాతంత్ర్యం వచ్చాక మన ప్రజాపాలకులు, దీన్ని మతపరమైన అంశంగా పరిగణించి, శ్రద్ధ తీసుకోక పోవడంతో, ఆదరణ నశించి ఈ వేద శాస్త్ర విధివిధానాలు అధ్యయనానికి మాత్రం నియమితమై, ప్రజలతో ఉన్న సంబంధం క్షీణించడానికి దోహదకారి అయింది. అదేకాకుండా హిందూ ఆలయ పాలన కూడా దేవా దాయ చట్టం ద్వారా ప్రభుత్వ అధీనంలోకి రావడం... అంతగా అవగాహన లేని రాజకీయ నాయకులు, అధికారుల అధీనంలో, ఆలయాలకు ఆదాయమే ప్రధానం. యాత్రికుల సౌకర్యం మాత్రమే ముఖ్య ఆశయాలుగా నిలిచి వేదరక్షణ, సంప్రదాయ రక్షణ, హిందూ మత సంరక్షణ మతాంతరీకరణలు నిలుపుదల చేసే విషయాలపై, ఆలయ పాలకులకు నిర్దిష్టమైన బాధ్యత

ఉన్నదన్న స్పృహ కల్గించక పోవడంతో, ఈ వ్యవస్థకు పెద్ద దెబ్బ తగిలింది. అదే సమయంలో, ఈనాములు తీసివేయడం, దున్నేవాడిదే భూమి అని టెనెన్సీ విధానాలు రావడంతో, ఎంతో కాలంగా ఈనాములు, మాన్యాలపై ఆధారపడే ఈ వేద శాస్త్ర పండితులు నిరాధారులై వంశంలో సంప్రదాయంగా వస్తున్న వేదశాస్త్ర అధ్యయనాలు వదిలి ఇతర వ్యాపకాలపై బ్రతుకు తెరువుకు బయలుదేరే పరిస్థితి వచ్చింది. ఇంకా కొందరు ఈ వేదాన్ని శాస్త్రాన్ని నమ్ముకుని, వంశ సంప్రదాయం వదలలేని వారు, వేదసభలు, ఇతరులిచ్చే సంభావనల మీద బతికే దయనీయ స్థితి వచ్చింది.



1979లో నేను కార్యనిర్వహణాధికారిగా తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్నప్పటి పరిస్థితి అదీ. ఒకనాడు నాకు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాముల వారి నుంచి తమను కలవమని వర్తమానం వచ్చింది. అప్పుడు ఆయన సంచారంలో మహారాష్ట్రలోని సతారాలో ఉన్నారు. వెంటనే బయలు దేరి వారిని కలవడానికి వెళ్లాను. అప్పటికే వారు 40 రోజులుగా మౌనవ్రతంలో ఉండడం, అది ఇంకా 5 రోజులు కొనసాగాలన్నది వారి సంకల్పమైనా, అనుగ్రహం చేసి, నాతో దాదాపు 6 గంటలు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్విరామంగా చర్చించి చేసిన సూచనలు - ముఖ్యంగా వేద రక్షణ, శాస్త్ర రక్షణ, ధర్మ రక్షణ పైనే. ఆయన చేసిన సూచనల మేరకే తిరుమల తిరుపతి దేవస్థానాలలో నేను వేద రక్షణ పథకాలు, శాస్త్ర రక్షణ పథకాలు, హిందూ ధర్మ రక్షణ సంస్థ వంటివి ప్రారంభించడం జరిగింది. దక్షిణాది రాష్ట్రాలలోని వేద పండితులనందరినీ నియమించి, ప్రతి నెలా వారికి దేవస్థానం తరపున సంభావన లివ్వడం, దీనితో వారికి భుక్తికి లోపం లేకుండా శ్రీనివాసుని అనుగ్రహం కలిగించడం - ఇది వేద పారాయణ పథకంగా ప్రవేశపెట్టి, దాదాపు 378 మంది వేద పండితులకు వివిధ ఆలయాల్లో ప్రతిరోజూ 8 గంటల వేద పారాయణ లోకక్షేమం కోసం చేసే ఏర్పాట్లు చేశాం.

(సశేషం)

---

**5వ పేజీ తరువాయి... సంపాదకీయం...**

అర్చకులకు భద్రతా భరోసా కలగటం. ఇవన్నీ కూడా చట్ట పరిపాలనలో భాగమే. భద్రతతో పాటు వారి ఆర్థిక జీవితం కూడా చర్చకు రావాలి.

తెలంగాణలో Archaka & Other Employees Welfare Fund Trust ప్రస్తుతం వేలాది ఆలయాలు, అర్చకులు-ఉద్యోగులను తన పరిధిలో చూపుతూ గ్రాట్యుటీ, వైద్య సహాయం, విద్యా-గృహ రుణాలు వంటి పథకాలు నిర్వహిస్తోంది. అవి అవసరమైన చర్యలే. దేవాదాయశాఖ పరిధిలోని కొందరు అర్చక ఉద్యోగులకు సక్రమంగా వేతనాలు అందడం లేదు. దేవుడికి నైవేద్యం సమయానికి పెట్టాలని కోరే వ్యవస్థ- అర్చకుడి జీతాన్ని కూడా సమయానికి ఇవ్వాలి. సుప్రభాతం ఒక్కరోజు ఆలస్యమైతే ప్రశ్నించే వ్యవస్థ- అర్చకుడి కుటుంబం రెండు నెలలు వేతనం కోసం ఎదురుచూస్తే కూడా అంతే స్పందించాలి.

వేదపండితుడికి ఒకరోజు శాలువా కప్పడం గౌరవం కాదు. వృద్ధాప్యంలో అతను మందుల కోసం ఇతరుల సహాయం కోరాల్సిన అవసరం లేకుండా చూడటం గౌరవం. పురోహితుడి పాదాలకు నమస్కరించడం మాత్రమే సంస్కృతి కాదు. అతని శ్రమకు తగిన పారితోషికం ఇవ్వడం కూడా సంస్కృతే. అర్చకుడిని 'స్వామీ' అని పిలవడం మాత్రమే భక్తి కాదు. అతనిపై చేయి చేసుకోవడానికి ఎవరూ సాహసించని సామాజిక వాతావరణం కల్పించడం నిజమైన గౌరవం.

ఇది ఏ ఒక్క మతానికి వ్యతిరేకమైన చర్చ కాకూడదు. ఏ ఒక్క పార్టీపై ఆరోపణగా కూడా మారకూడదు. దాడి చేసే వ్యక్తికి మతం ఉండొచ్చు. రాజకీయ అభిప్రాయం ఉండొచ్చు. సంస్థ ఉండొచ్చు. కానీ నేరానికి మతపరమైన మినహాయింపు ఉండదు. చట్టం ముందు అందరూ సమానమే. అదే సూత్రంతో ధర్మసేవకుల భద్రత కూడా చూడాలి.

గోపురానికి రక్షణ ఉంది. హుండీకి రక్షణ ఉంది. దేవుడి ఆభరణాలకు రక్షణ ఉంది. మరి దేవుడికి నిత్యం పూజ చేసే అర్చకుడికి? ఈ ప్రశ్నకు ఇకనైనా స్పష్టమైన చట్టబద్ధ సమాధానం రావాలి. గర్భగుడిలో దీపం వెలిగించే చేయి భయంతో వణకకూడదు. లోకక్షేమం కోరుతూ వేదం పలికే గొంతు తన ప్రాణం గురించి భయపడకూడదు. అందరికీ అభయం కోరే అర్చకుడే అభయం కోసం వ్యవస్థ తలుపులు తట్టాల్సిన పరిస్థితి కొనసాగకూడదు. ధర్మాన్ని రక్షించేవారి రక్షణ కూడా రాష్ట్ర ధర్మమే. ఆ బాధ్యతను చట్టంలో ఎంత స్పష్టంగా, ఎంత సమర్థంగా ప్రతిష్ఠించాలన్న ప్రశ్నకు ఇక ఆలస్యం లేకుండా సమాధానం వెతకాల్సిన సమయం ఇది. ■

అరణ్య కాండ






'ఆంధ్ర వాల్మీకి'

**వాసుదాసస్వామి**

(వావిలికొలను సుబ్బారావు)

**విరచిత**

# 'మందర-మకరందం'

(గత సంచిక తరువాయి)

ప్రపంచమంతా భగవంతుడే అన్నప్పుడు, స్థూలంగా మనకు కనపడే ప్రకృతినీ, దానికి జీవభూతుండైన పురుషునీ, వీటిని శరీరంగాకల బ్రహ్మమును, మూడింటినీ ఒక్కటిగానే గ్రహించాలి. స్థూల శరీరం కనబడ్తుంది. సూక్ష్మమైన అంతర్యామి మనకు కనబడడం లేదు. వ్యష్ఠిగా భేద దృష్టితో చూస్తే, తత్త్వాలు మూడని చెప్పాల్సి వుంటుంది. సమిష్ఠిగా చూస్తే ఒక్కటనే చెప్పాలి. ఈ మూడు ఏ దశలోనూ వేరు కాదు. ఏది, ఏకాలంలో, ఏ అవస్థలో వేరుపడకుండా, నిత్యంగా-సత్యంగా అంటివుంటాయో, అది ఆ పదార్థంగానే చెప్పడం లోక వ్యవహారానుసారం. ఎండను చెప్పినప్పుడు సూర్యుడు లేనిదిగానూ, సూర్యుడిని చెప్పినప్పుడు ఎండలేనివానిగా గ్రహింపలేం. మూడు వేరని కూడా అనవచ్చు. ఒకటనికూడా అనవచ్చు. జీవుడు కడతేరే మార్గం లక్ష్మణ చర్య-కైంకర్యం వల్ల నేర్చుకోవాలి. ఇప్పుడు జీవుడైన లక్ష్మణుడు పరమాత్మ ఐన రామచంద్రమూర్తికి మధ్యలో సీత (ప్రకృతి) వున్నది. ఆమె తెర అడ్డం తీస్తేనేకాని రాముడు లక్ష్మణుడికి కనబడడు. వారిరువురికి సేవచేస్తేనే ఆ అడ్డం తొలగిపోతుంది. ఇది వారి అనుగ్రహంవల్ల రావాల్సిందేకాని మన ప్రయత్నం వల్ల సాధ్యమయ్యేది కాదు. ఇలా గ్రహించిన ఋషీశ్వరులు తమ సందేహాలను తీర్చుకున్నారు. ఈ ప్రణవార్థం పరమార్థ తత్త్వాన్ని వివరంగా చూపుతున్నది).

సారవంతమై, కొత్తగా వికసించే కమలాల-కలువల పరిమళాల గుమాయింపులతో ప్రకాశించే కొలకులను; నదీతీరాలలోని ఇసుక దిబ్బలలో తిరిగే అందమైన చక్రవాక దంపతుల సమూహాలను, కొండల్లో వున్న సుందర గుహల్లో పడుతున్న నీళ్ల పవిత్రమైన కొందవంకల ప్రవాహాలను, పూలతో అందమైన పొదల్లో గుంపులుగా ఝుంకారం చెసే తుమ్మెదలను, భయంకరమైన అడవి పందులను, పెను పాములను, అడవి దున్నపోతులను, ఏనుగుల సమూహాలను, సింహాలను, గుహల సమూహాలను చూసుకుంటూ పోయారు సీతారామలక్ష్మణులు. ఇవన్నీ చూస్తూ దూరంగా పోయి, సాయం సమయమైనందున, వేలాడేట్లున్న సూర్యబింబం కిరణాలతో ప్రాకాశిస్తున్న ఒక యోజనం సమంగా పాదవైన ఒక తటాకాన్ని చేరారు. ఆడుతుమ్మెదల గుంపులతో నల్లగా కనిపిస్తూ, తామరాకులతో, తామరపూలతో మనోహరంగా కనిపిస్తూ, హంసలతో, అవ్యక్త మధుర ధ్వనులతో వున్న ఆ తటాకం ఒడ్డునుంచి దాని తీరాన్ని చూసారు శ్రీరామలక్ష్మణులు.



అనువక్త-వాచవి

**వనం జ్వాలా నరసింహారావు**

## మాండకర్ణి వృత్తాంతాన్ని శ్రీరాముడికి తెలిపిన ధర్మభృతుడు

తమ వెంట వస్తున్న సదాచార సంపత్తికల ధర్మభృతుడు అనే

మునిని చూసి, శ్రీరామచంద్రుడు, మనుష్యులు లేకున్నా ధ్వనులొస్తున్న ఆ తటాకం వివరాలేంటి అని అడిగాడు. శ్రీరాముడు అడిగినదానికి సమాధానంగా ఆ తటాకం చరిత్రను ధర్మభృతుడు ఇలా చెప్పడం ప్రారంభించాడు."ధర్మాత్ముడా! విను. ఇక్కడ మాండకర్ణి అనే గొప్ప తపస్వి తన తపోబలంతో దీనిని కల్పించాడు. ఇది వానలు లేకున్నా ఎండిపోయేది కాదు. చూడడానికి మనోహరంగా వుంటుంది. ఈ తటాకం పేరు పంచాప్సరసం. ఈ నీళ్లలో నుండి అతడు ఆహారం లేకుండా పదివేల సంవత్సరాలు గాఢమైన తపస్సు చేశాడు. ఆ మాండకర్ణి కొన్నాళ్లు జలం, కొన్నాళ్లు గాలి, మాత్రమే ఆహారంగా తీసుకొని కఠిన తపస్సు చేశాడు. ధృఢచిత్తంతో ఆయన చేస్తున్న తపస్సు చూసితమ పదవులను కోరుతాడేమోనని, ఎవరికి స్థానభ్రంశం కలుగుతుందోనని భయపడి, అగ్ని మొదలైన దేవతలు గుంపుగా ఒకచోట చేరి, ఎలా అతడి తపస్సు చెరచాలా అని ఆలోచన చేశారు. అతడింకా కామాన్ని జయించలేదు కాబట్టి ఆదిశగా అతడి తపస్సు చెరచడానికి ప్రణాళిక వేశారు. ఐదుగురు అప్సరసలను ఆయన వద్దకు పంపారు దేవతలు, వారు ఆయన్ను వశపర్చుకున్నారు. శ్రేష్టుడైన ఆ ఋషి, ఆత్మ సాక్షాత్కారం, భగవత్ సాక్షాత్కారం కలిగినవాడైనప్పటికీ, కామాన్ని జయించనందున దేవతల కార్యం ఫలించేట్లయింది. తనను సమీపించిన ఆ స్త్రీలను తన భార్యలుగా చేసుకొని, ఈ నీటిలో ఒక ఇంటిని కట్టుకొని, ఆ స్త్రీలతో తన యోగబలంతో క్రీడిస్తున్నాడు. మహాత్మా! రామచంద్రా! ఇలా మునీశ్వరుడు ఆ స్త్రీలతో సంతోషంగా వున్నప్పుడు వారి ఆట-పాటల, భూషణాల ధ్వని చక్కగా వినపడేది".

ఆ ముని ఇలా చెప్పగా శ్రీరామచంద్రమూర్తి విని, ఆశ్చర్య పడి, తమ్ముడు లక్ష్మణుడితో, భార్య సీతతో కూడి బ్రాహ్మణ సమూహంతో నిండిన ఆశ్రమం చూసి, వారంతా తనను పూజి స్తుంటే, అక్కడ తిరుగుతూ, వారికి రాక్షస బాధ లేకుండా విల్లం బులు ధరించి, ఆశ్రమాలలో సంచరించాడు. ఒక్కో స్థలంలో కొన్ని-కొన్ని రోజులు, నెలలు, సంవత్సరాలు చొప్పున రామచంద్ర మూర్తి పదినెలలు అక్కడి ఆశ్రమాలలో గడిపాడు. ఆ తరువాత సుతీక్షణాశ్రమానికి పోయి అక్కడ ఆయన కోరికమేరకు కొంత కాలం వున్నాడు. ఇలా వున్నప్పుడు శ్రీరామచంద్రమూర్తి మునీశ్వరుడితో ఇలా అన్నాడు.

### అగస్త్యాశ్రమానికి పోవడానికి సుతీక్షణుడి అనుజ్ఞ తీసుకున్న శ్రీరాముడు

"మునీంద్రా! ఈ వనంలోనే అగస్త్య మునీశ్వరుడున్నాడని ప్రతిరోజూ అందరూ చెప్పుకుంటుంటే విన్నాం. కాని ఆయన వుండే ప్రదేశం నాకు తెలియదు. నేను నా భార్యతో, లక్ష్మణుడితో ఆయన్ను దర్శిమ్చుకోవాలని కోరిక వుంది. అక్కడికి పోయే మార్గం తెలియ చేయండి" అని శ్రీరామచంద్ర మూర్తి అడగ్గా, సుతీక్ష్ణుడు, తానే ఆ విషయం ఆయనకు చెప్పాలనుకున్నానని, కానీ ఈ లోపల ఆయనే అడిగాడని, అంటూ శ్రీరాముడిని అక్కడకు పొమ్మని చెప్తాడు. "ఇక్కడికి నాలుగు యోజనాలు దక్షిణానికి పోయి, అక్కడ నుండి మళ్లీ దక్షిణానికి నాలుగు యోజనాలు పో. అక్కడ ఒక రావి తోపుంది. అక్కడ తుమ్మెదల గుంపుతో అందంగా వికసిస్తున్న మడుగులు, పెద్ద చెట్లు, నీటి పక్షుల గుంపులు కనపడతాయి. అదే అగస్త్యుడి సోదరుడైన సుదర్శన ముని వుండే ఆశ్రమం. రాత్రికి అక్కడ వుండు. ఉదయంకాగానే బయల్దేరి దక్షిణంగా ఒక ఆమడ దూరం పో. అక్కడ అగస్త్యముని ఆశ్రమాన్ని కన్నుల పండుగగా చూడొచ్చు. అది అనేక వృక్షాలతో, కూడి, గొప్పవైన వనప్రదేశంగా అందంగా కనిపిస్తుమ్ది. అక్కడ సీతాలక్ష్మణులతో నువ్వు సుఖంగా వుండవచ్చు" అని చెప్తాడు.

సుతీక్ష్ణ మహాముని చెప్పిన తోవ పట్టుకుని, అడవిలో ముగ్గురూ బయల్దేరి పోతూ, మార్గమధ్యంలో అందమైన వంకలను, సంతోషకరంగా వున్న సరస్సులను చూశారు వారు. ఇవన్నీ చూసి, రామచంద్రుడు మనస్సు సంతోషంతో పొంగిపోగా, లక్ష్మణుడితో ఇలా అన్నాడు: "లక్ష్మణా! మనకు సుతీక్ష్ణుడు చెప్పిన గుర్తులు ఇక్కడ కనిపిస్తున్నాయి. అగస్త్య సోదరుడి ఆశ్రమం ఇదే. మనోహరంగా, సంతోషకరంగా వుందిది. దీన్ని చూడు. లక్ష్మణా! చూడు. పళ్ల, పూల, మొగ్గల బరువు వల్ల చెట్లకొమ్మలు నేలనంటుతున్నాయి. పండిన రావిపళ్ల వగరు వాసనలు వాయుదేవుడు తెస్తున్నాడు. అక్కడక్కడా అగ్నిహోత్రాల కోసం చీల్చివేయబడిన కట్టెపుల్లల రాసులు కూడా వున్నాయి. దర్భలు నేలమీద పడి వున్నాయి. నల్లని మేఘాల లాగా అగ్నిహోత్రుడి పొగ కొనలు కనబడుతున్నాయి. అగస్త్యుడి తమ్ముడి ఆశ్రమమని మనం దేన్ని గురించి విన్నామో అది నిశ్చయంగా ఇదే. ఇక్కడున్న సుదర్శనుడు లోకాలను ఏలేందుకు ఎవరైతే రాక్షసులను చంపి, ప్రజలు దక్షిణంగా వుండేట్లు చేశాడో అతడి తమ్ముడే.

### లక్ష్మణుడికి వాతాపి ఇల్వలుల చరిత్ర చెప్పిన శ్రీరాముడు

పూర్వం ఒకప్పుడు వాతాపి, ఇల్వలుడు అనే సోదరులు బ్రాహ్మణ వేషం వేసి బ్రాహ్మణులను చంపుతుండేవారు. ఇల్వలుడు బ్రాహ్మణ వేషం వేసుకుని, బ్రాహ్మణుల దగ్గరకు పోయి, ఆ రోజున తన ఇంట్లో శ్రాద్ధం వుందనీ, నిమంత్రణకు రమ్మనీ, సంస్కృత భాషలో పిలుస్తాడు. (సశేషం)

# అద్వితీయ అద్వయానంద భారతీ స్వామి

ఆర్షవిద్యా వాచస్పతి, శ్రీవిద్యారత్నాకర, సర్వతంత్ర స్వతంత్ర బ్రహ్మశ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు ఆంధ్ర పాఠకలోకానికి, ప్రముఖంగా ఆధ్యాత్మిక సాహిత్యాభిమానులకు, విద్వజ్జన లోకానికి సుపరిచితులే. వీరు ఆంధ్ర,ఆంగ్ల, సంస్కృత భాషలలో అనేక రచనలు చేసి సాహితీ మూర్ధన్యుడుగా పేరు గాంచిన వారు. యోగ మంత్ర తంత్ర, వేదాంత, దార్శనిక శ్రీవిద్యాది బహు శాస్త్ర నిష్ణాతులు. కవిగా, నవలారచయితగా, మంత్రశాస్త్ర వేత్తగా, సంస్కృత విద్వాంసుడుగా, సాహిత్య విమర్శకుడుగా, వ్యాఖ్యాతగా, రామలింగేశ్వరరావు స్థానము అద్వితీయమైనది.

రావుగారు శృంగేరీ శారదాపీఠ జగద్గురువులు శ్రీ చంద్రశేఖర భారతీమహాస్వామి, శ్రీమదభినవ విద్యాతీర్థమహాస్వామి, శ్రీ భారతీతీర్థ మహాస్వామి గురుత్రయం విశేష కృపకు పాత్రులైన వారు. శ్రీ చంద్రశేఖర భారతీ మహాస్వామివారి అనుగ్రహంతో శ్రీవిద్యయందు పాదుకాంతదీక్ష పొంది 'సదాశివానందనాథ' నామంతో పూర్ణ దీక్షితులయ్యారు. అయితే ఈ పేరు లోకానికంతగా తెలియదు. మన సనాతన సంప్రదాయం చెప్తున్న ముఖ్యమైన దశలగు "అధీతి, బోధ, ఆచరణ, ప్రచారణలలో కృతకృత్యులయిన ధన్యజీవి.



**జీవన రేఖలు**

వీరు 1921, ఫిబ్రవరి 7న జ్వాలాపతి, మహాలక్ష్మమ్మ దంపతులకు నాల్గవ సంతానంగా, ప్రథమ పుత్రుడిగా జన్మించారు. జన్మస్థలమైన గుడివాడలో బాల్యం, హైస్కూలు విద్య జరిగింది. అనంతరం రాజమహేంద్రి లోని ప్రభుత్వ కళాశాలలో బి.ఎస్.సి పూర్తి చేశారు. 1942లో రామలింగేశ్వరరావుకి తేలప్రోలు వాస్తవ్యులు గుడిపాటి వెంకట గోపాలకృష్ణ శర్మ, సీతారామమ్మ దంపతుల జ్యేష్ఠ పుత్రిక విశాలాక్షితో వివాహం జరిగింది. రామలింగేశ్వరరావు, విశాలాక్షి దంపతులకు ముగ్గురు కుమార్తెలు- ఉమాదేవి, జానకీ దేవి, లక్ష్మీ సావిత్రి. ఒకే కుమారుడు - జ్వాలా ప్రకాశ విద్యాపతి. 1942 నుంచి పదేళ్లు పశ్చిమ గోదావరిజిల్లాలో ప్రభుత్వ రెవెన్యూ శాఖలో అకౌంటెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. పలుకు దారుణాఖండల శస్త్ర తుల్యం, మనసు నవ్య నవనీత సమం అన్నట్టు ముక్కుసూటి మనిషి, కొండొకచో తీవ్రవచస్వి కావటాన ప్రభుత్వ ఉద్యోగంలో ఇమడటం కష్టమే కదా. ఆ రోజుల్లో వారు ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షునిగా కూడా పని చేస్తున్నపుడు ఉద్యోగపరమైన చిక్కుల వల్ల రాజీనామా చేశారు. తర్వాత ప్రయివేట్ ఉద్యోగాలు చేసి, అవీ వద్దనుకుని 1961 నుండి మద్రాసులో స్థిరపడి తన ప్రవృత్తికి అనుకూలమైన సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలలో విశేష కృషి చేశారు.

**రచనలు, సందేశము**

రామలింగేశ్వర రావు సాధకుడు, తత్త్వవేత్త, కవిశేఖరుడు, సమాజ పరిశీలకుడు- ఈ నేపథ్యంలో శతాధికంగా ఉత్కృష్ట రచనలు వెలయించి, సనాతన ధర్మోద్ధరణకు పాటుపడిన సంస్కర్త. ప్రగాఢ మంత్రశాస్త్ర పరిజ్ఞానము, ధార్మికాభినివేశము, చారిత్రక సమన్వయము, కలబోసిన అరుదైన బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ అద్వయానంద భారతీ స్వామి. వశ్య వాక్కు, శబ్దప్రభుత గల కవి కలం నుంచి జాలువారిన వచనం కూడా రసరమ్య గీతంలా ఉంటుందనటానికి రావుగారి రచనలే సాక్ష్యం. అక్షరాల అక్షయ పథాలలో జీవన ప్రస్థానం సాగిస్తూ, ఆర్ష ధర్మమూ, సంప్రదాయాల సముద్ధరణకై సాహిత్య శరసంధానం చేసిన కర్మ వీరుడీయన!

స్థూలంగా వీరి సాహిత్యం- 1) మంత్రశాస్త్రం, 2) కవిత్వము 3) సామాజిక చారిత్రిక నవలలు వంటి సృజనాత్మకసాహిత్యం 4) వైదిక వ్యాఖ్యాన గ్రంథాలు 5) ఆంగ్ల రచనలు 6) అనువాదాలు 7) ఇతరములు అంటే - సాహిత్య విమర్శ , చిన్న కథలు (బాల సాహిత్యం) కరువు నివారణ వంటి వ్యాసాలూ కలిపి, సప్త శాఖా స్రోతస్విని గా చెప్పవచ్చు.

మంత్ర శాస్త్రం : శ్రీ చక్రవిలసనము, శ్రీ చక్రపూజా విధానం, సౌందర్యలహరి, శ్రీలలితా సహస్రనామ స్తోత్ర భాష్యం, శ్రీలలితా త్రిశతినామ భాష్యానువాదము,శ్రీ శంకర భగవత్పాద గ్రంథమాల

వ్యాఖ్యానగ్రంథాలు : దశశ్లోకి, ఏకశ్లోకి, దక్షిణామూర్తి స్తోత్రం, ఆత్మబోధ మున్నగు స్తోత్రాలకు, మంత్రపుష్పం, ఆదిత్యహృదయం, లలితా, విష్ణు సహస్రనామాలు, మొదలైన వైదిక గ్రంథాలకు వ్రాసిన వ్యాఖ్యానములు.

దార్శనిక గ్రంథాలు: మనము-మన మతము, శబ్ద నిత్యత్వవాదము, భారతీయ దర్శన ప్రపంచం, వేదాంత న్యాయములు జీవన్ముక్తుడు, వంటి దార్శనిక గ్రంథాలు,

సామాజిక, చారిత్రక నవలలు: ధర్మనిర్ణయం,

తిక్కనసోమయాజి, పోతనా మాత్యులు, తాళ్ళపాక అన్నమాచార్యులు, మాకు మిగిలింది, మీనాక్షి పెళ్లిచేసుకుంది, సుబ్బయ్య కొడుకులు, ఇది ఎప్పుడూ ఇంతే, కొల్లం అండు.

కవిత్వము, పద్య కావ్యాలు: శివానుగ్రహం - పితృయజ్ఞం, హస్యగా ధాద్విశతిప్రేయోనువాకం, గోదావరి గర్భం/అగ్నిష్టోమం. వీరి కవిత్వం శిల్ప రమణీయ కల్పనలతో అలరారుతుంది.

రామలింగేశ్వరరావు సాహిత్య విమర్శలు, మన భూగర్భ జల సంపద, మన కరవులు- నివారణ చర్యలు లాంటి విలక్షణ విషయాల మీద వ్యాసాలు.

ఇవి గాక Sringeri revisited, Sri Sureswaraachaarya, Rationale of Mantra sastra వంటి ఆంగ్ల గ్రంథాలు, బ్రహ్మ విద్యా వ్యాఖ్యాన సింహాసనం, కాలడి, శ్రీ కంచి కామాక్షి దేవి, శ్రీశంకరాచార్యవిజయము వంటి అనువాద గ్రంథాలు, గ్రంథ పరిచయాలు, ముందుమాటలు, సంపాదకీయాలు, పిల్లల కోసం చిన్న కథలు, రేడియో ప్రసంగాలూ ఉన్నాయి.



శ్రీ స్వామివారి సాహితీ వరివస్యలో శ్రీ శంకరకృప మాసపత్రికకు 20 సం.లు సంపాదకత్వం వహించి విజయవంతంగా నిర్వహించటం పేర్కొనదగినది.

సత్కారాలు: ఆయనకు ఆర్ష విద్యా వాచస్పతి,శ్రీ విద్యారత్నాకర, సర్వతంత్ర స్వతంత్ర అనే గౌరవాలు లభించాయి.1974 లోమద్రాసులోసత్కార కమిటీ, 1979లోకళాభారతిమద్రాసువారి సత్కారాలు లభించాయి. 1980లో శ్రీ యార్లగడ్డ రాజ్యలక్ష్మి వెంకన్న చౌదరి కళాపీఠం అవార్డుతో సత్కరించారు. 1981 లో మద్రాసులో జరిగిన షష్ట్యబ్ది పూర్తిసందర్భంగాఘన సత్కారం జరిగింది.

1989లో స్వామివారు మొదటి చాతుర్మాస్య వ్రతదీక్షను పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో సన్మానం జరిపి శ్రీ అద్వయానంద భారతి స్వామి 'ప్రస్తుతి మాలా' అని ఒక ప్రత్యేక సంచిక విడుదల చేశారు.

ఎలాంటి ప్రచార ప్రాభవాలూ లేకుండా కేవలం స్వయం ప్రతిభతో తమ కార్యక్రమాన్ని, కర్తవ్యాన్ని నిర్వహించుకున్న స్థితప్రజ్ఞులు. వీరి రచనలు కొన్ని విదేశాల్లో పాఠ్యగ్రంథాలుగా నిర్ణయింపబడ్డాయంటే వాటి విలువ ప్రామాణికత, అర్థమవుతుంది. "గూఢంబగు గాఢ భావనకు శబ్దాకృతిన్ గూర్చితిన్"- అని వారే ఒకచోట చెప్పుకున్నట్లు నిగూఢ తాత్త్విక విషయాలను మాధుర్యప్రసాద గుణభరితంగా సరళమైన భాషలో అందించిన సాహిత్యకళా తపస్విద్దులు శ్రీ అద్వయానందభారతీ స్వామివారు.

వీరి రచనల నవలోకించిన కాటూరి, విశ్వనాథ, కాశీకృష్ణాచార్యులు, దివాకర్ల, సిద్ధేశ్వరానంద భారతి, వేలూరి శివరామ శాస్త్రి వంటి ఉద్దండ పండితులు ప్రశంసలు కురిపించారు- అనటం కంటే ఆమోదించి అభినందించకుండా ఉండలేని పరిస్థితి వాళ్లది.

ఇంతటి ప్రజ్ఞాశాలి అయినా మరుగునపడిన మాణిక్యంలానే ఉండిపోయారు బహుకాలం. ఇందుకు ఒక ప్రబల నిదర్శనం- ఆంధ్ర సాహిత్య అకాడెమి వంటి సంస్థల నిరాదరణ. ప్రముఖ రచయితగా నవలాకారునిగా అకాడెమీ రికార్డుల్లో ఉన్నప్పటికీ ఏ కార్యక్రమానికీ ఆహ్వానం వచ్చేది కాదట.

"కవీనాం కవితైవయోగః" అన్న క్షేమేంద్రుని అభియుక్తికి తార్కాణంగా నిలచిన వారు శ్రీ స్వామివారు. కవులకు తాము రాసే కవిత్వమే అత్యున్నతమైన యోగ సాధన అన్నట్టు, ఆ సాధనే ధ్యానమై, తపస్సై మానసిక లయను సాధించిన కవియోగి. ఈ సర్వసంగ పరిత్యాగికి ఒక కోరిక ఉన్నదట.. అది-

**"మరియును కర్మశేషమున మానవ జన్మము కల్గెనేని శం**
**కరగురు రాజమౌళి పరికల్పిత శృంగ నగస్థ శారదా**
**చరణ సరోజ పీఠమున సర్వమహః పరిలీన మూర్తియై**
**పరగు జగద్గురున్ గొలుచు భాగ్యము నాకు నొసంగు మీశ్వరా."**

1986లో రావుగారు తమ సతీమణి స్వర్గస్థురాలయిన తరువాత తమ 1988లో శ్రీ శృంగేరీ జగద్గురువులు శ్రీమదభినవ విద్యాతీర్థ మహాస్వామివారి సన్నిధిలో సన్యాసాశ్రమ స్వీకారం చేసి 'అద్వయానందభారతి' అను యోగపట్టాన్ని పొంది, ఆ నామంతో ప్రసిదులయ్యారు. సన్యాసాశ్రమ స్వీకారానంతరం కూడ స్వామివారు ఇతోధికంగా రచనలు చేసారు. తరువాతి కాలంలో శృంగేరీలోను, హైదరాబాదు- నల్లకుంటలోనున్న శంకర మఠంలోను, నివసించారు. సికిందరాబాద్ మల్కాజగిరి, ఆనందబాగ్‌లో నున్న కనకరాజు గారి తోటగా పిలువబడే 'అద్వయానంద తపోవనం'లో చివరి రోజులు గడిచాయి. అక్కడే 1991, అక్టోబరు 16 (ప్రజోత్పత్తి నామ సం. ఆశ్వయుజ శు.అష్టమి) స్వామివారు సిద్ధిపొందారు. స్వామివారి భౌతికకాయాన్ని వారి అభీష్టానుసారం కృష్ణానదీ జలాలలో విజయవాడ ప్రకాశం బ్యారేజ్ సమీపాన జలసమాధి చేశారు. పెంజీకటి కవ్వలి వెలు గును పవిత్ర కృష్ణా నదీ గర్భంలో వెతుక్కుంటూ మహా ప్రస్తానం చేశారు స్వామి.

**జయంతి తే సుకృతినః రససిద్ధాః కవీశ్వరాః ।**
**నాస్తి యేషాం యశఃకాయే జరామరణజం భయం ॥** అంటారే అలాగ అద్వైత రససిద్ధి పొంది, తన రచనల రూపంలో చిరంజీవియై నిలచినవారు శ్రీ అద్వయానంద భారతీ స్వామి.

**- ప్రసాదవర్మ కామబుుషి**




(గత సంచిక తరువాయి)

అప్పుడు నరసింహశాస్త్రిగారే తల్లిని ఒప్పించుటకు ముందుకు వచ్చిరి. పూర్వము శ్రీ శంకరులు కూడ తమకు తమ తల్లిని సన్న్యాసాశ్రమమున కనుజ్ఞ యిమ్మని వేడుకొని యున్నారు గదా! ఇప్పుడు శ్రీ నరసింహశాస్త్రి గారు కూడ సన్న్యాసాశ్రమ స్వీకారమున కనుజ్ఞ యిమ్మని తమ తల్లిగారి కత్యంత దైన్యముతో విన్నవించుకొనిరి. గృహస్థులగుటకు తమ కెంతమాత్రము ఇష్టము లేదని విస్పష్టముగా తెలియజేసిరి. సన్న్యాసమున కవకాశ మీయ కున్నచో తరువాత తామెట్లును సన్న్యాసము స్వీకరింతుమనియు అప్పుడు కంటికి గూడ కనిపింపకుండ నెక్కడెక్కడనో దూరదూర దేశములకు వెళ్లి పోవుదుమనియు తెలియజేసిరి. ఆ విధముగా నయినచో ముఖావలోకనమునకు గూడ అవకాశము లేక పోవును. ఇప్పుడు సన్న్యాసమునకనుజ్ఞ ఇచ్చినచో శృంగేరియందే ఎక్కువ కాలముండవచ్చును గాన అప్పుడప్పుడు చూచుట కైనను వీలుండుననియు తెలిపిరి.

ఇట్టి దిట్టతనముతో కుమారు డిదివర కెన్నడను మాటలాడనే లేదు. వాని మాటలు విని తల్లిదండ్రులు ఆశ్చర్యపడిరి. ఎన్నడు తలయెత్తి మాటలాడనివాడు, తల్లిదండ్రుల మాట కెన్నడు నెదురు చెప్పనివాడు. ఈ దినమున నింత నిష్కర్షగా తాను సన్న్యాసి అయిపోవుదునని చెప్పుచున్నాడు. తండ్రి తన కుమారుని ముఖమువంక నొకమారు చూచెను. అపూర్వమైన తేజస్సు ఆ లలాటమునందు ప్రస్ఫుటమగుచున్నది.

ఆ నేత్రయుగ్మమున ప్రజ్వరిల్లుచున్నది. ఏదో మహాశక్తి ప్రకాశించుచున్నట్లు ఆయనకు కనిపిం చినది. శాస్త్రిగారు అత్యంత దృఢమన స్కులై మృదువైన వాణితో తమ పత్ని నుద్దేశించి "లక్ష్మీ! నృసింహునకు మనః పూర్వకముగ నీ యనుజ్ఞనిమ్ము" అని పలికిరి. ఆ వాణియందు ఒక విధమైన ఆజ్ఞ యున్నది. ప్రీతి యున్నది.

ఆ తల్లి యోచించినది. కుమారునకు మొదటినుండియు పారమార్థిక విషయము నందే ఆసక్తి. తాను గృహస్థుడగుట అసంభవమని చెప్పినది నిర్ధారణమే. ఇప్పుడు సన్న్యాసమున కనుమతి యిచ్చుట వలన నాతడు శృంగేరియందే యుండును గాన అప్పుడప్పుడు దర్శింప వచ్చును. మాతృహృదయము కొంచెమైనను తనియవచ్చును. అతడు తమ్ము వీడి సన్న్యాసియై కంటికి కానరాకుండా దూరమగు దానికంటె ఇది ఉత్తమము కదా! ఈవిధముగా నాలోచించిన లక్ష్మమ్మగూడ తన పుత్రుని త్యాగ మొనర్చినది. అనుజ్ఞ యిచ్చిన తల్లికి నరసింహశాస్త్రిగారు సాష్టాంగ నమస్కార మొనర్చిరి. అట్లే తండ్రిగారికి ప్రణామమాచరించిరి. వారి ఋణానుబంధమప్పుడే విడిచి పోయినది.

ఇంటిలో మాతాపితరుల అనుజ్ఞను పొందిన నరసింహశాస్త్రి గారిని కుణిగల్ రామశాస్త్రి గారు అప్పుడు బెంగుళూరునందే నివసించియున్న మహారాజులు నాల్గవ కృష్ణరాజ ఒడయరు వారి యొద్దకు తీసికొనివెళ్లిరి. ప్రభువులు శ్రీ నరసింహశాస్త్రిగారిని ఆదర గౌరవములతో స్వాగతించిరి. తమకు మొదటనే వచ్చిన శ్రీ జగద్గురువుల శ్రీముఖమును శ్రీ నరసింహశాస్త్రి గారికి చూపించిరి. శ్రీ జగద్గురువుల ఆజ్ఞానుసారము సన్న్యాసము స్వీకరించుటకు శ్రీ నృసింహశాస్త్రి గారికి సమ్మతమేనా యని యడిగిరి. తాము ఆశ్రమ స్వీకారమునకు మొదటనే నిశ్చయించుకొన్నామనియు, గురువర్యుల యాజ్ఞ తమకు శిరోధార్యమనియు

శాస్త్రిగారు నుడివిరి. ఆ మాటకు మహారాజులు హర్షము నందిరి. దీనిని బట్టియె శ్రీ నరసింహశాస్త్రి గారు సాధారణులు కారనియు గ్రహించిరి. నమ్రతతో నమస్కరించి శ్రీ నరసింహశాస్త్రిగారిని వీడ్కొలిపిరి.

ఆ దినమే శ్రీ నరసింహశాస్త్రిగారు కుణిగల్ రామశాస్త్రిగారితో శృంగేరికి ప్రయాణమయిరి. శ్రీ గురువర్యుల ఆజ్ఞను శిరసా వహించుటయే వారి లక్ష్యము. మరునాడు శ్రీ గోపాలశాస్త్రిగారు తమ ధర్మపత్ని శ్రీమతి లక్ష్మమ్మతో శృంగేరికి బయలుదేరిరి. తమ ఏక పుత్రుడైన శ్రీ నృసింహశాస్త్రి లౌకిక బంధనముల నన్నింటిని త్రెంపివైచి సన్న్యా సమును స్వీకరించి వ్యాఖ్యాన సింహాసనారోహణ మొన ర్చుటను చూచుటయే వారి లక్ష్యము. వారి వారి లక్ష్యము లెట్లు నెరవేరనున్నవో దైవమునకు తెలియును.

**13**

ఇటు తమ ఉత్తరాధాకారి శృంగేరికి రాక ముందే, అతనికి తాము సన్న్యాదీక్ష ఈయక ముందే శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ స్వామివారు పరీధావి సంవత్సర చైత్రశుద్ధ విదియనాడు (1912) విదేహకైవల్యము నందిరి. మహాతపస్వులు, యోగిశ్రేష్ఠులు, అపరోక్షజ్ఞానులు నయిన జగద్గురువుల నిర్యాణము వలన అత్యంత దుఃఖముతో దేశమునకు దేశమే పరితపించినది. అజాతశత్రువులు, సర్వ భూత కరుణాశాలులు, దర్శనమాత్రముననే జనుల సంతాపములను అణచివైచిన మహానుభావులునయిన గురువర్యుల వియోగమెల్ల వారికి నత్యంత దుస్సహమైనది. మఠమునకు దక్షిణభాగము నందున్న గురువర్యులే నిర్మించుకొన్న నృసింహ వనమునందే ఆ మహనీయుల కళేబరమును సమాధి నొనర్చిరి.




అటు త్వరితగతి ప్రయాణ మొనర్చి శృంగేరికి చేరుకొనిన శ్రీ నృసింహశాస్త్రిగారు జగద్గురువులు బ్రహ్మీభూతులైనారన్న వార్తను విని పిడుగుపడినట్లయి కుప్పకూలిపోయిరి. తమ బాల్యము నుండియు నాశీర్వదించి అనుగ్రహించినవారు, అడుగడుగునకు తమ్ము అభ్యుదయమార్గమున నడిపించినవారు. కట్టకడకు తాము మనస్సునందే చాలకాలమునకు పూర్వమే నిర్ధారణ చేసికొన్న పారిమార్థిక మార్గమునందే నడువవలెనని తమకు మహదాజ్ఞ నొసగి శృంగేరీ గురు పీఠమునకు తమ్ము నియమించి శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ స్వామి వారి సంస్మరణమునందే శ్రీ నృసింహశాస్త్రిగారు చాల సమయము మునిగియుండిరి. వారి మనస్సు సమాధానస్థితికి వచ్చుటకు కొంత సమయము పట్టినది.

శ్రీ గురువర్యుల ఆరాధన మొదలైన ఉత్తరక్రియలన్నియు సాంగముగా నెరవేరినవి. ఈ మధ్యలో శ్రీకంఠశాస్త్రి గారు మైసూరునకు పోయి ప్రభువర్యులను మరొకమారు చూచి జగద్గురువుల నిర్యాణమును, శ్రీవారి అంత్యేచ్ఛను వివరించిరి. ఇంతకుముందే శ్రీ జగద్గురువుల నుండి శ్రీమన్మహారాజులకు తమ ఉత్తరాధికారి కావలసినవారు శ్రీ నరసింహ శాస్త్రిగారే యని స్పష్టాభిప్రాయమును తెలుపు శ్రీముఖ మొకటి వచ్చియుండినది. సదా గురుభక్తి నిరతులైయున్న రాజర్షి కృష్ణరాజ ఒడయరు గురువర్యుల ఆజ్ఞను పాలించుటయే తమ కందరకు శ్రేయస్కరమనియు, శ్రీ నృసింహశాస్త్రి గారికి ఆశ్రమదీక్ష ఇప్పించి గుర్వాజ్ఞను నెరవేర్చవలెననియు తెలిపి కొత్త గురువులకు తమ గౌరవోపాయనములను భక్తి పురస్సరముగా పంపించిరి.

ఇక్కడ శృంగేరిలో ఒకప్రక్క శ్రీ నృసింహ భారతీస్వామివారి ఆరాధనాది కార్యకలాపములు జరుగుచుండగనే మరొకప్రక్క నూతన గురువుల ఆశ్రమ స్వీకారమునకు, పట్టాభిషేకమునకు సమస్త సన్నాహములు జరుగుచుండినవి. దేశమున నన్నిదిక్కుల నుండి భక్త,శిష్య గురుకార్యశ్రద్ధాపరుల ప్రవాహమవిచ్ఛిన్నముగా శృంగేరికి ప్రవహించినది. ప్రయాణమునందలి అసౌకర్యములు, దారితెన్నుల అవ్యవస్థ వాహనముల మిత సౌలభ్యము మొదలగు వానిని లక్ష్యపెట్టక దొరికిన వాహనముల యందే క్రిక్కిరిసి కూర్చుండి జనులు తండోపతండముగా శృంగేరికి వచ్చుచుండిరి. మఠమునకు చెందిన వారును, ప్రభుత్వాధికారి వర్గము వారును అత్యంత జాగరూకతతో దక్షతతో జనులకు భోజనాది సర్వసౌకర్యములు కలిగించుటలో నిమగ్నులైరి. మహారాజుల వారి ప్రతినిధిగా దివాన్ వి.పి. మాధవరాయలును, ఇతర రాజ్యాధికారులును వచ్చి యుండిరి.

"సర్వజ్ఞం శ్రీ నృసింహం కురు శివదయితే" అని ఎవరి విషయమున గురువులు జగన్మాతను ప్రార్థించియుండిరో ఆ పుణ్యచరుతులైన నృసింహశాస్త్రిగారు శృంగేరికి వచ్చినప్పటి నుండియు తాము నియమితులై యున్న మహాపీఠమునకు తమ్ము యోగ్యుల నొనర్పుమని, మహాకార్య నిర్వహణకు తమ్ము శక్తిమంతుల నొనర్పుమని, ఎల్లప్పుడు తమకు మార్గదర్శన మొనర్చుచు ననుగ్రహించుచుండుమని జగదంబను ప్రార్థించుచుండిరి. (సశేషం)

- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ




(గత సంచిక తరువాయి)

**13. కేశాంతము :-** పదహారేళ్ళ వయసొచ్చాక మొట్టమొదటి సారి గడ్డం చేసుకోవడానికి సంబంధించిన సంస్కారం. ఈ సంస్కారం చేసేటప్పుడు చివర్లో విద్యార్థి తన గురువుకు ఒక ఆవును దానంగా ఇవ్వటం వలన ఈ సంస్కారాన్ని గోదానమని కూడా అంటారు.

**14. సమావర్తనము :-** వేదాధ్యయనం ముగించుకొని, గృహస్థాశ్రమ స్వీకారం కోసం తిరిగి వెళ్లేటప్పుడు గురువు సమక్షంలో జరిపే వేడుక/ క్రతువు.

**15. వివాహం :-** విశిష్టం వహనం వరవధ్వోః వర-వధువులను పరస్పరంగా గ్రహించుటను వివాహమంటారు.

**16. అంత్యేష్టి :-** అంత్యక్రియ. మృత దేహాన్ని చితిపై ఉంచి మంత్రోక్తంగా దహనం చేయడం.

(ఆంగ్ల మూలములో శ్లోకాన్ని పేర్కొన్నారు కాని వివరణ లేదు. స్పష్టత కొరకు ఒక్కొక్క సంస్కారాన్ని వివరించాను. - అనువాదకుడు)

◆◆◆

## అధ్యాయం 2

శ్రాద్ధము : మృత్యువు సమీపించిన సమ యంలో కనిపించే దేహాన్ని విడిచిపెట్టిన జీవునికి, ఈ ప్రపంచంలో నివసించే వారు సహాయం చేయడానికి చేసే ఆచారకర్మము పేరు శ్రాద్ధము. కనిపించే శరీరములో చైతన్యం లేని జీవాన్ని ప్రేత (= మరణించిన వాడు) అని పిలుస్తారు. ఈ దశలో చనిపోయినవానికి సహాయం చేయడానికి శ్రద్ధతోచేసే విధిని ప్రేతక్రియ (= శ్రాద్ధం) అంటారు.

కనిపించే శరీరాన్ని (అన్నమయ కోశము) శ్మశానానికి తీసుకువెళతారు. అక్కడ అది వీలైనంత త్వరగా దానికి సంబంధించిన ప్రకృతి భాగాలలో కరిగిపోతుంది; కాలిన శరీరపు బూడిదను మూడవ రోజున ఒకచోట చేర్చి, ప్రవహించే నీటిలో - సాధారణంగా పవిత్రమైన ప్రవాహంలో - కలుపుతారు.

అన్నమయకోశం (=శరీరం) నాశనమైనప్పుడు, ప్రాణమయ కోశం (=పంచ ప్రాణాలు) వేగంగా చెదిరిపోతుంది. దహన సమయంలో ఉపయోగించే కొన్ని మంత్రాల ద్వారా ఈ వ్యాప్తి వేగవంతమవుతుంది. మృతదేహాన్ని నాశనం చేయడానికి దహనం (=కాల్చుట) ఉత్తమ మార్గం. ఈ దహనక్రియ వెళ్లిపోయిన జీవునికి, భూమిపై మిగిలిపోయిన వారికి ముఖ్యమైనది. శరీరం దహనం కానంత కాలం, ప్రాణమయ కోశం తమ మధ్య ఉన్న అయస్కాంత ఆకర్షణ ఫలితంగా జీవుని నిర్జీవ శరీరం చుట్టూ తిరుగుతుంటుంది. అందువలన జీవుడు భూమితో సంబంధం తెంచుకు పోలేకపోతాడు. అలా కావటం ఆ జీవునికి హాని కలిగిస్తుంది. మరోవైపు, చనిపోయిన శరీరాన్ని దహనం చేయకపోతే శరీరం క్షీణిస్తుంది. పూడ్చి పెట్టిన పద్ధతిలో

ఈ నిర్జీవ శరీరం ప్రకృతిలోకి విష వాయువులను పంపుతుంది. ఇది లోకంలో జీవించి ఉన్నవారికి హాని కలిగిస్తుంది.

దహనం తర్వాత చేసే శ్రాద్ధ కర్మలు -పాక్షికంగా ఉపయోగించిన వస్తువుల అయస్కాంత ప్రభావాల ద్వారా మరియు పాక్షికంగా మంత్రాల ద్వారా ఏర్పాటు చేయబడిన కంపనాల ద్వారా- మనోమయకోశానికి (=జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు, పంచ ప్రాణాలు, మనస్సు, బుద్ధి కలసి పదిహేడు అంగాలతో కూడిన సూక్ష్మ శరీరాన్ని మనోమయకోశమంటారు) సంబంధించిన పదార్థాల పునర్వ్యవస్థీకరణలో సహాయపడతాయి. ఒక నిర్దిష్ట సమయం తరువాత, చనిపోయిన జీవుని కొరకు సపిండీకరణ కార్యక్రమం (=పిండాలు పెట్టే శ్రాద్ధ కార్యక్రమం) నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం జీవుడు ప్రేతలోకం నుండి పితృలోకానికి వెళ్ళడానికి సహాయపడుతుంది. ఆపైన జీవుడు పితృదేవతలలో ఒకడిగా భువర్లోకంలోని సూక్ష్మ ప్రాం తాలలో నివసించే పూర్వీకుల మధ్య నమోదు చేయబడతాడు. భూర్లోకంలో ఒకటి, మరియు భువర్లోకంలో ఆరుగా ఉన్న ఏడు తరాలు ఒకదానికొకటి ప్రభావితం చేస్తాయి. జీవుడు స్వర్గానికి వెళ్ళి నప్పుడు, అతనికి శ్రాద్ధ కార్యక్రమానికి సంబంధించిన సహాయం అవసరం లేదు.

**దేశే కాలే చ పాత్రే చ శ్రద్ధయా విధినా చ యత్ ।**
**పితనుద్దిశ్య విప్రేభ్యో దానం శ్రాద్ధముదాహృతమ్ ॥1**

"పితృదేవతలకు ప్రయోజనం చేకూర్చడం కోసం, తగిన సమయాలలో, తగిన ప్రదేశాలలో విశ్వాసంతో అర్హులైన బ్రాహ్మణులకు దానాలు ఇవ్వడాన్ని శ్రాద్ధమని పిలుస్తారు."


SANÂTANA DHARMA
AN ELEMENTARY TEXT-BOOK
OF
HINDU RELIGION AND ETHICS
PUBLISHED BY THE BOARD OF TRUSTEES
CENTRAL HINDU COLLEGE
BENARES
1916
[THE RIGHT OF TRANSLATION AND REPRODUCTION IS RESERVED.]
Price Ans. 12, boards. Re. 1, cloth. Postage 1½ Anna.

**కుర్యాదహరహః శ్రాద్ధమన్నాద్యేనోదకేన చ ।**
**పయోమూలఫలైర్వాపి పితృభ్యః ప్రీతిమావహన్ ॥2**

గృహస్థుడు ప్రతిరోజూ పితృదేవతలకు సంతృప్తి కలగటానికి అన్నాదులచే, ఉదక దానముచే, పాలు, దుంపలు, పండ్లు దానం చేస్తూ శ్రాద్ధాన్ని ఆచరించాలి.

**పంచభ్య ఏవ మాత్రాభ్యః ప్రేత్య దుష్కృతినాం నృణామ్ ।**
**శరీరం యాతనార్థీయమన్యదుత్పద్యతే ధ్రువమ్ ।**
**తేనానుభూయ తా యామీః శరీరేణేహ యాతనాః ।**
**తాస్వేవ భూతమాత్రాసు ప్రలీయన్తే విభాగశః ।**
**యద్యాచరతి ధర్మే స ప్రాయశో-ధర్మమల్పశః ।**
**తైరేవ చావృతో భూతైః స్వర్గే సుఖముపాశ్నుతే ॥3**

దేహి యాతనాశరీరంతో శబ్దస్పర్శాది విషయానుభవం వల్ల కలిగిన యమ బాధలనన్నీ అనుభవించి నరకానుభవం వల్ల పాపాలు పోగొట్టుకొని పంచ భూతములను తిరిగి పొందుచున్నాడు.


తాడేపల్లి పతంజలి

పాపం చేసేమానవులు నరకంలోని సమస్తబాధలనుభవించుటకై జరాయుజాది దేహవ్యతిరిక్తమైన( గర్భస్థ పిండమునకు రక్షకముగా మీద క్రమ్ముకొనియుండు తోలుసంచిని మావి లేదా జరాయువు అంటారు). యాతనా శరీరం (= పాపాలకు శిక్షించబడటానికి మరణం తర్వాత జీవాత్మకు కలిగే శరీరం). పరలోకంలో పంచభూతాల వల్లనే కలుగుచున్నది.

ఆ జీవుడు భూలోకంలో ధర్మాన్ని అధికంగా అధర్మాన్ని తక్కువగా ఆచరించి ఉంటే, స్థూలశరీరరూపంలో పరిణమించిన పంచ భూతాలతో కలిసి స్వర్గసుఖాన్ని అనుభవిస్తున్నాడు.

**చితామోక్షప్రభృతి చ ప్రేతత్వముపజాయతే ॥4**

"దహన సంస్కారాలు పూర్తయిన తర్వాత (జీవుడు) ప్రేతగా (=పీనుగుగా) మారతాడు.

**వర్షే యావత్ ఖగశ్రేష్ఠ! మార్గే గచ్ఛతి మానవః ।**
**తతః పితృగణైః సార్ధం పితృలోకం స గచ్ఛతి ।**
**దత్తైః షోడశభిః శ్రాద్ధైః పితృభిః సహ మోదతే**
**పితుః పుత్రేణ కర్తవ్యం సపిండీకరణం సదా ॥5**

"ఓ శ్రేష్ఠమైన పక్షీ! జీవుడు ఒక సంవత్సరం పాటు ప్రేతలోక మార్గంలో ఉంటాడు; తర్వాత అతను పితృలోకంలో ప్రవేశించి పితృదేవతలలో కలుస్తాడు.

"పదహారు శ్రాద్ధాలు చేయుట ద్వారా జీవుడు పితృదేవతలతో ఆనందంగా నివసించడానికి భూలోకంలోని కుమారాదులు సహాయం చేస్తారు. అందువల్ల కొడుకు తండ్రికి సపిండీకరణము తప్పక చేయాలి."

(సశేషం)






**ఆధ్యాత్మికతను అక్షరార్చనగా, ధర్మాన్ని జీవనసాధనగా, భక్తిని సాహిత్య సౌరభంగా మలచిన మహనీయ విద్వత్కవి బ్రహ్మశ్రీ అప్పాల విశ్వనాథ శర్మ. సరళ సుందరమైన తెలుగు నుడికారంలో వేదాంత గాంభీర్యాన్ని, భక్తి మాధుర్యాన్ని, అద్వైత తత్త్వసారాన్ని సమన్వయించిన ఆయన రచనలు ఆధ్యాత్మిక సాహిత్యలోకంలో అమూల్య రత్నాలు. ముఖ్యంగా 'పాండురంగ శతకము'లో శ్రీమద్భాగవతాన్ని తలపించే మృదుమధుర శైలి, పదలాలిత్యం, వైరాగ్య భావన, గురు-దేవతాభేద తత్త్వం, లోకకల్యాణ కాంక్ష అపూర్వంగా ప్రకాశిస్తాయి. కవిత్వమే సాధనగా, భగవన్నామమే శ్వాసగా, సమాజహితమే సంకల్పంగా జీవించిన విశ్వనాథ శర్మ వ్యక్తిత్వం సాహిత్య-ఆధ్యాత్మిక రంగాలకు ఒక స్ఫూర్తిదాయక దీపస్తంభం. శ్రీ పాండురంగాశ్రమం సర్వాధ్యక్షులుగా ఆధ్యాత్మిక, ధార్మిక, సేవా కార్యక్రమాలకు దిశానిర్దేశం చేస్తూ వారు అందించిన అపారమైన ధర్మసేవ స్మరణీయమైనది. నామసంకీర్తన, అన్నదానం, భగవత్‌సేవ వంటి పవిత్ర ఆదర్శాలను ప్రజాజీవితంలో ప్రవహింపజేసిన వారి సేవాతత్పరత, రచనా తపస్సుకు సమానంగా మహోన్నతమైనది. అటువంటి మహాత్ముని 'శతజయంతి మహోత్సవాల' పుణ్యసందర్భంలో ఆయన బహుముఖ రచనా వైదుష్యాన్ని నేటి తరాలకు సమగ్రంగా పరిచయం చేయడం ఒక సాహిత్య నీరాజనం. ఈ మహత్తర సంకల్పంతో విశ్వనాథ శర్మగారి రచనలను విఖ్యాత విద్వన్మూర్తి ఆచార్య తాడేపల్లి పతంజలి ఒక్కొక్కటిగా విశ్లేషిస్తూ అందిస్తున్న ప్రత్యేక వ్యాసమాలికే "విద్వత్కవి మహాత్మా అప్పాల విశ్వనాథ శర్మ - రచనా వైదుష్య వైభవం." ఈ వ్యాసపరంపరలో తొలి సాహిత్య సుమంగా మన ముందుకు వస్తున్నది భక్తి, వైరాగ్య, అద్వైతానుభూతుల త్రివేణీ సంగమమైన అపూర్వ కృతి - 'శ్రీ పాండురంగ శతకము.'**

(గత సంచిక తరువాయి)

శ్రీ అప్పాల విశ్వనాథ శర్మ తమ 'పాండురంగ శతకము'లోని ఈ పద్యంలో వివిధ దేవతల కన్నుల సంఖ్యను ఆధారం చేసుకుని చమత్కారంగా, భక్తిరసభరితంగా వర్ణించారు.

"పదియు, నెన్మిది, వేయి, పన్నెండు, నిరువేల కన్నుల వేల్పులు'' అంటే హిందూ పురాణాల ప్రకారం ఆయా సంఖ్యలలో కన్నులు కలిగిన దివ్యమూర్తులు:

1. పది కన్నులు (10): పంచముఖ శివుడు (5 ముఖాలు x 2 = 10 కన్నులు).

2. ఎన్మిది కన్నులు (8): చతుర్ముఖ బ్రహ్మదేవుడు (4 ముఖాలు x 2 = 8 కన్నులు).

3. వేయి కన్నులు (1000): దేవరాజు ఇంద్రుడు (సహస్రాక్షుడు - 1000 కన్నులు).

4. పన్నెండు కన్నులు (12): షణ్ముఖుడు / కుమారస్వామి (6 ముఖాలు x 2 = 12 కన్నులు).

5. ఇరువేల కన్నులు (2000): ఆదిశేషుడు (1000 పడగలు/ముఖాలు x 2 = 2000 కన్నులు).

పది కన్నులు ఉన్న శివుడు, ఎనిమిది కన్నుల బ్రహ్మ, వేయి కన్నుల ఇంద్రుడు, పన్నెండు కన్నుల కుమారస్వామి, రెండు వేల కన్నులు ఉన్న ఆదిశేషుడు వంటి వేలాది కన్నులు కలిగిన దివ్య దేవతలకు సైతం పండరీపురంలో ఇటుకపై నిలిచిన శ్రీ పాండురంగని దివ్య మంగళ రూపం అబ్బురాన్ని (ఆశ్చర్యాన్ని) కలిగిస్తుంది.

అంతటి పరమాత్మ దివ్య రూపాన్ని పరిపూర్ణంగా దర్శించడానికి సాధారణ మానవుడనైన నాకు ఉన్న ఈ రెండు కన్నులు (యుగ్మనయనాలు) ఏమాత్రం చాలవు. అందుకే ఆ కన్నులను మూసుకొని, స్వామి దివ్య రూపాన్ని నా హృదయ



కమలంలోనే నిలిపి ధ్యానిస్తున్నానని కవి తమ శరణాగతి భక్తిని అత్యంత రమణీయంగా ఆవిష్కరించారు

**ప్రబంధ కావ్యాలతో పోలిక - 'పాండురంగ మాహాత్మ్యము'తో తులనాత్మక విశ్లేషణ**

తెలుగు సాహిత్యంలో పాండురంగ సంబంధిత కావ్యాల ప్రసంగం రాగానే ప్రబంధ యుగానికి చెందిన విజయనగర సామ్రాజ్య అష్టదిగ్గజ కవి తెనాలి రామకృష్ణుని 'పాండురంగ మాహాత్మ్యము' స్మరణకు వస్తుంది. తెనాలి రామకృష్ణుని కావ్యం పదహారవ శతాబ్దపు ప్రబంధ శైలిలో అష్టాదశ వర్ణనలతో, ప్రౌఢమైన పదగుంఫనంతో, శబ్ద చమత్కారాలతో, ఆఖ్యాన ఉపాఖ్యానాలతో (నిగమశర్మ కథ, పుండరీకుని కథ, రాధాకృష్ణ ప్రణయం) కూడిన క్షేత్ర మాహాత్మ్య కావ్యం.

దీనికి భిన్నంగా అప్పాల విశ్వనాథ శర్మ గారి 'పాండురంగ శతకము' ఆత్మానుసంధానానికి, జీవుని ఆర్తికి, శరణాగతికి, అద్వైత సాక్షాత్కారానికి ప్రాధాన్యమిచ్చిన భక్తిరస శతకము. తెనాలి రామకృష్ణుడు వర్ణనా వైచిత్ర్యానికి, కవిత్వ ప్రౌఢిమకు పీఠం వేస్తే, విశ్వనాథ శర్మ గారు ప్రతి పద్యంలోనూ ఆత్మనివేదనకు, సులభ సుందర భాగవత శైలికి పెద్దపీట వేశారు.

తెనాలి రామకృష్ణుడు చమత్కార కథనంతో కాశీ క్షేత్ర విశేషాలను, స్త్రీల సౌందర్య వర్ణనలను ప్రాధాన్యంలోకి తేగా, విశ్వనాథ శర్మ గారు లోకంలోని తాపత్రయాలను, మోహ బంధాలను విశ్లేషిస్తూ జీవుడు భగవంతునిలో ఏకమయ్యే మార్గాన్ని అనుభవైకవేద్యంగా ఉపదేశించారు.






అప్పాల విశ్వనాథ శర్మ గారి 'పాండురంగ శతకము' వ్యాప్తి చెందని అనుభూతుల సమాహారం కాదు; అది అనుభవపూర్వక అనన్య భక్తికి ఉదాహరణ. ఈ శతకంలో భక్తి వివిధ దివ్య కోణాలలో వికసించింది. శతకంలోని కొన్ని మధురమైన పద్యాలను వ్యాసపరిమితికి లోబడి విశ్లేషించుకొందాం.

**గురు-దేవతా అభేద భావన**

కవి తమ గురుదేవులైన శ్రీ భావానంద భారతీ స్వాములవారి భౌతిక యతి రూపాన్ని శ్రీకృష్ణుని దివ్య స్వరూపంగా భావించి పూజించారు. గురువుల కాషాయ వస్త్రం, కమండలం, దండం క్రమంగా కృష్ణుని కాంచన చేలంగా, వరదండంగా భాసిస్తున్నాయని శతకంలోని రెండవ పద్యంలో ఆవిష్కరించారు:

సీ॥ శ్రీదేవి యురముపై శ్రీవత్స చిహ్నమై/ దేవభావము చాటి తెలుపుచుండ/ కాంచన చేలమ్ము కాషాయవస్త్రమై/రెట్టింపుశోభల నుట్టిపడగ/ మురళియే కరమున వరదండ రాజమై/ పది రెట్లు గౌరవభావమొంద/ జీవకల్యాణమ్ము సేయ భావానంద/ భారతీ యతి పూజ్యపాదులనగ - అవతరించిన నారాయణాఖ్య కృష్ణ !/లలితదరహాసముఖ ! కమండలు విభూష !/ విశ్వనిర్మాణకారణ! వేణుధరణ !/ పరమకరుణాంతరంగ ! శ్రీ పాండురంగ!!

ఈ పద్యం ద్వారా గురుదేవుల కటాక్ష లేశమే పాండురంగ తత్త్వంగా పరిణమించిందనే దివ్య అద్వైత భావన వెల్లడవుతోంది.

**అద్వైత భావన, సర్వవ్యాపకత్వం**

భగవంతుడు నిర్గుణ, నిరాకార, సర్వవ్యాపక బ్రహ్మమని కవి శతకంలో ఘంటాపథంగా ప్రకటించారు.ఈ పద్యంలో పరమాత్మ నిండి ఉన్న

తీరును కవి ఇలా అభివర్ణించారు:

సీ॥ ఎందెందుజూచిన నందందు వ్యాపించి/ నిత్యమై సత్యమై నిలచియుండు/ ఎచ్చోట నరసిననచ్చోట పూర్ణమై/ సర్వశక్తులతోడ సతతముండు/ ఏమూలగనుగొన్న నామూల మాటకున్/ మనసున కందక మసలుచుండు/ ఏవంక దెలిసిన నే వంకలును లేక/ భూమమై సతము కాపురముసేయుగి? నీలతేజము రాధికాలోలమగుచుబాల గోపాలభావాన నోలలాడి/ నిండ నా మదిలో నిండియుండుగాకపరమ కరుణాంతరంగ! శ్రీ పాండురంగ!!

పరమ దయాసముద్రుడవైన ఓ శ్రీ పాండురంగా!

ఎక్కడ చూసినా అక్కడంతటా వ్యాపించి, ఎప్పటికీ మార్పులేనిదై (నిత్యము), నిజమైనదై (సత్యము) నిలిచి ఉండేది; ఏ ప్రదేశంలో పరిశీలించినా అక్కడ పరిపూర్ణమైనదై, సమస్త శక్తులతో నిరంతరం ఉనికి కలిగి ఉండేది; ఏ మూల వెతికినా మాటలకు గానీ, మనస్సు యొక్క ఆలోచనలకు గానీ అందకుండా సంచరించేది; ఏ కోణంలో చూసినా ఎలాంటి లోపాలు (వంకలు) లేక, అపరిమితమైన పరబ్రహ్మ స్వరూపమై (భూమమై) ఎల్లప్పుడూ నివాసముండేది అయిన నీ దివ్య "నీల తేజస్సు" (శ్రీకృష్ణ స్వరూపం) రాధాదేవి యందు అనురాగం కలదై, బాలగోపాలుని దివ్య భావంతో ఆనందిస్తూ నా హృదయము నిండా నిరంతరం నిండియుండుగాక!




ఈ పద్యంలో కవి అద్వైత వేదాంతంలోని నిర్గుణ పరబ్రహ్మ తత్వాన్ని, మధుర భక్తిలోని సగుణ శ్యామసుందర రూపాన్ని అత్యంత రమణీయంగా సమన్వయం చేశారు. మొదటి నాలుగు చరణాలలో ఆకారము లేని సర్వాంతర్యామియైన బ్రహ్మాన్ని వర్ణించి, తేటగీతి పద్యంలో ఆ పరబ్రహ్మమే రాధికాలోలుడైన 'బాల గోపాలుడు' అనే సగుణ సాకార దివ్యమూర్తి అని నిరూపించారు.

ఛాందోగ్య ఉపనిషత్తులో పేర్కొన్న "భూమా" (అనంతమైన పరబ్రహ్మము) అనే భావనను కవి 'ఏ వంకలును లేక భూమమై సతము కాపురముసేయు' అని ఉపయోగించారు. అలాగే 'మాటకున్ మనసున కందక' అనే పదం "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" (ఏ పరమాత్మను అందుకోలేక మాటలు, మనస్సు వెనుదిరుగుతాయో) అనే తైత్తిరీయోపనిషత్ మంత్రాన్ని స్మరింపజేస్తుంది.

ఆలోచనలకు, మాటలకు అందని పరమాత్మను సాధారణ మానవుడు అనుభవంలోకి తెచ్చుకోవడం కష్టం. అందుకే కవి "ఆ నిరాకార వ్యాపక తేజస్సు నా మదిలో 'బాల గోపాలుని' భావంలో నిండిపోవాలి" అని ప్రార్థించారు. జ్ఞాన మార్గం ద్వారా తెలిసే బ్రహ్మత్వాన్ని, భక్తి మార్గం ద్వారా తమ హృదయంలో ప్రతిష్ఠించుకోవడమనే సాధనా రహస్యం ఇందులో దాగించి ఉంది.

అలాగే బుద్ధి రాధిక నిత్య శుద్ధ! నీవాత్మవు. అను ఇరవైయవ పద్యంలో ఉపాసకుడి దేహమే దేవాలయమని, బుద్ధియే రాధిక అని, స్వస్థతతో నిద్రించడమే యోగనిద్ర అని, సంభాషణలే స్తోత్రాలని వర్ణిస్తూ 'సోహమ్' భావనను స్థాపించారు:

### అనన్య భక్తి, సర్వేంద్రియ సమర్పణ

నారద భక్తి సూత్రాలలో వివరించిన అనన్యతను విశ్వనాథ శర్మ గారు సీ॥ స్వామి! నా మనమెందు సంచరించిన నీవుప్రేమతో నచట గన్పింపుమయ్య - అని తమ ఐదవ పద్యంలో ప్రతిబింబింపజేశారు:

ఈ భావానుబంధానికి ముగింపుగా ఇరవై ఒకటవ పద్యంలో జిహ్వ నామసుధను గ్రోలాలని, కరములు హరిని పూజించాలని, వీనులు కథలు వినాలని, హృదయం పాండురంగుని స్మరించాలని సమస్త ఇంద్రియాలకు దైవిక దిశానిర్దేశం చేశారు:

సీ॥ చిత్తమా! శ్రీకృష్ణ చింతించుమెప్పుడు/ నాలుకా! చవిజూడు నామసుధల/ కరములారా ! మీరు హరిని పూజింపుడు/ వీనులార! వినుడు విష్ణుకథలు/ కనులార! రాధికాకాంతుని గాంచుడీ/ గుడిలోని కరుగుడో యడుగులారా!/ ఘ్రాణమా! తులసీసుగంధ మాఘ్రాణించు/ మస్తకమా! మ్రొక్కు మాధవునకు- అనుచు లోలోన సకలేంద్రియముల నిన్ను/ గొలువగా వేడుకొందును గోపబాల !/ సేవ గొనుమయ్య నిరతము శ్రీ ముకుంద!/ పరమ కరుణాంతరంగ ! శ్రీ పాండురంగ!!

శ్రీమద్భాగవతంలో అంబరీష మహారాజు తన మనస్సును కృష్ణ పాదారవిందాల యందు, వాక్కును హరిగుణ వర్ణన యందు, కరములను విష్ణుమందిర మార్జనాదుల యందు సమర్పించినట్లే ("స వై మనః కృష్ణపదారవిందయోః వచాంసి వైకుంఠ గుణానువర్ణనే..."), కవి విశ్వనాథ శర్మ గారు కూడా తమ ప్రతి ఇంద్రియానికి భగవత్సేవనే విధిగా నిర్దేశించారు

సాధారణంగా మానవ ఇంద్రియాలు విషయ భోగాల వైపు,

ప్రాపంచిక కోరికల వైపు వేగంగా పరిగెడుతుంటాయి. వాటిని బలవంతంగా అణచివేయడం శ్రమతో కూడుకున్న పని. కానీ, ఆ ఇంద్రియాలన్నింటినీ భగవంతుని దివ్య సేవ వైపు మళ్లించడమే సులభమైన మోక్ష మార్గమని కవి ఈ పద్యం ద్వారా అనుభవైకవేద్యంగా నిరూపించారు.

కవి తమ దేహంలోని అవయవాలను (చిత్తము, నాలుక, కరములు, వీనులు, కన్నులు, అడుగులు, ఘ్రాణము, మస్తకము) ఒక్కొక్కటిగా పేరుపేరునా పలకరిస్తూ, ఒక యజమాని తన సేవకులకు దిశానిర్దేశం చేసినట్లుగా నాటకీయంగా సంబోధించడం ఇందులో కవితా చమత్కారం

**వేణుగాన మహిమ, నామ సంకీర్తన ప్రభావం**

శ్రీకృష్ణుని వేణురవం కఠినమైన పాషాణ హృదయాలను సైతం కరిగించి వేస్తుందని, సమస్త సంసార బంధాలను తుంచి వేస్తుందని కవిఒకమారు విన్న నింకొకదానిపై కోర్కెసుంతయు లేకుండ నంతరించు - అను పదకొండవ పద్యంలో అమృత తుల్యంగా చెప్పారు:



అలాగే ఇరవై మూడవ పద్యంలో పాండురంగా! యని పలికినతోడనే నిండుగా సంతృప్తి నిండుకొనును విఠలా! యనినంత వివశతవ్యాపించి హృదయమా నంద సంపదలదేలు అంటూ' పాండురంగ', 'విఠల' నామాలను స్మరించినంత మాత్రాన కలిగే పర మానంద వివశతను, భజన మహి మను కవి ప్రత్యక్షంగా వెల్లడించారు:

**ఆత్మనివేదన, నాటక సూత్రధారి భావన**

కవి తమ జీవితాన్ని జగన్నాటక రంగాన జరుగుతున్న ఒక పాత్రగా భావించారు. ఇరవై ఆరవ పద్యంలో ఆటాడగా జగన్నాటక రంగానన్ను నీ పంపిన నాటినుండి - అంటూ సంసారంలో నవరసాలను అభినయించిన జీవుడు చివరకు సూత్రధారియైన పాండురంగుని చరణాల చెంత విశ్రాంతి పొందాలనుకోవడాన్ని ఆత్మనివేదనతో వర్ణించారు:

**సామాజిక శ్రేయస్సు, లోకకల్యాణ కాంక్ష**

అప్పాల విశ్వనాథ శర్మ గారి భక్తి కేవలం వ్యక్తిగత విముక్తితో సరిపెట్టుకున్నది కాదు; అది సమస్త లోక శ్రేయస్సును ఆకాంక్షించిన సమగ్ర భక్తి. శతకం చివరి ఘట్టంలో నూరవ పద్యంలో కవి వర్షా భావ పరిస్థితులు తొలిగి, వర్షాలు కురిసి, భూదేవి సస్యశ్యామలమై, జను లందరూ భయాందోళనలు లేకుండా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు:

సీ॥ ప్రతియేట సమయాన పర్జన్యదేవుడు కరుణించి వానలు గురియుగాక/ పాడిపంటలతోడ గూడి భూదేవత నిరతాన్న పూర్ణయై వరలుగాక/ చీకుచింతలులేక లోకజాలమునందు చల్లని శాంతి వర్ధిల్లుగాక/ పూర్ణాయు రారోగ్యములుగల్గి జను లందు హరిభక్తి కర మలరారుగాక/ భావిమంగళదాయియై బరగుగాక/ సౌఖ్యయుతమైన బ్రతుకులు సాగుగాక/ రాధికానాథ! నీ యనుగ్రహమువలన/ పరమ కరుణాంతరంగ! శ్రీ పాండురంగ!!

ఈ లోకకల్యాణ పద్యం పాండు రంగాశ్రమ నినాదమైన నాద-ప్రసాద సంప్రదాయానికి, సామాజిక శాంతి సౌభాగ్యాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. గ్రంథం చివర అమర్చిన 'పరమపదసోపానపంచకమ్' లో 'విశ్వ సించుము, ప్రేమించుము, సేవిం చుము, స్మరించుము, తరించుము' అని కవి మానవాళికి సులభ ఆధ్యాత్మిక మార్గాన్ని అందించారు.

శ్రీ అప్పాల విశ్వనాథ శర్మ గారు రచించిన 'పాండురంగ శతకము' తెలుగు సాహిత్య వీధిలో నిరంతరం వెలిగే ధ్రువతార. ప్రబంధ కావ్యాల్లో కనిపించే శబ్ద శ్లాఘనకు స్వస్తి చెప్పి, భాగవతా మృతాన్ని తలపించే సరళ సుందర తెనుగు నుడికారాలతో, అనుప్రాసలతో, నిర్వేద అద్వైత రసభావాలతో శతకాన్ని మహోన్న తంగా తీర్చిదిద్దారు. పాండురంగని పౌరాణిక లీలల నుండి సర్వవ్యాపక బ్రహ్మ తత్త్వం వరకు, గురుకటాక్ష మహిమ నుండి సామాజిక శాంతి కాంక్ష వరకు ప్రతి అంశాన్ని సీస పద్యాలలో మలచిన శర్మ గారి భక్తి సాధన ప్రతి సాధకునికి అనుసర ణీయం. తెలుగు భక్తి సాహిత్య చరిత్రలో ఈ శతకం అనుపమ మైన ప్రజ్ఞా ప్రాభవాలతో, నిత్యపారాయణ రసగుళికగా నిలిచిపోతుంది.

స్వస్తి.




# దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠ వైభవం

(గత సంచిక తరువాయి)

"శృంగేరి మఠంలో మనకొక సంప్రదాయం ఏమిటంటే మనం ఎవరినీ అడిగే అలవాటు లేదు. నేను ఈ కార్యక్రమం చేస్తున్నాను మీరు ఏమన్నా ఇస్తారా అని అడిగే సంప్రదాయం అప్పటి నుంచి ఇప్పటిదాకా రాలేదు. ఇకముందూ రాదు. అయితే మన మనస్సులో సంకల్పం పుట్టింది అంటే ఆ జగన్మాత శారద ఎవరెవరి మనస్సుల్లో ప్రవేశించి ఏ రీతిగా ఆ పనిని చేస్తుందనేది ఆ పని అయ్యాకే తెలుస్తుంది. ఇప్పుడూ అట్లాగే అయింది. మనసులోకి ఒక సంకల్పం వచ్చాక అమ్మవారు దాన్ని నడిపిస్తారనేది నా నిర్ణయం. ఎవరినీ ఏదీ అడగడానికి వెళ్ళవద్దన్నాను. వీళ్లు ఎవరూ ఏదీ అడగడానికి వెళ్ళలేదు. కొందరు వాళ్ళంతట వాళ్ళే వచ్చి 'ఈవిధంగా చండీ యాగం చేస్తారట కదా మేమేదైనా యథాశక్తి ఇందులో పాల్గొనవచ్చా?' అని అడగసాగారు. 'మీ అంతట మీరు వచ్చి పాల్గొంటామంటే మేము వద్దనము' అన్నారు వీళ్లు. 'మేము పాల్గొంటామన్నారు వాళ్ళు'. కార్యక్రమం జరుగుతున్నది అంతే. మరేమీ లేదు.

ఆ విధంగా శృంగేరీ శారదాపీఠంలో 'అప్పటి నుంచి భగవత్పాదులు ఏ దారి చూపించారో అదే మార్గంలో నడవాలి, ఆ మార్గం నుంచి అటూ ఇటూ కాకూడదు. అదే మనకు శ్రేయస్కరమైనది' అనే నిర్ణయంతో ఈ గురుపరంపర వస్తున్నది. సురేశ్వరాచార్యుల నుండి కూడా ఈ పరంపర చరిత్ర చూస్తే ఏ స్వామి కూడా ఆ మార్గానికి భిన్నంగా ప్రవర్తించలేదు. అదే మార్గాన్ని మేమూ అనుసరించాలని మా గురువుగారు ఆజ్ఞాపించారు. ఆ మార్గంలోనే మేము ముందుకు సాగుతున్నాము. ఈ అంతటికీ మా గురువులైన జగద్గురు శ్రీమదభినవ విద్యాతీర్థ మహాస్వామివారి కృపయే కారణం. వారి అనుగ్రహమే ఇదంతా. వారు మాకు మంత్రోపదేశం చేసి ఒక మాట చెప్పారు. 'మీ కాలంలో మఠం చాలా బాగుంటుందప్పా' అని. అది ఇంకెవరికీ తెలియదు. ప్రత్యేకంగా నాకు చెప్పారు- మంత్రోపదేశం చేశాక. సన్యాస స్వీకారం చేశాక మంత్రోపదేశం చేసే సంప్రదాయం ప్రకారం తమ అనుష్ఠాన కక్ష్యలో నన్ను కూచోబెట్టి నాకు ఉపదేశం చేసి- 'మీ కాలంలో మఠం చాలా బాగుంటుంది' అన్నారు. ఆ మాట వీటన్నిటినీ నడిపిస్తున్నది.



వారు అనిన మాటలలో ఒక అక్షరాన్నీ నేను అటూ ఇటూ మార్చలేదు- 'నిమ్మ కాలదల్లి మఠ చెన్నాగిరుత్తదె'. ఆ ఒక్కమాట ఈ పనులను జరిపిస్తున్నది.

"గురువుల మాటల ప్రభావం ఎంతటిదో ఏమిటో మాకు అనుభవవేద్యమయింది. గురువుల ఆ ఒక్కమాట వీటన్నిటినీ చేయిస్తున్నదంటే ఆశ్చర్యం కలగవచ్చు. ఈ మాటలు మొదట-సురేశ్వరులకు మఠం ఇచ్చినప్పుడు శంకరుల నోటినుండి వచ్చి ఉండవచ్చు. 'ఇకముందు ఈ మఠం బాగా ఉండనీ' అనే మాటలు మొదట శంకరుల నోటినుంచి వెలువడి ఉండాలి. ఆ తర్వాత ఒక్కొక్క గురువు నోటినుండి వస్తున్న ఆ మాటలు నా గురువు నోటి నుంచి వచ్చాయి. అట్లాగే మఠం ఇప్పుడు నడుస్తున్నది. మా శిష్యులైన మీరందరూ భక్తి, శ్రద్ధలతో పాల్గొంటున్నారు. మీ అందరికీ నేను పరిపూర్ణమైన ఆశీర్వాదం చేస్తున్నాను. భగవంతుడు మీకు సకల విధాలైన శ్రేయస్సులను ఇవ్వనీ! అధర్మం నుంచి దూరంగా ఉండేట్టు చేయనీ! సదా ధర్మంలోనే ప్రవృత్తి ఉండేట్టు చేయనీ! భగవంతుని పట్ల శ్రద్ధాభక్తులు, గురువు పట్ల శ్రద్ధాభక్తులు ఎల్లవేళలా ఉండేటట్లుగానూ ఎప్పుడూ ఇంకొకరికి ఉపకారం చేయగల భావన ఉండేటట్లుగానూ ఎప్పటికీ ఎవరికీ అపకారం చేయాలనే భావన పుట్టకుండా ఉండేటట్లుగానూ భగవంతుడు మీకు పరిపూర్ణమైన అనుగ్రహం చేయనీ అని ఆశీర్వదిస్తున్నాను."

"ఈనాటి కార్యక్రమంలో చాలామంది పాల్గొన్నారు. విశేషంగా తిరుపతి దేవస్థానం వారి కార్యనిర్వహణాధికారులు వచ్చి తమ గౌరవాన్ని అర్పించారు. వారు మమ్మల్ని తిరుపతికి ఆహ్వానించారు. తిరుపతికి వెళ్ళడమన్నది మాకు కొత్త కాదు. మా గురువులు తిరుపతికి వెళ్ళారు. నేనూ వెళ్ళాను. తిరుపతిలో వందలాది ఏళ్ళుగా- దాదాపు 600 ఏళ్ళకన్నా ఎక్కువ కాలం నుండి శృంగేరి మఠం ఉన్నది. నిన్నటిది నేటిది కాదు. అన్ని వందల ఏళ్ళుగా శృంగేరి మఠం తిరుపతిలో ఉన్నందువల్ల శృంగేరి మఠానికీ తిరుపతికీ అవినాభావ సంబంధం ఉంది. అందువల్ల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఇక్కడికి రావడం మాకు సంతోషం కలిగించింది. అట్లాగే మనదేశంలోని అనేక దేవస్థానాల ప్రసాదాలను ఆయా దేవస్థానాల నిర్వాహకులు పంపి తమ గౌరవాన్ని ప్రకటించారు. వారందరికీ ఆశీర్వాదాలు చేస్తున్నాను. అట్లాగే మఠం శిష్యులు పలురకాల ప్రచురణలు- అత్యంత భక్తితో చేశారు. వారందరికీ ఆశీర్వాదం చేస్తున్నా. ఇంకా మా అధికారులు స్వామివారి చిత్రాలున్న 'జగద్గురు దర్శనం' అనే మూడు గ్రంథాలు తెచ్చారు. అవి శిష్యజనులకెంతో అపేక్షణీయాలు. అట్లాగే 'జగద్గురు వైభవం' అనే పేరుతో దేశంలోని ప్రఖ్యాత విద్వాంసులు విశేషంగా సంస్కృతంలో రాసిన రచనలతో ఒక గ్రంథం ప్రకటించారు. ఇవన్నీ కూడా శిష్యుల శ్రద్ధాభక్తులను సూచిస్తున్నాయి. ఆ శ్రద్ధాభక్తులు ఇతోధికంగా ఉండనీ!

"అదేదో డీవీడీ కూడా తీసుకువచ్చారు. డీవీడీ అంటే అర్థమేమో నాకు తెలియదు- డీవీడీ అంటున్నారు. దానినీ ఆశీర్వదిస్తున్నాను. అన్నిటికీ అందరినీ ఆశీర్వదిస్తున్నాను. నేటి కార్యక్రమం ఇంత అందంగా చక్కగా సాగడానికి మీ అందరి సహకారం కారణమైంది. మీ అందరినీ ఆశీర్వదిస్తూ ఈ ప్రసంగాన్ని ఇక్కడికి ముగిస్తున్నాను. ఆ భగవంతుడు మీ అందరినీ సదా సర్వదా కాపాడనీ!"

"హర నమః పార్వతీపతయే హర హర మహాదేవ!"

ఈ గురువందన కార్యక్రమం తర్వాత జగద్గురువులు శ్రీ భారతీతీర్థ మహాస్వామివారు వేదమంత్రోచ్చారణల నడుమ శ్రీ చంద్రమౌళీశ్వరునికి ప్రత్యేక పూజ చేశారు. రాత్రివేళలలో చేయని ఫలపంచామృత అభిషేకం ఈ పూజలో చేయడం విశేషం. 'గురునివాస్'లో క్రిక్కిరిసిన భక్త కోటికి జగద్గురువులు చేసిన ఈ విశేషపూజ అద్వితీయానందాన్ని కలిగించింది!

**- డా. పి.ఎస్. గోపాలకృష్ణ**
ఆకాశవాణి పూర్వ సంచాలకులు





# శ్రీమద్దేవీభాగవతం

## నవమ స్కందం

(గత సంచిక తరువాయి)

జ్ఞాతివైరం బ్రహ్మహత్యాపాపం కంటే భయంకరమైనది. కాలం ఎప్పుడూ ఒకే రకంగా ఉండదు. బ్రహ్మ కూడా ప్రకృతి ప్రళయంలో లీనమైపోతాడు. అనంతరం ఈశ్వరాజ్ఞ వల్ల బ్రహ్మ పునర్భవుడవుతాడు. తపస్సు చేసి జ్ఞానాన్ని పెంపొందించుకుంటాడు. కారణం పూర్వ స్మృతి లోపించడమే. జ్ఞానంతో మరల సృష్టిస్తూ ఉంటాడు. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుంది.త్రేతాయుగంలో మూడు పాదాల మీద, ద్వాపర యుగంలో రెండు పాదాలతో, కలియుగంలో ఏక పాదం మీద ధర్మం నడుస్తుంది. కలియుగాంతంలో పూర్తిగా ధర్మం నశిస్తుంది. చంద్రకళ అమావాస్యనాడు తగ్గినట్లుగా, శిశిర ఋతువులో గ్రీష్మం నాటి వేడి తగ్గినట్లుగా, కలియుగాంతంలో సత్యం నామమాత్రంగా ఉంటుంది. సూర్యుడు ఉదయంలో తక్కువ వేడితో ఉంటూ, మధ్యాహ్న వేళ తీవ్రత చూపిస్తూ, సాయంకాలం అస్తమిస్తాడు. అప్పుడప్పుడు మేఘాలచే ఆవరింపబడతాడు. దానిని దుర్దినము అంటారు. 'మేఘచ్ఛన్నంతు దుర్దినమ్' అని అమరకోశంలో ఈ దేవీభాగవత శ్లోకాన్నే ఉదహరించాడు కవి. మేఘములు ఆకాశాన్ని ఆవరించి, సూర్యుడు కనపడని దినాన్ని దుర్దినం అంటారు. చంద్రుడు రాహువు పట్టుకున్నప్పుడు కంపితుడై, విడిచినప్పుడు ప్రసన్నుడౌతాడు. పూర్ణిమనాడు వెన్నెల కురిపిస్తాడు. అనంతరం కృష్ణపక్షంలో క్షీణిస్తూ, శుక్ల పక్షంలో అభివృద్ధి చెందుతూ ఉంటాడు. కృష్ణ పక్షంలో చంద్రుడు కూడా కాల ప్రభావానికి లోబడినవాడే.

ప్రస్తుతం పాతాళంలో ఉన్న బలి చక్రవర్తి భవిష్యత్తులో ఇంద్రుడు అవుతాడు. కాలానుగుణంగా భూమి పంటలతో సమృద్ధిగా ఉంటుంది. కాలం సరిగ్గా లేనప్పుడు ఎండిపోవడంలేదా జలప్రళయంలో మునిగిపోవడం జరుగుతుంది. ఈశ్వరుడే పరమాత్మ. పరబ్రహ్మ. నేనే ఈశ్వరుడను. నేను నా వలననే మృత్యుంజయుడనయ్యాను. అనేక ప్రాకృత ప్రళయాలు చూసాను, చూస్తాను. ప్రకృతి, పురుషుడు, ఆత్మ, జీవుడు అన్నీ పరమాత్ముడే. పరమాత్మవల్ల బ్రహ్మ సృష్టికర్తగా, విష్ణువు పోషకుడుగా, రుద్రుడు సంహారకుడుగా నియమితులయ్యారు. కాలాగ్నిరుద్రుడు సర్వసంహారకుడుగా నియోగింపబడ్డాడు. గరుత్మంతుడికి పాములు భయపడినట్లు, పరమాత్ముడికి మృత్యువు భయపడుతుంది. అని ఈ విధంగా శివుడు పలుకగా విన్న శంఖచూడుడు ఆయనతో ఇలా అన్నాడు- దేవా! నీ మాటలు సత్యాలు. నా మాటలు కూడా విను. నీవిప్పుడే జ్ఞాతిద్రోహం మహాపాపమని అన్నావు. అటువంటప్పుడు సర్వస్వము హరించి, బలిచక్రవర్తిని పాతాళంలో ఎందుకు ఉంచారు? నేను ఊర్ధ్వలోకాలను జయించి, ఐశ్వర్యాన్ని పొందాను. కాని సుతలంలో గదాధరుడైన విష్ణువు ఉండడం వల్ల దాని జోలికి వెళ్ళలేక పోయాను. హిరణ్యాక్షుణ్ణి, హిరణ్యకశిపుణ్ణి దేవతలు ఎందుకు హింసించారు? శుంభాదులను ఎందుకు చంపారు? సముద్రమథనంలో అమృతం దేవతల పాలయ్యింది, కష్టాలు మాకు దక్కాయి. దేవతలకు సుఖాలా? మాకు దుఃఖాలా? నీవు ఈశ్వరుడవు అందరి యడల సమానంగా ఉండాలి. ఇందులో



డా॥ వద్దిపర్తి పద్మాకర్

కలిగించుకోరాదు. అందరిని సమానంగా చూడాలి. నీవు మమ్మల్ని జయిస్తే నీకు కొత్తగా వచ్చే కీర్తి ఏమీలేదు. ఓడిపోతే మాత్రం అపకీర్తి.

అనగా విని శివుడు అతనితో ఇలా అన్నాడు- యుద్ధంలో జయాపజయాలవల్ల మాకు కీర్తి. అపకీర్తి ఉండవు. పూర్వం మధుకైటభులతో విష్ణువు పోరాడలేదా? శ్రీమహావిష్ణువు హిరణ్యకశిపుని చంపలేదా? హిరణ్యాక్షుని చంపలేదా? “నేను పూర్వం త్రిపురాసురులతో యుద్ధం చేసాను. సర్వేశ్వరి, సర్వమాత, ప్రకృతి అనబడే అమ్మవారు శుంభనిశుంభులతో పరమాద్భుత యుద్ధం చేసింది. నీవు శ్రీకృష్ణుని సహచరుడవు. నీతో యుద్ధం చేయడానికి నేను సిగ్గుపడవలసిన అవసరం లేదు. మా చేతులలో ఇదివరలో మరణించిన వారెవ్వరూ నీకు సాటి కారు. అందుకే దేవతలను సంరక్షించమని శ్రీహరి నన్ను పంపించాడు. దేవతలకు రాజ్యం తిరిగి ఇవ్వడం మంచిదని నేను భావిస్తున్నాను. ఇక వ్యర్థంగా మాటలాడడం వల్ల లాభం ఏముంది? యుద్ధం చేయాలనుకొంటే చేయి.” శివుడు ఇలా పలకగా శంఖచూడుడు తన మంత్రులతో సహా యుద్ధానికి సంసిద్ధుడయ్యాడు. శివునకు నమస్కరించాడు. విమానం ఎక్కాడు. శివుడు కూడా తన సైన్యాన్ని యుద్ధానికి సిద్ధం కమ్మన్నాడు. ఇంద్రుడు వృషపర్వునితో, సూర్యుడువిప్రచిత్తితో, చంద్రుడు దంభునితో, కాలుడు కాలస్వరుడితో, అగ్ని గోకర్ణునితో, కుబేరుడు కాలకేయునితో, విశ్వకర్మ మయునితో, మృత్యువు భయంకరునితో, యముడు సంహారునితో, వరుణుడు వికంకునితో, వాయువు చంచలునితో, బుధుడు ఘృతప్రుష్ఠునితో, శనైశ్చరుడు రక్తాక్షునితో, జయంతుడు రతృసారునితో, వసువులు వర్చోగణాలతో, అశ్వినులు దీప్తిమంతునితో, నలకూబరుడు ధూమ్రునితో, ధర్ముడు దురంధరునితో, మంగళుడు ఉషాక్షునితో, భానుడు శోభాకరునితో, మన్మథుడు పిఠరునితో, గోధాముఖునితో, చూర్ణునితో, ఖడ్గునితో, ధ్వజునితో కాంచీముఖునితో, పిండుతో, ధూమ్రునితో యుద్ధం చేసాడు.

(సశేషం)



# శ్రీ సాందీపని గురుకుల సేవాట్రస్ట్

Founded By:Maharanyam Sri Sri MuraliDhara Swamiji (Chennai)

Sri Hari



మన సనాతన ధర్మంలో మన జీవన ఆధారం వేదం, వేదం మన హిందూ ధర్మానికి భారతదేశానికి హృదయం వంటిది. ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాచీన కాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మహత్ములు,ఋషులు చాలా కష్టపడి వేదాన్ని సంరక్షించి ఇప్పుడు మన తరానికి అందించారు. వాళ్ళు అందించిన వేదాన్ని కాపాడవలసిన బాధ్యత మన అందరి మీద ఉన్నది.

హైదరాబాద్ నగరంలో ECIL సాకేత్, కాప్రా నందు శ్రీ ప్రేమిక వేదాశ్రమం అను పేరుతో శ్రీ కృష్ణ యజుర్వేద పాఠశాల నిర్వహింపబడుతున్నది, కావున ఆస్తిక జనులందరూ ఈ వేద పాఠశాలకు ధన, వస్తు రూపేణ సహాయ సహకారములు అందించి ఆ వేదమాత యొక్క అనుగ్రహమునకు పాత్రులు కాగలరని కోరుకుంటున్నాము.

ఈ వేద పాఠశాల యందు బ్రాహ్మణ సమారాధన తమ తమ గోత్ర నామములతో చేయించుకున్న వారికి ప్రసాదముగా కుంకుమ, మంత్రాక్షతలు తగు రసీదు పంపడం జరుగుతుంది.

ఆ వేదమాత యొక్క అనుగ్రహం అందరికీ లభించుగాక

Donation Type:One Day Samaradhana-Rs.5000/- One Vidhyarthi Expenses/Month-Rs.8000/- One Day Patasala Expenses-Rs.14000/-
Donations can be made by cheques favoring '' SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.)"
donation can be made by online fund transfer : IFSC Code : SBIN0012739
Account Number : 34134951509 Name : SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.),
Branch : SAKETH (HYDERABAD) UPI:ssgsthyd@icici

**Donations are eligible for exemption U/S 80G of Income - Tax Act**

Admin & Patasala Address : Door no.1-1-31/399A, Lane - 26,Phase-1 Saket nagar,Saket, Kapra, Hyderabad-62. cell:9440875114 - 8667000419

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు



పరమహంస పరివ్రాజకాచార్యవర్య,
శ్రీ శంకరాచార్య పరంపరాగత మూలామ్నాయ సర్వజ్ఞ శ్రీకంచికామకోటి పీఠాధీశ్వరులు
## శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి
దివ్యానుగ్రహముతో...

సాంగ స్వాధ్యాయభాస్కర, అద్వైతవేదాంత విద్యాప్రవీణ, మహామహోపాధ్యాయ, భారతాత్మ మరియు రాష్ట్రపతి సన్మాన గ్రహీత,
బ్రహ్మశ్రీ వేదమూర్తులు విష్ణుభట్ల సుబ్రహ్మణ్య దీక్షిత సలక్షణ ఘనపాఠి గారు M.A, P.H.D
కీ॥శే॥ బ్రహ్మశ్రీ గుంటూరు వాసుదేవ మూర్తి గారి ఆశీః కటాక్షములతో



# శ్రీ మహాభారతంలో శ్రీకృష్ణ గాథ
# నవాహ్నిక జ్ఞానయజ్ఞ మహోత్సవము

తేది : 24-10-2026 నుండి 01-11-2026 వరకు
స్థలం : గీతాజ్ఞాన సంస్థాన్, కె.డి.బి. రోడ్, కురుక్షేత్రం



ప్రవచన కర్త :
విద్యావాచస్పతి, ధార్మిక వరేణ్య
ఆర్షధర్మ విద్వన్మణి, వాగ్దేవి వరపుత్ర
## బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు



కీ॥శే॥ బ్రహ్మశ్రీ గుంటూరు వాసుదేవ మూర్తి గారు

కీ॥శే॥ శ్రీ జి.వి.ఆర్.జి. మూర్తి - సుబ్బమ్మ

వేదపండితులు :
స్వాధ్యాయరత్న, వేదనిధి, ఘనరత్న,
వేదభాష్యరక్షామణి, భారతాత్మ పురస్కార గ్రహీత
బ్రహ్మశ్రీ వేదమూర్తులు విష్ణుభట్ల లక్ష్మీనారాయణ ఘనపాఠీ గారు
(టి.టి.డి. ఈ.సి. మెంబర్)

పారాయణము :
బ్రహ్మశ్రీ సామవేదం సత్యనారాయణ శాస్త్రి గారు
డా॥ ఇనుగంటి ఉమారామారావు గారు,
Sanskrit M.A. PhD.

## కార్యక్రమ వివరములు

ది. 24-10-2026న ఉ॥ అంకురారోపణ ప్రవచనం ప్రారంభం
ది. 02-11-2026న పూర్ణాహుతి అవబృథ స్నానం
ప్రతిరోజు ఉ॥ 10:00 గం॥ల నుండి మ॥ 12:00 గం॥ల వరకు
సా॥ 4:00 గం॥ల నుండి రా॥ 6 గం॥ల వరకు
శ్రీమహాభారతంలో శ్రీకృష్ణ గాథలు ప్రవచనము జరుగును
ప్రతిరోజు ఈ కార్యక్రమమునకు అంగముగా
వేదపారాయణ మొదలగు కార్యక్రమములు జరుగును.

# దర్శనమ్

## ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

బ్ర॥శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు, పుత్రులు బ్ర॥శ్రీ గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి, శ్రీ సిద్ధకుంజికా పీఠము
శ్రీ మహాకాల మందిరము, విశ్వం విహార్, మేడిపల్లి (ఔదుంబరపురి),డిమార్ట్ ఎదురుగా, హైదరాబాద్, ఫోన్ : 94403 50868, 8008513203

శ్రీ పరాభవ సం॥ దక్షిణాయణం
వర్ష/శరత్ ఋతువు
భాద్రపద బ.పంచమి-ఆశ్వయుజ బ.షష్ఠి

# అక్టోబర్ OCTOBER 2026

దర్శనమ్ 22వ. వార్షికోత్సవం

ఉ: ఉదయం, మ: మధ్యాహ్నం, సా: సాయంత్రం, రా: రాత్రి, తె: తెల్లవారుఝామున, వ: వర్జ్యము, శే.వ.: శేషవర్జ్యము, ల: నుండి

## పండుగలు

2 గాంధీజయంతి
6 సర్వేషాంఏకాదశి
9 మాసశివరాత్రి
10 మహాలయఅమావాస్య చిత్తకార్తి బతుకమ్మప్రారంభం
11 శ్రీదేవీశరన్నవరాత్రి ఆరంభం,కలశస్థాపన
16 శ్రీసరస్వతీపూజ(మూల)
17 త్రిరాత్రకలశస్థాపన
18 దుర్గాష్టమి, బతుకమ్మపండుగ తులాసంక్రమణం
19 మహార్నవమి సువాసినీపూజ
20 హెూమబలిదానాలు విజయదశమి (దసరా) శమీపూజ
21 దసరా సంబరాలు
22 సర్వేషాం ఏకాదశి
24 శనిత్రయోదశి స్వాతికార్తి
25 కోజాగరీవ్రతం
26 శరత్పూర్ణిమ
28 ఉండ్రాళ్ళతద్ది
29 సంకష్టహరచతుర్థి

| | | | | | |
|---|---|---|---|---|---|
| SUN ఆది<br>రాహు కాలం సా.4.30 మొ6.00<br>యమగండ కాలం మ.12.00 మొ1.30<br>వారదుర్ముహూర్తం సా.4.24 మొ5.12 | | **4**<br>అష్టమి ఉ.7.05<br>త.నవమి రా.తె.4.40<br>పునర్వసు రా.2.03<br>వ.మ.2.53ల4.22 | ఆశ్వయుజం **11**<br>శు.పాడ్యమి రా.7.50<br>చిత్త రా.10.04<br>శే.వ.ఉ.7.11ల<br>తి.రా.3.52ల5.33 | **18**<br>అష్టమి పూర్తి<br>పూర్వాషాఢఉ.10.39<br>వ.రా.7.22ల9.08 | **25**<br>చతుర్దశి ఉ.10.34<br>రేవతి రా.7.28<br>వ.ఉ.7.28ల9.04 |
| MON సోమ<br>రాహు కాలం ఉ.7.30 మొ9.00<br>యమగండ కాలం ఉ.10.30 మొ12.00<br>వారదుర్ముహూర్తం మ.12.24 మొ1.12<br>మ.2.48 మొ3.36 | | **5**<br>దశమి రా.2.24<br>పుష్యమి రా.12.30<br>వ.ఉ.9.28ల10.58<br>తి.రా.1.16ల4.23 | **12**<br>విదియ రా.8.21<br>స్వాతి రా.11.15<br>వర్జ్యంలేదు | **19**<br>అష్టమి ఉ.6.55<br>ఉత్తరాషాఢ మ.1.05<br>వ.సా.5.32ల7.17 | **26**<br>పూర్ణిమ ఉ.9.20<br>అశ్విని సా.6.45<br>వ.మ.2.48ల4.21<br>తి.రా.3.58ల5.30 |
| TUE మంగ<br>రాహు కాలం మ.3.00 మొ4.30<br>యమగండ కాలం ఉ.9.00 మొ10.30<br>వారదుర్ముహూర్తం ఉ.8.24 మొ9.12<br>రా.10.48 మొ11.36 | | **6**<br>ఏకాదశి రా.12.25<br>ఆశ్లేష రా.11.13<br>వర్జ్యంలేదు | **13**<br>తదియ రా.9.22<br>విశాఖ రా.12.52<br>వ.రా.11.37ల1.43<br>తి.రా.తె 5.18ల | **20**<br>నవమి ఉ.8.39<br>శ్రవణం మ.3.16<br>వ.రా.7.39ల9.22 | ఆశ్వయుజం **27**<br>బ.పాడ్యమి ఉ.7.51<br>త.విదియ ఉ.6.08<br>భరణి సా.5.48<br>వ.రా.తె 5.11ల |
| WED బుధ<br>రాహు కాలం మ.12.00 మొ1.30<br>యమగండ కాలం ఉ.7.30 మొ9.00<br>వారదుర్ముహూర్తం ఉ.11.36 మొ12.24 | | **7**<br>ద్వాదశి రా.10.38<br>మఖ రా.10.09<br>వ.ఉ.10.41ల12.13<br>తి.రా.తె.5.51ల | **14**<br>చవితి రా.10.50<br>అనూరాధ రా.2.56<br>శే.వ.ఉ.7.02 | **21**<br>దశమి ఉ.9.58<br>ధనిష్ఠ సా.5.01<br>వ.రా.12.37ల2.18 | **28**<br>తదియ రా.తె.4.01<br>కృత్తిక సా.4.33<br>శే.వ.ఉ.6.42 |
| THU గురు<br>రాహు కాలం మ.1.30 మొ3.00<br>యమగండ కాలం ఉ.6.00 మొ7.30<br>వారదుర్ముహూర్తం ఉ.10.00 మొ10.48<br>మ.2.48 మొ3.36 | భాద్రపదం **1**<br>బ.పంచమి మ.2.11<br>కృత్తిక ఉ.8.32<br>వ.రా.11.37ల1.07 | **8**<br>త్రయోదశి రా.9.16<br>పుబ్బ రా.9.29<br>శే.వ.ఉ.7.24<br>తి.రా.తె.4.37ల | **15**<br>పంచమి రా.12.37<br>జ్యేష్ఠ రా.తె.5.20<br>వ.ఉ.9.00ల10.46 | **22**<br>ఏకాదశి ఉ.10.50<br>శతభిషం సా.6.20<br>వ.రా.1.02ల2.41 | **29**<br>చవితి రా.1.46<br>రోహిణి మ.3.08<br>వ.ఉ.7.41ల9.11<br>తి.రా.8.17ల9.46 |
| FRI శుక్ర<br>రాహు కాలం ఉ.10.30 మొ12.00<br>యమగండ కాలం మ.3.00 మొ4.30<br>వారదుర్ముహూర్తం ఉ.8.24 మొ9.12<br>మ.12.24 మొ1.12 | **2**<br>షష్ఠి ఉ.11.56<br>రోహిణి ఉ.7.03<br>త.మృగశిర రా.తె.5.26<br>వ.మ.12.05ల1.42 | **9**<br>చతుర్దశి రా.8.20<br>ఉత్తర రా.9.14<br>శే.వ.ఉ.6.12<br>తి.రా.తె.5.41ల | **16**<br>షష్ఠి రా.2.44<br>మూల పూర్తి<br>వర్జ్యంలేదు | **23**<br>ద్వాదశి ఉ.11.13<br>పూర్వాభాద్ర రా.7.10<br>వ.రా.తె.4.53ల | **30**<br>పంచమి రా.11.21<br>మృగశిర మ.1.30<br>వ.రా.9.19ల10.48 |
| SAT శని<br>రాహు కాలం ఉ.9.00 మొ10.30<br>యమగండ కాలం మ.1.30 మొ3.00<br>వారదుర్ముహూర్తం ఉ.6.00 మొ7.36 | **3**<br>సప్తమి ఉ.9.30<br>ఆరుద్ర రా.3.42<br>వ.మ.1.14ల2.43 | **10**<br>అమావాస్య రా.7.49<br>హస్త రా.9.24<br>శే.వ.ఉ.7.18<br>తి.రా.తె.5.32ల | **17**<br>సప్తమి రా.తె.4.53<br>మూల ఉ.8.01<br>వ.ఉ.6.06ల8.01<br>తి.సా.5.14ల7.01 | **24**<br>త్రయోదశి ఉ.11.02<br>ఉత్తరాభాద్ర రా.7.28<br>శే.వ.ఉ.6.30 | **31**<br>షష్ఠి రా.8.55<br>ఆరుద్ర ఉ.11.49<br>వ.రా.11.00ల12.29 |

| తేది | సూ.ఉ. | సూ.అ. |
|---|---|---|
| 1 | 6.07 | 6.06 |
| 5 | 6.07 | 6.02 |
| 10 | 6.08 | 5.57 |
| 15 | 6.09 | 5.54 |
| 20 | 6.11 | 5.52 |
| 25 | 6.12 | 5.48 |
| 30 | 6.14 | 5.46 |

మీ కోసం...

1
2
3
4
5
6
7
8
9
10
11
12
13
14
15
16
17
18
19
20
21
22
23
24
25
26
27
28
29
30
31

# అభినవ శంకర విజయం

(గత సంచిక తరువాయి)

కావేరీ నది శ్రీ లలితాదిత్యకవికి స్వామివారి పద్యధారవలె తోచింది.

"అదభ్ర విభ్రమ భ్రమన్మహాతరంగ భంగులన్
నదీవరేణ్య స్వాదుతాగుణ ప్రసన్నధారయై
పదప్రమాణవేది యోగివర్యు శుద్ధరస్య స
త్పదప్రయోగరమ్యమైన పద్యధార బోలెడిన్"

అని అద్భుతమైన పద్యం అందించారు శ్రీ లలితాదిత్య కవి.

"ధారాశుద్ధి ప్రసిద్ధిగాంచి... అఖిల పద్యాక్రాంత మయ్యేన్" అని అయ్యలరాజు రామభద్రకవి రామాభ్యుదయంలో చేసిన వర్ణనను తలపింప చేస్తోంది ఈ పద్యం. పద్యం కావేరినదిలా ఉండటం కాదు, కావేరినది పద్యంలా ఉన్నది- అనటం ఇక్కడి విశేషం.

ఆ కావేరీనదిలో స్నానమాడి, అర్చనలు నిర్వహించి, విప్రోత్తములకు దానాలు ఇప్పించి, అక్కడినుండి మండ్య, మద్దూరు, శివసముద్రము మొదలైన నగరాలన్నీ దాటి, 'సత్యమంగలము' అనే ప్రదేశంచేరి, అక్కడ స్వామివారు చాతుర్మాస్య దీక్ష స్వీకరించారు. ఆ యాత్రలో భాగంగా 'అయ్యంపాళయం' గ్రామంలో సుబ్రహ్మణ్య ప్రతిష్ఠచేసి, పళని చేరుకున్నారు స్వామివారు. పళని క్షేత్ర అధిదైవతమైన సుబ్రహ్మణ్యుని ప్రస్తుతిస్తూ, "శ్రీ దండాయుధపాణి పంచరత్న" స్తోత్రం రచించారు.

ఆ స్తోత్రానికి భావానువాదం చేస్తూ, స్వీయ ప్రతిభను జోడించి అద్భుతమైన పద్యాలు రచించారు "శతావధాన శతధృతి" శ్రీ లలితాదిత్యకవి.

ఆ పద్యాలు చిత్తగించండి.

"తారకదైత్యనిర్దళను ధర్మముఖార్థచతుష్టయప్రదుం
దారలరేని షడ్వదనధామమచే నగువాని, వేదకాం
తార మృగేశ్వరున్, వివృత తారరహస్యు, మహాభవాబ్ధిసం
తారకు దండపాణిని సదా స్మరియింతు హృదంబుజంబునన్"

(తారకాసుర సంహారం చేసినవాడు, చతుర్విధ పురుషార్థాలనూ ప్రసాదించేవాడు, చందమామ వంటి ఆరు ముఖాలతో చిరునవ్వులు చిందించేవాడు, వేదమనే అరణ్యానికి మృగరాజైన సింహమై విరాజిల్లే వాడు, ధ్యానమూర్తి అయినవాడు, భవసాగరాన్ని దాటించేవాడు అయిన ఆ స్వామిని





మల్లాప్రగడ
శ్రీమన్నారాయణ మూర్తి

నా హృదయపద్మంలో నిలిపి ధ్యానిస్తాను) అనే ఈ పద్యంలో 'తార' అనే పదం నాలుగు పాదాలలోనూ ఐదు సార్లు అర్థభేదంతో ప్రయోగించారు కవి.

"ఎవ్వాని పాదంబు లెన్నినంతనె చండ
కిల్బిషంబులు సంక్షీణములగు;
నెవ్వాని గండము లినమూర్తు లనగ ద్వా
దశకుండలంబుల దర్పణములు;
తారకశూరపద్మప్రముఖాసురు
లెవని దోస్సార వహ్నిన్ మిడుగురు;
లెవ్వండు వల్లీ మహేంద్రపుత్రీ భుజా
పరెరంభణైక పంజర శుకంబు
వానిఁగకుబీశకోటీర వజ్రకాంతి
కాంతచరణాంతకునినంత కాంతసుతునిఁ
గాయరుచిధూత గాంగేయు కార్తికేయు
భావమునఁగొల్తు భక్తమనో విధేయు."

(సుబ్రహ్మణ్యుని పాదాలను హృదయంలో భావించినంతనే భయంకరమైన పాప ప్రవాహాలు క్షీణిస్తాయి.

ఆ స్వామి చెక్కిళ్ళు ద్వాదశాదిత్యుల వలె ఉన్న కుండలాల కాంతి ప్రతిఫలించే అద్దాలు.

తారకుడు, శూరపద్ముడు మొదలైన రాక్షసులు ఆ స్వామి భుజపరాక్రమం ముందు మిణుగురు పురుగులు.

వల్లీ దేవసేనల కౌగిళ్ళ పంజరాలలో చిలుక ఆ స్వామి.

దిక్పాలకుల శిరస్సులమీది కిరీటాల వజ్రకాంతులతో ఆ

స్వామి పాదాలు ప్రకాశిస్తున్నాయి.

యముణ్ణి జయించిన పరమేశ్వరుడి పుత్రుడు ఆ స్వామి.

అగ్నిని మించిన తేజస్సుతో వెలిగిపోతున్న భక్త మనో విధేయుడైన ఆ కార్తికేయుణ్ణి నా హృదయంలో కొలుచుకుంటాను).

అంటూ....కార్తికేయుని దివ్యవైభవాన్ని ప్రౌఢ సుందరంగా ఆవిష్కరించారు లలితాదిత్యకవి.

"ఇమ్మగ త్రిజగద్ఘటమును
కుమ్మరియై తాన మలచు
కొనుననగా దండమ్మును జేతధరించి, న
గమ్మున విలసిల్లు వహ్ని గర్భుని౯గొలుతున్"

(ఆ స్వామి పర్వతంపై వసించిన అగ్ని గర్భుడు. ఆ స్వామిచేతిలో దండం ఉన్నది. సారెపై త్రిప్పి ముల్లోకాలు అనే కుండను మలచుకోవటానికా అన్నట్లు తన చేతిలో దండం ధరించాడు ఆ స్వామి.)

సుబ్రహ్మణ్యుడే ముల్లోకాలనూ సృష్టించాడని నిరూపిస్తూ, అద్భుతమైన ఉత్ప్రేక్షా సౌందర్యంతో సొగసు లీనుతున్నది ఈ పద్యం.

"రోషాది హృద్గదములకు భేషజమిదె యగును నన్ను
వేడుట యనుచున్ ఘోషింపననగ నిచ్చట
నోషధిమయమూర్తిగొన్న యుమ
సుతు నెంతున్"




(ఓషధిమయమూర్తి అయిన ఆ స్వామి, కామ క్రోధాది సమస్త వ్యాధులకూ ఔషధం) చక్కని రూపకాలంకార సౌందర్యం వన్నెలొలుకుతున్న పద్యం ఇది.

"శరవణభవ శరవణభవ శరవణభవయనుచు నిన్ను
శరణనువారల్ శరనిధి శరభాదిక మృగ
శర వన భవములకు వెఱువ జాలరు దేవా!"

(స్వామీ! శరవణభవా! నిన్ను శరణన్నవారికి సముద్రాలు, క్రూరమృగాలు, బాణాలు, అరణ్యం, సంసారం/పుట్టుక అనే వాటివల్ల ఏ భయమూ లేకుండా అభయమిచ్చే భయాపహ మూర్తివి నువ్వు).

శరవణ భవ- శబ్దాన్ని- శర, వన, భవ అంటూ అర్థభేదంతో పునరావృత్తి చేసి, స్వామి అభయప్రదాయక తత్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన అందమైన పద్యం ఇది.

(సశేషం)



# ధృతరాష్ట్రుని ఆశ్రమ వాసం



డా. ఎమ్వీఎస్ సత్యనారాయణ

వైశంపాయనుడు ధృతరాష్ట్రుని ఆశ్రమవాసం గూర్చి జనమేజయునితో ఇంకా ఇలా చెప్పసాగాడు. రాజా! రాజ్యంలో ప్రభుత్వం నడిపే విషయంలో ధృతరాష్ట్రుడి భావాలకు విరుద్ధం కాకుండా, అన్ని విషయాలలో అతనికి ఆనందం కల్గించేలా ధర్మరాజు నడచుకోవడంతో అటు గ్రామవాసులు, ఇటు పట్టణ వాసులు కూడా వారిద్దరి మధ్య భేదం కనలేకపోయారు. ఆవిధంగా తనను ధర్మరాజు గౌరవిస్తూ ఉండడం వల్ల ధృతరాష్ట్రుడికి తన సొంత కొడుకుల కంటే ధర్మరాజుపై అమితమైన ప్రేమ, ఇష్టం కలిగేది. (సొంత కొడుకులు దుర్యోధనాదులు ఏనాడూ తండ్రి మాట వినలేదు. ఈ విషయం లోక విదితమే కదా!)

అయితే భీముడు తన దగ్గరకు వచ్చినప్పుడు మాత్రం ధృతరాష్ట్రునికి తన కొడుకులు గుర్తుకు వచ్చేవారు. వీడే కదా! నా కుమారుడు దుర్యోధనుడిని చంపినవాడు అనుకొంటూ తీవ్ర ఆవేదన చెందేవాడు. అలాగే భీముడికి కూడా ధృతరాష్ట్రుడిని చూడగానే అతని వల్ల తాము పొందిన కష్టాలను గుర్తుకు తెచ్చుకుని తీవ్రమైన కోపాన్ని ప్రదర్శించేవాడు. ఇలా వీరిద్దరి మనస్సులలో ఒకళ్ల మీద ఒకరికి తీవ్రమైన కోపం, అమితమైన ద్వేషం కలిగి ఉన్నప్పటికీ పరస్పరం మాట్లాడుకొనేటప్పుడు బంధువులు, సేవకులు మెచ్చుకొనేటట్లు తియ్యగా మాట్లాడుకొనేవారు. మాటలలో మెత్తదనం తెచ్చిపెట్టుకొనేవారు.

ధృతరాష్ట్రుడు ఒంటరిగా ఉన్నప్పుడు భీముడు అతని దగ్గరకి వెళ్లి గాంధారికి కూడా వినిపించేటట్లు ఇలా అనేవాడు- గుడ్డివాడి కొడుకులలో ఒక్కడు కూడా మిగలకుండా అందరినీ చంపేశాను. మదించిన నా భుజములు అనే బోనులోకి ప్రవేశించిన శత్రువులైన రాజులనే సింహాలకు బయటపడడం సాధ్యమా? ఆ కౌరవులు తెలివితక్కువవారు, వట్టి మూర్ఖులు కాబట్టి పరాక్రమవంతులమైన మా శక్తిసామర్థ్యాలు తెలుసుకోలేక ఎదిరించి చనిపోయారు. భయంకరమైన యుద్ధంలో దుర్యోధనాదులను కూల్చిన ఈ నా భుజాలకు మంచి గంధాన్ని పూసి, పూలమాలలు అలంకరించి నమస్కరిస్తాను. ఆలోచిస్తే ఇదంతా ఆ దేవతలు చేసిన గొప్ప ఉపకారం వల్లనే జరిగింది.

ధృతరాష్ట్ర గాంధారులు నొచ్చుకునేటట్లుగా భీముడు మాట్లాడడం ధర్మరాజుకూ, అర్జునుడికీ, కుంతికి, ద్రౌపదికి తెలియవు. అయితే అప్పుడప్పుడు భీముని మాటలు నకుల సహదేవుల చెవిన పడేవి. వారిద్దరూ భీముని మాటలు విన్నా, ధర్మరాజు పట్ల ఉన్న భయంతో మనసులో కలత చెందినా మిన్నకుండేవారు. ఇక గాంధారీ ధృతరాష్ట్రులు ఇది కాల ప్రభావం- మనం చేయగల్గింది ఏదీ లేదు అనుకొని మనసులలో బాధ పడుతూ మిన్నకుండేవారు. ఈ విధంగా పదిహేనేళ్లు గడిచాయి.

ఒకనాడు ధృతరాష్ట్రుడు బంధువు లందరినీ పిలిపించాడు. ధర్మరాజును కూడా రమ్మన్నాడు. ధర్మరాజు వింటుండగా, గద్గద కంఠంతో ఇలా అన్నాడు. "నా కారణంగానే కౌరవులంతా నాశనమైనారని మీ అందరికీ బాగా తెలుసు. 'కురువు' అనే పేరు కల్గిన ఈ రాజ్యానికి బుద్ధిలేనివాడూ, దుష్టబుద్ధీ, మిక్కిలిగా ఇతరుల ద్రవ్యాలను అపహరించాలనే కోరిక కలవాడూ, దాయాదులకు కీడు చేసేవాడూ అయిన దుర్యోధనుడిని రాజును చేశాను. శ్రీకృష్ణుడు చేసిన హితబోధను పెడచెవిన పెట్టాను. దుర్యోధనుడి పట్ల ఉన్న అధికమైన ప్రేమ వల్ల సంకోచంతోనూ, తన మాట వినేంతవరకూ విడవకుండా ఒత్తిడి చేసేవాడూ అయిన అతని పట్ల ఏనాడూ మంచి మాటలు గట్టిగా



చెప్పలేకపోయాను. పితామహుడైన భీష్ముడు, పిల్లలకు అస్త్రవిద్యను నేర్పిన ద్రోణుడు, ఎల్లప్పుడూ సుభాషితాలను వల్లెవేసే విదురుడు, సంజయుడు- ఇలా ఎంతోమంది కర్తవ్యాన్ని చెప్పినా- చివరికి గాంధారి మరీ మరీ నొక్కి చెప్పినా వారందరి పలుకులనూ నిరాదరణతో వినిపించుకోలేదు.

ఎవరు చెప్పినా వినకుండా చివరకు కొడుకులందరినీ పోగొట్టుకున్నాను. ఈ విషయం నా మనస్సులో ములుకై క్షణక్షణం బాధిస్తోంది. యుద్ధరంగంలో వరుస అపజయాలు కలుగుతున్నా, నా కుమారులు పారిపోయి వెనుకకు రాకుండా వీరోచితంగా పోరాడి, మరణించి ఊర్ధ్వ లోకాలకు చేరుకొన్నారు. ఇది క్షత్రియులకు తగిన లక్షణం అని భావించి వారి మరణానికి అప్పుడు బాధపడలేదు. మీదు మిక్కిలి సంతోషించాను.

రాజశ్రేష్ఠుడా! ధర్మరాజా! నీవు ఏ లోటూ లేకుండా చూస్తుండడం వలన రాజభోగాలు అనుభవిస్తూ సుఖంగా ఉంటున్నాను. అందువల్లనే నేను అనేక దానధర్మాలు చేయగలుగుతున్నాను. దుర్యోధనాదులకు శ్రాద్ధాలు అనేకసార్లు చేశాను. ఉత్తమురాలైన పాంచాలిని పరాభవించి, నీ సంపదలను నా కుమారులు కాజేశారు. అటువంటి దుర్మార్గపు నడత కల్గిన దుర్యోధనాదులను యుద్ధంలో చంపి నీవు న్యాయంగానే నడచుకున్నావు. యుద్ధరంగంలో వీర మరణం పొందడం వల్ల ఉత్తమలోక నివాసాన్ని పొందారు. వాళ్లకు దాన శ్రాద్ధాది కార్యాలు అనేకం చేశాను. కాబట్టి వారి కొరకు కొత్తగా చేయవలసింది ఏమీ లేదు. ఇప్పుడు నీతో నా విషయమే చెప్పుకోవలసి ఉన్నది.

ధర్మరాజా! ముందుగా రాజు నుండి అనుమతి తీసికోకుండా, ఆ రాజ్యంలో వాడు ఎవడైనా, ఎటువంటి పనినైనా ప్రారంభించకూడదు. ఇప్పుడు ముసలితనం నా శరీరాన్ని మింగేస్తోంది. ఈ శరీరాన్ని శుద్ధి చేయాలంటే తపస్సు చేయాలి. అందుకు నీవు అనుమతించాలి. క్షత్రియుడైనవాడు యుద్ధంలోనైనా మరణించాలి. లేదా తపస్సులోనైనా శరీరాన్ని విడిచిపెట్టాలి. మన పూర్వీకులు ఈ పద్ధతినే అనుసరించారు. కాబట్టి తపస్సు చేసుకోవడం కోసం నన్ను అడవులకు పంపు.''

వైశంపాయన మహర్షి జనమేజయునికి ఈ వృత్తాంతాన్ని వివరించి ''రాజా! ధృతరాష్ట్రుడు ఈవిధంగా ధర్మరాజు, వ్యాసుని అనుమతితో అడవులకు వెళ్లాడు.''

(సమాప్తం)


అద్భుతమైన స్తోత్ర సంపద, ఇప్పుడు మీకు అందుబాటులో ఈ వెబ్‌సైట్ లో !!

stotranidhi.com

తెలుగు | ಕನ್ನಡ | தமிழ் | देवनागरी | english

- దేవ, ఋషి ప్రోక్త స్తోత్రములు
- మహా మహిమాన్వితమైన స్తోత్రములు
- అరుదుగా లభించే విశేష స్తుతులు
- పూజా విధానములు, వ్రతములు
- అష్టోత్తరములు, సహస్రనామములు
- స్వరసహిత వేద సూక్తములు
- సంధ్యావందనం, సుందరకాండ
- శ్రీమద్భగవద్గీత, దుర్గా సప్తశతీ
- కీర్తనలు, మంగళ హారతులు
- ... ఇంకా ఎన్నెన్నో !!

www.stotranidhi.com




Scan this QR code to visit website

పూజా కార్యక్రమాలలో, పండుగ రోజులలో, ఆలయాలలో మరియు మీ దైవకార్యాలలో పఠించండి, తరించండి !!

Email: stotranidhi@gmail.com /stotranidhi Download on the App Store GET IT ON Google Play




(గత సంచిక తరువాయి)

◆ అహం తుష్టుషుః: అటువంటి అనంతమైన గుణాలను స్తుతించాలని కోరుకుంటున్న నేను 'అహహ' (ఎంతో ఆశ్చర్యం!) అత్యంత సాహసానికి ఒడిగడుతున్నాను.

3. చంద్రబింబం - హస్తాల పోలిక:

◆ ఆకాశంలోని శీతకిరణుడిని (చంద్రుడిని)తన రెండు చేతులతో పట్టుకోవాలని ప్రయత్నించే బాలుని బుద్ధి ఎంతటి సాహసంతో కూడుకున్నదో, శంకరాచార్యుల గుణాలను వర్ణించాలనుకుంటున్న నా ప్రయత్నం కూడా అటువంటిదే అని కవి తన వినయాన్ని చాటుకున్నారు.

4. సాహిత్య విశేషాలు:

◆ అలంకారము: ఇందులో 'నిదర్శనాలంకారం' ఉంది. సంభవించని వస్తువుల సంబంధాన్ని (చంద్రుడిని చేతులతో పట్టుకోవడం) కవి తన ప్రయత్నంతో పోల్చడం వల్ల ఇది నిదర్శనాలంకారం అయింది.

◆ ఛందస్సు: ఈ శ్లోకం శిఖరిణీ అనే ఛందస్సులో ఉంది.

**తథా2ప్యుజ్జృంభంతే మయి విపులదుగ్ధాబ్ధిలహరీ-**
**లలత్కల్లోలాలీలసితపరిహాసైకరసికాః ।**
**అమీ మూకాన్వాచాలయితుమపి శక్తా యతిపతేః**
**కటాక్షాః కిం చిత్రం భృశమఘటితాభీష్టఘటనే ॥ 13**

తాత్పర్యం : క్షీర సాగరపు అలల వలె స్వచ్ఛమైన శంకర భగవత్పాదుల కటాక్షం నాపై ప్రసరిస్తోంది. మూగవారిని కూడా మహా పండితులుగా మార్చగల ఆ చూపులు, నా వంటి అల్పుడి కోరికను నెరవేర్చి ఈ కావ్యాన్ని పూర్తి చేయించడం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు.

వ్యాఖ్య : 1. గురు కటాక్షం - క్షీర సాగర పోలిక:

◆ విపుల దుగ్ధాబ్ధి లహరీ: శంకరాచార్యుల (యతిపతి) కటాక్ష వీక్షణాలు విశాలమైన క్షీర సముద్రపు అలల వలె అత్యంత స్వచ్ఛమైనవి.

◆ పరిహాసైక రసికాః: ఆ తెల్లని అలల వరుసలు ఎలాగైతే నవ్వుతున్నట్లుగా (పరిహాసం) అనిపిస్తాయో, గురువుగారి కటాక్షాలు కూడా అంతటి ప్రకాశంతో, స్వచ్ఛతతో ఉన్నాయి. అవి నాపై ప్రసరిస్తున్నాయి (మయి ఉజ్జృంభంతే).

2. అసాధ్యమైన దానిని సుసాధ్యం చేయడం:

◆ మూకాన్ వాచాలయితుమపి: అమరకోశం ప్రకారం "వాచాటః" అంటే అతిగా మాట్లాడేవాడు అని అర్థం. గురు కటాక్షం లభిస్తే, ఏమీ మాట్లాడలేని మూగవారు సైతం అనర్గళంగా మాట్లాడగలిగే శక్తిని పొందుతారు.

◆ అఘటితాభీష్టఘటనే: సాధారణంగా జరగని (అసాధ్యమైన) కోరికలను కూడా నెరవేర్చడంలో గురు కటాక్షం అత్యంత సమర్థవంతమైనది. అటువంటప్పుడు, అల్పుడనైన నేను ఈ కావ్యాన్ని పూర్తి చేయాలనుకోవడం అనే అసాధ్యమైన పనిని ఆయన నెరవేర్చడంలో ఆశ్చర్యం ఏముంది? (కిం చిత్రమ్).

3. వివరణ:

◆ వాగింద్రియ లోపం ఉన్నవారిని కూడా విద్వాంసులుగా మార్చగల శక్తి ఆ యతిపతి కటాక్షానికి ఉంది. కాబట్టి, నా ఈ కావ్య రచన ఆయన కృప వల్ల తప్పకుండా సఫలమవుతుందని కవి ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**అస్మజ్జిహ్వాగ్రసింహాసనముపనయతు స్వోక్తిధారాముదారా-**
**మద్వైతాచార్యపాదస్తుతికృతసుకృతోదారతా శారదామ్బా।**
**నృత్యన్మృత్యుంజయైశ్చైర్మకుటతటకుటీనిఃస్రవత్స్వఃస్రవంతీ**
**కల్లోలోద్వేలకోలాహలమదలహరీఖండపాండిత్యహృద్యామ్ ॥ 14**

తాత్పర్యం :

పరమశివుడి జటాజూటం అనే నాట్యశాల నుండి బయటకు వచ్చి, భూమి మీదకు ఉరకలు వేస్తూ పారుతున్న గంగానది తరంగాలకు చాలా వేగం, గంభీరత ఉంటాయి."నా గురువు గారి గుణాలను కీర్తించే క్రమంలో.. నా మాటల ప్రవాహం ఆ గంగానది అలల గర్వాన్ని కూడా అణచివేసేలా (అంతటి గంభీరంగా, పవిత్రంగా) ఉండాలి. అటువంటి అద్భుతమైన భావ వ్యక్తీకరణ శక్తిని సరస్వతీ దేవి నాకు అనుగ్రహించుగాక!"




వ్యాఖ్య :

ఈ శ్లోకంలో కవి తన కావ్య రచన సఫలం కావాలని జగన్మాత అయిన సరస్వతీ దేవిని ప్రార్థిస్తున్నారు.

1. మనఃస్థిరత్వం కోసం ప్రార్థన:

శంకరాచార్యుల వంటి మహనీయుల చరిత్రను రాయడం తన వంటి అల్పుడికి సాధ్యం కాదనే భయం ఉన్నప్పటికీ, మనస్సును స్థిరం చేసుకుని కవి ఇప్పుడు జగజ్జనని అయిన సరస్వతీ దేవిని (శారదాంబను) ప్రార్థిస్తున్నారు.

2. శారదాంబ అనుగ్రహం:

◆ అద్వైతాచార్యపాదస్తుతి: అద్వైత మత స్థాపకులైన శ్రీ శంకరాచార్యుల పాదాలను స్తుతించడం ద్వారా కలిగే పుణ్యం వల్ల శారదామాత అనుగ్రహం కలుగుతుంది.

◆ ఆ పుణ్యం వల్ల కలిగే ఉదారతతో శారదాదేవి తనపై కరుణ చూపాలని కవి కోరుకుంటున్నారు.

3. గంగానది హోరును మించిన పాండిత్యం:

◆ నృత్యన్మృత్యుంజయ: నాట్యం చేస్తున్న పరమశివుని జటాజూటం నుండి ప్రవహించే దేవగంగ (స్వర్గగంగ) శబ్దం ఎంతో గంభీరంగా ఉంటుంది.

◆ ఆ గంగానది అలల ఉద్ధృతికి ఉండే గర్వాన్ని (మదాన్ని) కూడా అణచివేయగల అనర్గళమైన, విశాలమైన వాక్ ప్రవాహాన్ని (వాక్కును) ప్రసాదించమని కవి అడుగుతున్నారు.

◆ అటువంటి పాండిత్యంతో నిండిన తన వాక్కు మనోహరంగా ఉండాలని ఆయన కోరిక.

4. జిహ్వాగ్ర సింహాసనం:

◆ సరస్వతీ దేవి తన వాక్ ప్రవాహాన్ని ఎక్కడో కాదు, నేరుగా తననాలుక చివర (జిహ్వాగ్రం) అనే సింహాసనం మీద ఉంచాలని కవి ప్రార్థిస్తున్నారు. ఇక్కడ 'ఉపనయతు' (అందించు/చేర్చు) అనే పదాన్ని ప్రార్థనా పూర్వకమైన ఆజ్ఞార్థకంలో (లోట్ లకారం) ఉపయోగించారు.

5. ఛందస్సు:

◆ ఈ శ్లోకం 'స్రగ్ధర' (స్రగ్ధర)అనే ఛందస్సులో ఉంది.

శారదాంబ - శబ్దబ్రహ్మ స్వరూపిణి:

◆ శారదేతి: శ్రుతి వాక్యం ప్రకారం ("స భూరితి వ్యాహరత్..."), సృష్టి అంతా శబ్దబ్రహ్మ లేదా ప్రణవనాదం(ఓంకారం) నుండి ఉద్భవించింది.

◆ ఈ సకల ప్రపంచ సృష్టికి మూలమైన శబ్దబ్రహ్మను అధిష్ఠించి, తన విగ్రహం (రూపం) ద్వారా సకల విజ్ఞానాన్ని ప్రసాదించే మాయాశక్తియే శారదాదేవి.

◆ ఆమె జగత్తు మొత్తానికి జన్మనిచ్చిన తల్లి (జగజ్జనని) కాబట్టి, ఆమెను 'అంబ' అని పిలవడం సర్వదా సముచితం.

స్వోక్తిధారా - వాక్ ప్రవాహం:

◆ స్వోక్తిధారా: తన అంతరాత్మ నుండి వెలువడే మాటల ప్రవాహం.

◆ మదానంద: ఆ మాటల ద్వారా కలిగే గొప్ప ఆనందానుభూతి.

◆ ఆరః: మేదినీ కోశం ప్రకారం ("ఆరా చర్మప్రభేదిన్యాం..."), 'ఆర' అంటే ఒక రకమైన సూది వంటి పనిముట్టు లేదా ఒక పనిలో ఉండే సూక్ష్మమైన అగ్రభాగం అని అర్థం.

◆ ఇక్కడ కవి తన వాక్చాతుర్యంతో కలిగే ఆనందం యొక్క ప్రారంభ దశను (ప్రథమావస్థను) తన నాలుకపై ప్రసాదించమని శారదాదేవిని కోరుకుంటున్నారు.

**క్వేదం శంకరసద్గురోః సుచరితం క్వాహం వరాకీ కథం**
**నిర్బంధాసి చిరార్జితం మమ యశః కిం మజ్జయస్యంబుధౌ ।**
**ఇత్యుక్త్వా చపలాం పలాయితవతీం వాచం నియుంక్తే బలాత్**
**ప్రత్యాహృత్య గుణస్తుతౌ కవిగణశ్చిత్రం గురోర్గౌరవమ్ ॥ 15**

(సశేషం)

# మీ రాశి



**మేషం** (అశ్వని 4 పాదాలు, భరణి 4 పాదాలు, కృత్తిక 1వ పాదం)

విందులు, వినోదాలకు దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. మానసికాందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలెదురగును. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం. నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ, లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభ యోగ ముంటుంది. శు భవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.



**వృషభం** (కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి 4 పాదాలు, మృగశిర 1,2 పాదాలు)

ప్రయత్నకార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి. ధైర్యసాహసాలతో ముందుకు వెళ్తారు. కుటుంబ విషయాలపై అనాసక్తితో ఉంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. కొన్నికార్యాలు విధిగా రేపటికి వాయిదా వేసుకుంటారు. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.



**మిధునం**(మృగశిర 3,4 పాదాలు, ఆరుద్ర 4 పాదాలు, పునర్వసు 1,2,3 పాదాలు)

అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుం టాయి. అనవసర భయానికి లోనవుతారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపారరంగంలోనివారు జాగ్రత్తగా నుండుట మంచిది. స్త్రీలు పిల్లలపట్ల మిక్కిలి శ్రద్ధ వహిస్తారు. ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. ఆకస్మిక ధనలాభయోగ ముంటుంది. ప్రయత్నకార్యాల్లో విజయం సాధిస్తారు. బందు, మిత్రులతో కలుస్తారు. క్రీడాకారులు, రాజకీయరంగాల్లో వారు ఉత్సాహంగా ఉంటారు. స్త్రీలు సంతోషంగా కాలక్షేపం చేస్తాం.



**కర్కాటకం** (పునర్వసు 4వ పాదం, పుష్యమి 4 పాదాలు, ఆశ్లేష 4 పాదాలు)

మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్నకార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. చెడుపనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగరంగాల్లో అభివృద్ధి ఉంటుంది. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో జాగ్రత్త అవసరం. తలచిన కార్యాలన్నియు విజయ వంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్యబాధలుండవు.



**సింహం** (మఖ 4 పాదాలు, పుబ్బ 4 పాదాలు, ఉత్తర 1వ పాదం)

ప్రయత్నం మేరకు స్వల్పలాభముం టుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాయింటాయి. ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖసంతోషాలు అనుభవి స్తారు. నూతన వస్తు, ఆభరణాలను పొందు తారు. ప్రయత్నకార్యాలన్నింటిలో విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు. ధైర్యసాహసాలు ప్రదర్శిస్తారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది.



**కన్య** (ఉత్తర 2,3,4 పాదాలు, హస్త 4 పాదాలు, చిత్త 1,2 పాదాలు)

ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడ కుండా జాగ్రత్త వహించుట మంచిది. అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు ఎక్కువ ఖర్చుచేస్తారు. తీర్థయాత్రకు ప్రయత్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు. స్త్రీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం పొందుతారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభ ముంటుంది. కుటుంబం అంతా

సౌఖ్యంగా ఉంటారు. అత్యంత సన్నిహితులను కలుస్తారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి.



**తుల** (చిత్త 3,4 పాదాలు, స్వాతి 4 పాదాలు, విశాఖ 1,2,3 పాదాలు)

ప్రయాణాలు ఎక్కువగా చేయాల్సి వస్తుంది. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. అనవసరంగా డబ్బు ఖర్చుగుటచే, ఆందోళన చెందుదురు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించక తప్పదు. బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహనిర్మాణ ప్రయత్నం చేస్తారు. ఆకస్మిక ధనలాభంతో, ఋణబాధలు తొలగిపోతాయి. కుటుంబ సౌఖ్యముంటుంది. శత్రుబాధలు దూరమవుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తొలగిపోతాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఆకస్మిక ధనలాభముంది.



**వృశ్చికం** (విశాఖ 4వ పాదం, అనూరాధ 4 పాదాలు, జ్యేష్ఠ 4 పాదాలు)

శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరును. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. ప్రయాణాల వల్ల లాభం చేకూరును. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవమర్యాదలు లభిస్తాయి. అన్ని విధాలా సుఖాన్ని పొందుదురు. చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్య కారణంతో నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి. కొన్ని పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది.



**ధనుస్సు** (మూల 4 పాదాలు, పూర్వాషాఢ 4 పాదాలు, ఉత్తరాషాఢ 1వ పాదం)

విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా వుంటుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు. మెలకువగా నుండుట అవసరం. స్థానచలన మేర్పడే అవకాశాలుంటాయి. ఋణలాభం పొందుతారు. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా నుండాలి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలుంటాయి. స్థిరాస్తుల విషయంలో జాగ్రత్తగా నుండుట మంచిది. ఒక అద్భుత అవకాశాన్ని కోల్పోతారు. నూతన వ్యక్తుల పరిచయ మేర్పడుతుంది. ప్రయాణాల వల్ల లాభాన్ని పొందుతారు. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతనకార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.



**మకరం** (ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం 4 పాదాలు, ధనిష్ఠ 1,2 పాదాలు)

ఇతరులచే గౌరవింపబడే ప్రయత్నంలో సఫలమవుతారు. కుటుంబపరిస్థితులు సంతృప్తికరంగా లేనందున మానసికాందోళన చెందుతారు. ప్రతిపని ఆలస్యంగా పూర్తిచేస్తారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుండును. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందు లతో సతమతమవుతారు. నూతనకార్యాలు ప్రారంభించకుండా నుండుట మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు.



**కుంభం** (ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం 4 పాదాలు, పూర్వాభాద్ర 3 పాదాలు)

కుటుంబకలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా వుంటాయి. ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితు లను కలుస్తారు. ఇతరులకు మంచి సల హాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధైర్యసాహసాలతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. శుభవార్తలు వింటారు. కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది.



**మీనం** (పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర 4 పాదాలు, రేవతి 4 పాదాలు)

ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్యబాధలుంటాయి. వృథాప్రయాణాలు చేస్తారు. స్థానచలన సూచనలున్నాయి. సన్నిహితులతో విరోధ మేర్పడకుండా మెలగుట మంచిది. బంధు, మిత్రులతో మనస్పర్ధలు రాకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనుకోకుండా డబ్బుచేజారే అవకాశాలున్నాయి. ఆరోగ్య విషయంలో మిక్కిలి శ్రద్ధ అవసరం. శారీరక శ్రమతో పాటు, మానసికాందోళన తప్పదు. చిన్న విషయాలకై ఎక్కువ శ్రమిస్తారు.

- గౌరీభట్ల రామకృష్ణ శర్మ

## పదసంపద-260

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | 4 | ✡ | 5 | 6 | 7 |
| 8 | | ✡ | 9 | | | ✡ | 10 | |
| 11 | | 12 | | ✡ | ✡ | 13 | ✡ | |
| | ✡ | 14 | | 15 | 16 | | 17 | |
| ✡ | 18 | | ✡ | 19 | | | | ✡ |
| 20 | | | | ✡ | 21 | | | 22 |
| 23 | | | ✡ | 24 | ✡ | | ✡ | |
| 25 | | ✡ | 26 | | 27 | | 28 | |
| 29 | | | | | | ✡ | | ✡ |

దర్శనమ్ 22 వ. వార్షికోత్సవం

# ఆధారాలు

### అడ్డం

1. నింగి నుండి మ్రోగే వాక్కు (5)
5. తదనంతరం (3)
8. చిన్న పిల్లల భాషలో నీళ్ళు (2)
9. అలవాటు ఉర్దూలో (3)
10. అదృష్టం, బ్రహ్మ అటునుంచి (2)
11. అయ్యప్ప స్వామికి చేసే పూజ (4)
14. జలధి యొక్క ఒడ్డు(7)
18. బాణం ఇంకోలా (2)
19. నరకము (4)
20. రథంబునకు వికృతి (4)
21. అటు నుంచి నివసించే ప్రదేశము (4)
23. మా దగ్గర మరోలా (3)
25. నయము, భయము లలో ఉన్నది (2)
26. తత్త్వమసి ఇత్యాది నాలుగింటినీ కలిపి అనే పేరు (6)
29. పాపాలను పోగొట్టేది, గంగకు విశేషణం (6)

### నిలువు

1. రాగం తీయడం (4)
2. ఆదిశంకర భగవత్పాదుల జన్మక్షేత్రం (3)
3. పద్మము (4)
4. వాక్కు, వాక్కుల అధిదేవత క్రింది నుంచి పైకి (2)
6. పెరుగు (2)
7. పరిశుద్ధమైనది, యాజ్ఞిక కర్మలలో చేతివేలుకు చుట్టుకునే దర్భ (4)
12. అలంకారం కోసం మెడలో ధరించే మాల, పూసలతో చేసింది (5)
13. కులమత భేదాలు లేకుండా జాతినంతటినీ ఒకటిగా నిలిపేది (7)
15. తలకిందులుగా శయనం (2)
16. అంతఃపురములో గ్రామము (3)
17. ఏడు రోజులు తలకిందులుగా (3)
18. కోరలతో ఆరంభ మయ్యే మొగ్గలు (5)
20. మాయకత్వములేని(4)
22. అబద్ధాలు కానివి (3)
24. విహరించే వాడు (3)
26. ఎంతో గొప్ప (2)
27. ఎంతో ప్రధానమైన (2)

**పద సంపాదకులు : ఎం. దత్తాత్రేయశర్మ**

**పదసంపద సమాధానాలు**

పేరు ____________________

విలాసం ____________________

____________________

పిన్ ____________ ఫోన్ ____________

పద సంపద సమాధానాలను ఈ నెల 15 తేదీలోగా మా చిరునామాకు పంపాలి.

**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

ఇం.నెం. 29-105/4/1, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56

మీ అభిప్రాయాలను baludarshanam@gmail.comకు పంపగలరు.

### పదసంపద-259 సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 క | ల | 2 క | 3 ల | ✡ | 4 హ | 5 రి | క | 6 థ |
| డ | ✡ | 7 శ | వం | ✡ | 8 ల | వ | ✡ | క |
| 9 దా | 10 వా | ✡ | 11 గీ | 12 త | ము | ✡ | 13 క | ట్ట |
| 14 క | ల | 15 క | ✡ | డి | ✡ | 16 క | చ్ఛ | పి |
| ✡ | 17 ఖి | ల | ము | ✡ | 18 పి | ద | ప | ✡ |
| 19 శ | ల్యు | డు | ✡ | 20 వి | ✡ | 21 న | ము | 22 జ |
| 23 కా | లు | ✡ | 24 క్ష | రా | 25 సా | ✡ | 26 లు | వా |
| రం | ✡ | 27 కృ | త్రి | మ | మే | 28 ధ | ✡ | ది |
| ✡ | 29 తృ | తీ | య | ✡ | 30 రి | ర్త | క | ✡ |

### సెప్టెంబర్ నెల విజేతలు

**కాశీభట్ల మంజులాదత్తా**
ఆదోని

**కీసర కృష్ణప్రియ**
మిల్టన్, కెనడా

**గుళ్లపల్లి ఉదయ కుమార్**
సత్యనారాయణపురం, విజయవాడ

**భండారు శ్రీనివాసరావు**
ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్

**గుడి చంద్రశేఖర్**
పెద్దశంకరంపేట్, మెదక్ జిల్లా

**రంగి సత్యనారాయణ**
చైతన్యపురి, హైదరాబాద్

Edited Printed, Published and Owned by Marumamula Rukmini, Printed at Capital Graphics, 118 Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Published at 601, Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Editor: Marumamula Rukmini.




జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థానంలో దర్శనమ్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ తొలి శతావధానం దృశ్యమాలిక






















RNI Regd No. APTEL/2005/16209
Date of Publication : 25th of Every Month
Date of Posting : 28th & 29th of Every Month

DARSHANAM
OCTOBER - 2026

Postal Regd.No. HQ/SD/508/2025-2027
WPP NO:PMG/TS/HQR/SC-01/WPP/2025-2027
Licensed to Post Without Prepayment
Posting at B.P.C - IV Patrika Channel,Nampally,Hyderabad-01




PM Hoist Double Cage, Hyderabad



PM Hoist with 12mts Horizontal rebar carrier, Vijayawada


Curved Hoist Bangladesh



Multi Functional Hoist, Nagpur

CMAC

Mechanisation & Automation in Construction
ISO 9001:2015 CERTIFIED COMPANY
AND
CE CERTIFIED COMPANY

Equipments & Solutions for Infrastructure fraternity.
Residential,
Commercial Infrastructure,
Power, Steel, Cement &
Industrial Infra

Innovation with safety & Sustainability
Export them as Made in India


MFH - CMAC Rambo with Rebar Carrier, Delhi


Chimney SRP, Mumbai


Pre Cast Panel Movement SRP, Hyd.


Anji Khad Cable Stayed Bridge Project,
Dist.: Reasi, Jammu



PMH at Pump House, Kaleshwaram


Bridge Special SRP at Durgam Cheruvu,
Cable Stayed Bridge, Hyd.

**ConMechAuto Consultants India Pvt Ltd.,**
**Head Office** : # 1-3-183/40/19, 2nd Floor, SBI Colony,
Gandhi Nagar, Hyderabad - 500 080, India.
Tel. No.: + 91- 40 - 2754 1464

**Factories :**
Phase 2, Phase 5, IDA Cherlapally,
Hyderabad - 500 051

For Further Details:
**CONTACT : 9393 111 464**
**Email : sales@cmac.co.in**
**www.cmac.co.in**